www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
బుధవారం | 3-9-2025 | పేజీలు: 14 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 156 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, తిథి: ఏకాదశి తె.4:22 తదుపరి ద్వాదశి, నక్షత్రం: పూర్వాషాఢ రా.11:08 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: ఉ.7:57-9:38, దుర్ముహూర్తం: ఉ.11:49-12:39, అమృతఘడియలు: సా.6:04-7:45, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:05, సూర్యాస్తమయం: 6:23 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గడువు విధించినా..
గవర్నర్లు పాటించకపోతే?

గడువు విధించే అధికారం కోర్టులకు ఉందా?

'వీలైనంత త్వరగా బిల్లుల్ని ఆమోదించాలి' అని మాత్రమే రాజ్యాంగంలో ఉంది

కొన్ని ఘటనల ఆధారంగా గవర్నర్లకు, రాష్ట్రపతికి కాలపరిమితి నిర్దేశించలేం

అవసరమైతే కోర్టులు ఉన్నాయి: సుప్రీంకోర్టు

2



ఎయిరిండియా విమానాల్లో
వృద్ధులకు టికెట్‌పై రాయితీ

అంతర్జాతీయ సర్వీసుల్లో 10 శాతం, దేశీయ సర్వీసుల్లో 25 శాతం దాకా..

2



పుట్టిల్లు పొమ్మంది

బీఆర్‌ఎస్ నుంచి కవితపై సస్పెన్షన్ వేటు

- ఆమె పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారు
- కవిత తీరుతెన్నులు పార్టీకి నష్టం కలిగిస్తున్నాయి
- సస్పెన్షన్ ప్రకటనలో వివరించిన బీఆర్ఎస్
- కవితను ఉపేక్షిస్తే మరికొందరు గళం విప్పే ప్రమాదం
- కేసీఆర్‌కు చెప్పి ఒప్పించిన కొందరు ముఖ్య నేతలు
- బహిష్కరణ అనుకుని చివరికి సస్పెన్షన్‌కే పరిమితం
- బహిష్కరిస్తే ఆరేళ్లు తిరిగి రాకుండా పార్టీ నిబంధనలు

కల్వకుంట్ల కవిత.. కేసీఆర్ తనయ మాత్రమే కాదు.. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో.. టీఆర్ఎస్‌లో.. బీఆర్ఎస్‌లోనూ ఇప్పటి దాకా ఓ విడదీయలేని బంధం! తెలంగాణ అంతటా తిరిగినా... బతుకమ్మ పేర్చినా.. బతుకమ్మ ఆడినా.. ఉద్యమ ముఖ్యుల్లో ఆమె ఒకరు! జాగృతికి శ్రీకారం చుట్టి.. ఆ శ్రేణులను మరీ ముఖ్యంగా మహిళలను ఉద్యమంలో భాగం చేశారు! ఇప్పుడు పార్టీతో ఆమెకు పేగు బంధం తెగింది! పుట్టి పెరిగిన పార్టీయే ఆమెను బయటకు పంపేసింది! కన్న తండ్రే ఆ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది!!

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొన్నాళ్లుగా ఊహిస్తున్నదే జరిగింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన కన్నకూతురు, పార్టీ ఎమ్మెల్సీ కవితపై సస్పెన్షన్ వేటు వేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు ఆమెపై ఈ చర్య తీసుకున్నట్లు బీఆర్ఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవలి కాలంలో కవిత వ్యవహార శైలి, ఆమె కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు బీఆర్ఎస్‌కు నష్టం కలిగించే విధంగా ఉన్నాయని తెలిపింది. పార్టీ అధిష్ఠానం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తోందని చెప్పింది. అందుకే పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ కవితను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారని తెలిపింది. సోమవారం రాత్రే కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారని

మిగతా 13వ పేజీలో...

కవిత ఎందుకిలా చేసింది?

ఆమెకు ఏం తక్కువ చేశాను?.. ఎంపీగా గెలిపించాం.. ఓడితే ఎమ్మెల్సీ ఇచ్చాం

మద్యం కేసులో అరెస్టయితే ఎంతో ఖర్చు పెట్టి లాయర్లను పెట్టాను

బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్.. సస్పెండ్ చేస్తే పార్టీ పెడుతుందా? అని ఆరా

కవితను బహిష్కరిస్తే మంచిదన్న జగదీశ్‌రెడ్డి!

13

కవిత కొత్త పార్టీ?

టీబీఆర్ఎస్ లేదా తెలంగాణ రాజ్య సమితి పేరుతో ఏర్పాటుకు అవకాశం

పార్టీ సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని నిర్ణయం

13

నేడు భవిష్యత్తు కార్యాచరణ వెల్లడి

సస్పెన్షన్ దుర్మార్గం: జాగృతి శ్రేణులు

కవిత ఉంటే ఎంత.. పోతే ఎంత

ఎవరో కవిత భుజం మీద తుపాకీపెట్టి కాలుస్తున్నారు.. బీఆర్ఎస్ మహిళా నేతలు

కాంగ్రెస్‌లోకి ఆహ్వానించం: మహేశ్‌గౌడ్



డా. సుధ, డా. నాగేశ్వర్‌రావులకు వైఎస్ స్మారక అవార్డు అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, కేవీపీ, సుభాష్ పాలేకర్, భూపిందర్‌సింగ్ హుడా, రఘువీరారెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు

ప్రాణహిత కట్టి తీరుతాం

వైఎస్ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

తుమ్మిడిహట్టి బ్యారేజీ, ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను నిర్మిస్తాం

రైతాంగానికి సాగు నీరు.. ప్రజలకు తాగు నీరు అందిస్తాం

వైఎస్ స్ఫూర్తితోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం

సమకాలీన రాజకీయాల్లో.. అధికారం ఉన్నప్పుడే మిత్రులు

అధికారం పోయాక మాయమవుతారు.. కేవీపీ అలా కాదు

వైఎస్‌కు పదవులు లేని సమయంలోనూ తోడుగా ఉన్నారు

కేవీపీలా ఉంటామంటూ నా దగ్గరకూ కొందరు వస్తున్నారు

మొదటివారం రమ్మంటే.. రెండోవారం 'అంతా నాదే' అంటున్నారు.. వైఎస్ స్మారక పురస్కార సభలో సీఎం రేవంత్

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో చేపట్టిన ప్రాణహిత-చేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రూ.11వేల కోట్లకు పైగా ఖర్చుతో చేపట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహట్టి బ్యారేజీని పూర్తి చేసి రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, తాండూరు, వికారాబాద్, కొడంగల్‌కు గోదావరి నీటిని అందిస్తామని ఆయన పేర్కొన్నారు. అలాగే..

మిగతా 12వ పేజీలో...

- 'కాళేశ్వరం'పై
  విచారణ జరపండి
  సీబీఐకి సమ్మతి.. సర్కారు జీవో
  కేంద్రం నోటిఫికేషన్ ఇచ్చాకే రంగంలోకి దిగనున్న సీబీఐ 14
- **కేసీఆర్, హరీశ్‌లపై వచ్చే నెల 7 వరకు చర్యలొద్దు!**
  ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
  సీబీఐ దర్యాప్తు జీవోపై జోక్యానికి నిరాకరణ 14
- **కేసీఆర్‌ను బద్నాం చేసే కుట్ర**
  బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళనలు

బీసీ రిజర్వేషన్లకు నేడో, రేపో ప్రత్యేక జీవో! 12

వచ్చేసింది స్వదేశీ చిప్ 'విక్రమ్-32'

సెమీకండక్టర్ల తయారీలో భారత్ చరిత్ర



» దేశీయంగా తయారైన తొలి చిప్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: సెమీకండక్టర్ల తయారీలో భారత్ చరిత్ర సృష్టించింది. ఈ రంగంలో స్వయం సమృద్ధి సాధించే దిశగా వడివడిగా అడుగులు వేస్తున్న భారత్ దేశీయంగా తయారుచేసిన తొలి చిప్ విక్రమ్-32 (విక్రమ్-3201) బిట్ ప్రాసెసర్‌ను మంగళవారం ఆవిష్కరించింది. ఇస్రోకు చెందిన సెమీకండక్టర్ లేబొరేటరీ(ఎస్‌సీఎల్) అభివృద్ధి చేసిన మేడిన్ ఇండియా చిప్‌ను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంగళవారం ప్రారంభమైన సెమికాన్ ఇండియా-2025 సదస్సులో ప్రధాని మోదీకి అందజేశారు. సెమీ కండక్టర్ల రంగంలో స్వయం సమృద్ధి సాధించే లక్ష్యంతో 2021లోనే భారత్ సెమీకండక్టర్ మిషన్‌ను ప్రారంభించింది. కేవలం మూడున్నర ఏళ్లలోనే ఇస్రో తొలి చిప్‌ను విక్రమ్-32ను అందుబాటులోకి తీసుకొచ్చింది. విక్రమ్-32 అనేది కంప్యూటర్ చిప్. అంతరిక్షంలో ఎదురయ్యే అత్యంత కఠిన పరిస్థితులు, వాతావరణాన్ని సైతం తట్టుకునేలా దీన్ని తయారు చేశారు. ఇది -55 డిగ్రీల నుంచి +125 డిగ్రీల ఉష్ణోగ్రతలను సైతం తట్టుకోగలదు. ఇది ఒకేసారి 32 బిట్‌ల నుంచి డేటాను ప్రాసెస్ చేయగలదు. ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్ వంటి పరికరాలకు కాకుండా అంతరిక్ష పరిశోధనల కోసం దీన్ని రూపొందించారు. ఈ చిప్‌లను రాకెట్లు, ఉపగ్రహాలు, లాంచ్ వెహికిల్ ఏవియానిక్స్‌లో వాడనున్నారు.

పీఎస్ఎల్వీ-సీ60లో వినియోగం..

ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ60 ప్రాజెక్టులో విక్రమ్-32ను పరీక్షించారు. ఈ ప్రాజెక్టులోని ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంట్ మాడ్యూల్‌లోని మిషన్ మేనేజ్‌మెంట్ కంప్యూటర్‌లో దీన్ని ఉపయోగించగా.. ఇది అద్భుతంగా పనిచేసింది. సెమికాన్ ఇండియా-2025లో విక్రమ్-32 చిప్‌ను ప్రధాని మోదీకి అందించిన సందర్భంగా కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ మాట్లాడుతూ.. భారత్‌లో కొత్తగా ఐదు సెమీకండక్టర్ యూనిట్ల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. అలాగే ఆరు రాష్ట్రాల్లో రూ.1.60 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులతో 10 ప్రధాన ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని తెలిపారు. డిజైన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ కింద 23కిపైగా డిజైన్ స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నామని, దీంతో ప్రపంచ సెమీకండక్టర్ రంగంలో భారత్ ఓ వెలుగు వెలగనుందని చెప్పారు.

20 శాతం చిప్ ఇంజనీర్లు భారత్‌లోనే

సెమీకండక్టర్ డిజైన్ రంగంలో భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది. ప్రపంచంలోని చిప్ డిజైన్ ఇంజనీర్లలో 20% మంది ఇక్కడే ఉన్నారని బాస్టియన్ రిసెర్చ్ నివేదిక చెబుతోంది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన క్వాల్‌కామ్, ఇంటెల్, ఎన్‌విడియా, బ్రాడ్‌కామ్, మీడియాటెక్ సంస్థలు బెంగళూరు, హైదరాబాద్, నోయిడాల్లో పెద్ద పరిశోధన, అభివృద్ధి, డిజైన్ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నాయి. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని భారత ప్రభుత్వం 2021లో దాదాపు 76వేల కోట్ల విలువైన ప్రోత్సాహకాలు అందిస్తూ సెమికాన్ ఇండియా మిషన్‌ను ప్రారంభించడం వల్లే ఇప్పుడు దేశంలో సెమీకండక్టర్ వ్యవస్థ బలోపేతమైందని ఈ నివేదిక తెలిపింది.

లోకం తీరు



అఫ్గాన్‌లో 1,400కు పెరిగిన మృతుల సంఖ్య

జలాలాబాద్, సెప్టెంబరు 2: అఫ్గానిస్థాన్‌లో సంభవించిన భారీ భూకంపం కారణంగా మరణించిన వారి సంఖ్య మంగళవారం నాటికి 1,400కు చేరుకుంది. మూడువేల మందికిపైగా గాయపడ్డారు. ఈ విషయాన్ని తాలిబాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి ఎక్స్ ద్వారా తెలిపారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. మారుమూల కొండ ప్రాంతాలకు సహాయ బృందాలు వెళ్లే వీలు లేకపోవడంతో అక్కడి పరిస్థితి తెలియరావడం లేదు. ఇళ్లన్నీ మట్టి, కలపతో నిర్మించినవి కావడంతో భూకంపం కారణంగా అవన్నీ నేలమట్టమయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించడంతో తప్పించుకునే అవకాశం లేకపోయింది. తాలిబన్ ప్రభుత్వాన్ని ఒక రష్యా మినహా మిగతా దేశాలేవీ గుర్తించకపోవడంతో అంతర్జాతీయ సాయం అంతగా అందడం లేదు.

'మరాఠా' ఉద్యమకారుడు జరాంగే దీక్ష విరమణ

» హైదరాబాద్ గెజిట్ ప్రకారం కున్బీలకు కుల సర్టిఫికెట్లు

» తద్వారా బీసీ రిజర్వేషన్లు.. మహారాష్ట్ర సర్కారు అంగీకారం



ముంబై, సెప్టెంబరు 2: మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌తో అయిదు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న మనోజ్ జరాంగే (43) మంగళవారం తన ఆందోళనను విరమించారు. ఆయన దీక్ష చేస్తున్న ఆజాద్ మైదాన్‌కు రాష్ట్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు రాధాకృష్ణ వీఖే పాటిల్ వెళ్లి పళ్లరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. హైదరాబాద్ గెజిట్ ఆధారంగా కున్బీ కులస్థులను గుర్తించి, వారికి ఓబీసీ సర్టిఫికెట్లు ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించడంతో జరాంగే శాంతించారు. ఈ మేరకు ప్రభుత్వం గవర్నమెంట్ రిజల్యూషన్ (జీఆర్)ను జారీ చేసింది కూడా. మరఠ్వాడా ప్రాంతం నిజాం పాలనలో ఉన్నప్పుడు మరాఠీల్లో ఎవరెవరు కున్బీ కులంలోకి వస్తారన్నదానిపై 1918లో గెజిట్ విడుదల చేసింది. దీన్నే హైదరాబాద్ గెజిట్‌గా పేర్కొంటున్నారు. ఇతర ప్రాంతాల్లోని కున్బీలకు ఓబీసీ గుర్తింపు ఉండడంతో మరఠ్వాడా ప్రాంతంలోని వారికి కూడా హైదరాబాద్ గెజిట్ ఆధారంగా కున్బీ కుల సర్టిఫికెట్ ఇవ్వనున్నారు. దాని ఆధారంగా ఓబీసీ సర్టిఫికెట్ మంజూరు చేస్తారు.

నటి రన్యారావుకు 102 కోట్ల జరిమానా

బెంగళూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్ట్ అయిన కన్నడ నటి రన్యారావుకు డీఆర్ఐ(డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు రూ.102 కోట్ల జరిమానా విధించారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న హోటల్ నిర్వాహకుడు తరుణ్ కొండరాజుకు రూ.63 కోట్లు, ఆభరణాల వ్యాపారులు సాహిల్ సకరియా, భరత్ కుమార్ జైన్‌లకు చెరో రూ.56 కోట్లు జరిమానా విధించారు. మంగళవారం బెంగళూరు సెంట్రల్ జైలుకు వచ్చిన డీఆర్ఐ అధికారులు ఈ మేరకు నలుగురు నిందితులకు ఒక్కొక్కరికి 250 పేజీల నోటీసులతో పాటు 2,500 పేజీల అనుబంధ పత్రాలను అందజేశారు. నలుగురికీ కలిపి వివరణాత్మక నోటీసులు, అనుబంధ పత్రాలు మొత్తం 11 వేల పేజీలు అందజేశామని డీఆర్ఐ వర్గాలు తెలిపాయి.

ఎమ్మెల్యే అరెస్టు కోసం వెళ్తే...
పోలీసులపై అనుచరుల కాల్పులు!

» అదే అదనుగా పారిపోయిన ఆప్ ఎమ్మెల్యే హర్మీత్ సింగ్

పటియాలా, సెప్టెంబరు 2: పంజాబ్‌లో అధికార ఆప్ ఎమ్మెల్యే హర్మీత్ సింగ్ పోలీసు కస్టడీ నుంచి సినీఫక్కీలో పరారయ్యారు. హర్మీత్ తనను మోసం చేశారంటూ ఓ మహిళ ఫిర్యాదు చేసింది. అత్యాచారం, మోసం, నేరపూరిత కుట్ర ఆరోపణలపై కేసు నమోదు చేసిన పోలీసులు.. మంగళవారం హరియాణాలోని కర్నాల్ జిల్లా డబ్రిలో ఉన్న హర్మీత్ ఇంటికి వెళ్లారు. ఆయన్ని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించేందుకు సిద్ధమవగా.. కొందరు అల్లరిమూకలు, గ్రామస్థులు కాల్పులు జరపడంతో పాటు రాళ్లు రువ్వారు. ఇదే అదనుగా ఎమ్మెల్యే పారిపోయారని, హర్మీత్ కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. భార్యతో విడాకులు తీసుకున్నట్లు నమ్మించి, ఎమ్మెల్యే తనతో సంబంధం కొనసాగించారని, విషయం తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేస్తానంటే తన వీడియోలు బయటపెడతానంటూ బెదిరించారని బాధిత మహిళ ఫిర్యాదులో పేర్కొంది.

పోలీసు నిఘాలోకి చాట్‌జీపీటీ!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: చాట్‌జీపీటీతో సంభాషిస్తున్నారా? జాగ్రత్త! ఒకటికి రెండుసార్లు ఆలోచించి మీ మనసులో మాటలు టైప్ చేయండి! చాట్‌జీపీటీతో మీ సంభాషణలు అత్యంత రహస్యం, సురక్షితం అనుకోవడానికి ఇక ఎంతమాత్రం వీల్లేదు. చాట్‌జీపీటీతో మీ సంభాషణలు కొన్నిసార్లు పోలీసుల దృష్టికి కూడా వెళ్లొచ్చునని, యూజర్లు జరిపే సంభాషణలపై ప్రత్యేక నిఘా ఉంటుందని ఓపెన్ ఏఐ సంస్థ ప్రకటించింది. మరి.. ఎందుకీ నిఘా? అనంటే.. హింసాత్మకచర్యలపై, లేదా ఎవరినైనా లక్ష్యంగా చేసుకొని కలిగించాలనుకునే కష్టనష్టాలపై సంకేతాలను ముందుగానే పసిగట్టేందుకేనని ఓపెన్ ఏఐ పేర్కొంది. ప్రమాదకరమైన సంకేతాలున్న సంభాషణలను గుర్తించి వెంటనే ఓపెన్ ఏఐ సంస్థకు చెందిన స్పెషల్ రివ్యూ టీమ్‌కు, ఆపై సంభాషణల తీవ్రతను బట్టి సంస్థలా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీకి పంపుతారు. ఇటీవల అమెరికాలో చాట్‌జీపీటీకి పూర్తిగా బానిసైన 56 ఏళ్ల స్టెయిన్ ఎరిక్ అనే వ్యక్తి, దాని మాటలను నమ్మి తల్లిని చంపేసిన సంగతి తెలిసిందే.

45 ఏళ్లు దాటితే ఊపిరితిత్తుల వ్యాధులు అధికం!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: భారత్‌లో 45 ఏళ్లకు పైబడిన వారిలో 14% కంటే ఎక్కువ మంది ఊపిరితిత్తుల వ్యాధుల ప్రభావానికి గురవుతున్నారని ముంబైలోని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ బృందం చేసిన అధ్యయనంలో వెల్లడైంది. అమెరికాలోని సదరన్ కాలిఫోర్నియా వర్సిటీ, హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌కు చెందిన పరిశోధకులతో కలిసి ఈ బృందం దాదాపు 31వేల మందిని పరీక్షించింది. ఈ క్రమంలో 45ఏళ్లకు పైబడిన వారిలో ఎక్కువ మంది ఊపిరితిత్తులకు వాపు, నష్టం కలిగించి, శ్వాస ప్రవాహాన్ని అడ్డుకునే క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీవోపీడీ)కు గురయ్యారని పరిశోధకులు పేర్కొన్నారు.

అంగవైకల్యం జాబితాలో
ఆ తొమ్మిది వ్యాధులు అవసరం లేదన్న కమిటీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: వికలాంగుల హక్కుల చట్టంలోని అంగవైకల్యం జాబితాలో మరో తొమ్మిది అనారోగ్య కారకాలు/వ్యాధులు చేర్చాలంటూ వచ్చిన ప్రతిపాదనను కేంద్ర కమిటీ తిరస్కరించింది. హిమోఫీలియా, మూర్ఛవ్యాధి, పల్మోప్లాంటర్ కెరటోడెర్మా, ఇక్తయోసిస్, ఒక వైపు వినికిడి లోపం, లారింజెక్టమీ, ముఖ్య అవయవ వైఫల్యం, ఒస్టమి, ఆస్తమాలను చట్టంలో కొత్తగా చేర్చాలా? వద్దా? అన్న అంశంపై కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. అయితే వైవాటికి ఇప్పటికే అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నందున వాటిని వికలాంగుల హక్కుల చట్టంలో చేర్చవలసిన అవసరం లేదని భావించింది

మరణించిన నా తల్లిని దూషిస్తారా?

ఇది అందరు అమ్మలు, అక్కచెల్లెళ్లను, ఆడబిడ్డలను అవమానించడమే : ప్రధాని

» బీసీ గద్దెనెక్కడం కాంగ్రెస్ సహించదు

» ఆర్జేడీ హయాంలో బిహార్లో నేరాల వెల్లువ

» అందుకే మహిళలే దించేశారు: మోదీ



న్యూఢిల్లీ/పట్నా, సెప్టెంబరు 2: ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ బిహార్లో చేపట్టిన 'ఓటర్ అధికార యాత్ర'లో కాంగ్రెస్, ఆర్జేడీ నేతలు తన తల్లిని, తనను దూషించడంపై ప్రధాని మోదీ ఆవేదన వ్యక్తంచేశారు. నూరేళ్లు బతికి మరణించిన తన తల్లికి రాజకీయాలు తెలియదని.. ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేయడం.. తన తల్లినే గాక దేశంలోని అందరు అమ్మలు, అక్కచెల్లెమ్మలు, ఆడబిడ్డలను అవమానించడమేనని స్పష్టంచేశారు. స్వయం సహాయక బృందాల(ఎస్‌జీహెచ్ గ్రూపులు)కు ఆర్థిక సాయం చేయడానికి సీఎం నితీశ్‌కుమార్ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'జీవికా నిధి సాఖ్ సహకారీ సంఘ్ లిమిటెడ్' సంస్థను మోదీ మంగళవారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'అమ్మ ప్రతి ఒక్కరి ఆత్మగౌరవం. కొద్దిరోజుల కిందట దర్భంగాలో జరిగిన కాంగ్రెస్-ఆర్జేడీ సభ వేదికపై నా తల్లిని దూషించారు. సంప్రదాయ విలువలకు పేరుగాంచిన బిహార్ నేలపై ఇలాంటి ఘటన జరుగుతుందని నేనెన్నడూ ఊహించలేదు. బిహార్లో ఇది చూసిన ప్రతి తల్లీ ఇందుకు ఎంతగానో బాధపడుతోందని నాకు తెలుసు. నా గుండెల్లో ఉన్నంత బాధే వారిలో కూడా ఉంది. భారత మాతనే అవమానించేవారికి.. నా తల్లి పట్ల అలాంటి అసభ్య పదాలు వాడడం పెద్ద లెక్కలోది కాదు. ఇలాంటివారిని శిక్షించాలి. నా తల్లికి రాజకీయాలతో సంబంధం లేదు. ఆమె తప్పేంటి..? ఎందుకు దూషించాలి? బిహార్ సీతామాత జన్మభూమి. కాంగ్రెస్, ఆర్జేడీలను నేను క్షమించినా.. బిహార్ తల్లులు క్షమించరు' అని మోదీ అన్నారు. తనకు జన్మనిచ్చిన తల్లి మాతృభూమికి సేవచేయాలని తనను కోరిందని.. అందుకే దేశంలో మహిళల సంక్షేమానికి తాను అవిశ్రాంతంగా కృషిచేస్తున్నానని తెలిపారు. ఆమె తన కోసం చీర కూడా కొనుక్కుని ఎరుగదని చెప్పారు. మహిళా వ్యతిరేక మనస్తత్వం ఉన్నవారు అధికారంలోకి వస్తే.. అమ్మలు, అక్కచెల్లెళ్లు, ఆడబిడ్డలు ఎక్కువ బాధలు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆర్జేడీ హయాంలో రాష్ట్రంలో నేరాలు, హత్యలు, దోపిడీలు, అత్యాచారాలు, వసూళ్లు నిత్యకృత్యమని గుర్తుచేశారు. హంతకులు, రేపిస్టులకు ఆర్జేడీ ప్రభుత్వం రక్షణ కల్పించిందన్నారు. నాడు మహిళలే ఎక్కువగా బాధలు పడ్డారని.. వారే ఆ ప్రభుత్వాన్ని దించేశారని చెప్పారు. వెనుకబడిన వర్గాలకు చెందినవారు అధికారంలోకి రావడాన్ని కాంగ్రెస్ ఎప్పుడూ సహించదని.. అందుకే తనను దూషిస్తోందని మోదీ ధ్వజమెత్తారు.

తక్కువ వడ్డీతో రుణాలు..

స్వయం సహాయక బృందాలకు తక్కువ వడ్డీతో రుణాలు/ఆర్థిక సాయం అందించడం నితీశ్ సర్కారు ప్రారంభించిన 'జీవికా నిధి' లక్ష్యం. ఈ సంస్థ నిర్వహణకు రాష్ట్రప్రభుత్వం, కేంద్రం కూడా నిధులు అందిస్తాయి. మహిళా పారిశ్రామికవేత్తలు ఆర్థిక సాయం కోసం ప్రస్తుతం సూక్ష్మ ఆర్థిక సంస్థలపై ఆధారపడుతున్నారు. 18-24 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో మహిళలకు తక్కువ వడ్డీలతో సకాలంలో ఆర్థిక సాయం అందించే జీవికా నిధిని ఏర్పాటుచేశారు. ఈ వ్యవస్థ పూర్తిగా డిజిటల్ లావాదేవీలే నడుస్తాయి. దీని ద్వారా 'జీవికా దీదీల' బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నిధులు బదిలీ అవుతాయి.

కాంగ్రెస్ నేత ఖేడాకు
రెండు ఓటరు ఐడీలు

కాంగ్రెస్ మీడియా విభాగం ఇన్‌చార్జి పవన్ ఖేడాకు వేర్వేరు నంబర్లతో రెండు ఓటరు ఫొటో గుర్తింపు కార్డులు ఉన్నాయని బీజేపీ ఆరోపించింది. బిహార్‌లో ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ గాంధీ గగ్గోలు పెడుతున్నారని, కానీ అసలు 'ఓట్ల దొంగ' కాంగ్రెస్సేనని విమర్శించింది. ఖేడాకు రెండు ఓటరు ఐడీలు ఎలా వచ్చాయో ఎన్నికల సంఘం(ఈసీ) దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ఎన్నికల సంఘం ఖేడాకు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 8వ తేదీ 11 గంటల్లోపు సమాధానం ఇవ్వాలని సూచించింది. బీజేపీ ఆరోపణలపై ఖేడా స్పందిస్తూ ఆ పార్టీ నాయకులు చెప్పిన తర్వాతే తనకు రెండో ఓటరు ఐడీ ఉన్నట్లు తెలిసిందన్నారు. దీన్ని బట్టి ఓటర్ల జాబితాలు ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో తేటతెల్లమవుతోందన్నారు. దీనికి ఈసీనే నిందించాలని, ఓటర్ల జాబితాలను సక్రమంగా నిర్వహించడంలో ఈసీ విఫలమైందని విమర్శించారు.

గ్రామీణ ఇంజనీరింగ్ కాలేజీల
వెనుకబాటు!

» కృత్రిమ మేధపై అవగాహన కరువు

» దేశ వ్యాప్తంగా వెయ్యి గుర్తింపు

» అప్‌గ్రేడ్‌కు సిద్ధమైన ఏఐసీటీఈ

» జాబితాలో ఏపీ, తెలంగాణ సంస్థలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: దేశంలోని పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని గ్రామీణ ఇంజనీరింగ్ కాలేజీలు పనితీరులో వెనుకబడ్డాయని ఏఐసీటీఈ తెలిపింది. మొత్తం 1000 కాలేజీల పనితీరు ఏమాత్రం బాగోలేదని పేర్కొంది. కృత్రిమ మేధపై అవగాహన కల్పించడంలో ఈ కాలేజీలు వెనుకబడ్డాయని, ఏఐ, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల్లో పరిచయమే లేదని పేర్కొంది. మరో 500 కాలేజీలు ఉపాధి కల్పించే విషయంలో మరింత వెనుకబడినట్టు తెలిపింది. ఫలితంగా 5 లక్షల మంది విద్యార్థులపై ప్రభావం పడుతోందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆయా కాలేజీల పనితీరు మెరుగుపడేలా చర్యలు తీసుకోనున్నట్టు పేర్కొంది. 2028 నాటికి ఉపాధి, ఉద్యోగాల కల్పనలో ఆయా కాలేజీలపాత్ర మెరుగు పడేలా చేయనున్నట్టు ఏఐసీటీఈ వివరించింది. దీనికి అమెరికాకు చెందిన మేకర్ భవన్ ఫౌండేషన్ సహాయం తీసుకోనున్నట్టు పేర్కొంది.

ఏపీలో 41, తెలంగాణలో 36

వెనుకబడిన గ్రామీణ ఇంజనీరింగ్ కళాశాలల జాబితాలో ఏపీ నుంచి 41, తెలంగాణ నుంచి 36 ఉన్నాయని ఏఐసీటీఈ తెలిపింది. అదేవిధంగా తమిళనాడులో అత్యధికంగా 128, కేరళలో 60, హరియాణాలో 43, పంజాబ్‌లో 33, యూపీలో 31, మహారాష్ట్రలో 29, గుజరాత్‌లో 25, కర్ణాటకలో 17, ఒడిశాలో 16, ఉత్తరాఖండ్, బెంగాల్‌లో 11 చొప్పున ఉన్నాయి.

ఎయిరిండియా విమానాల్లో
వృద్ధులకు టికెట్‌పై రాయితీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: ఎయిరిండియా విమానయాన సంస్థ 60 ఏళ్లు పైబడిన(సీనియర్ సిటిజన్లు)వారికి టికెట్ ధరపై రాయితీ ప్రకటించింది. అంతర్జాతీయ సర్వీసుల్లో టికెట్ మూల ధరపై 10% వరకు, దేశీయ సర్వీసుల్లో అయితే 25% వరకు రాయితీ ఇస్తామని వెల్లడించింది. ఎకనామీ, బిజినెస్ క్లాస్ సహా అన్ని రకాల టికెట్లపై ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపింది. ఈ రాయితీ పొందాలంటే ఎయిరిండియా వెబ్‌సైట్ లేదా యాప్‌లో టికెట్ బుకింగ్ అప్పుడే 'కన్‌సెషన్ టైప్' దగ్గర సీనియర్ సిటిజన్ కోటాను తప్పనిసరిగా ఎంపిక చేసుకోవాలి. ఈ రాయితీతోపాటు సాధారణం కంటే 10 కిలోల వరకు అదనపు లగేజీని సీనియర్ సిటిజన్లు తీసుకెళ్లే అవకాశాన్ని కూడా ఎయిరిండియా ఇస్తుంది. అంతేకాక, సీనియర్ సిటిజన్లు తమ ప్రయాణ తేదీని ఓసారి ఉచితంగా మార్చుకునే వెసులుబాటు కూడా కల్పిస్తుంది. అయితే, మార్పు చేసుకున్న ప్రయాణ తేదీలో టికెట్ ధర అధికంగా ఉంటే మాత్రం ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది.

హిందీ సలహా కమిటీలో ఆర్.కృష్ణయ్య



న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: కేంద్ర సామాజిక న్యాయం, సశక్తీకరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని హిందీ సలహా కమిటీని పునర్వ్యవస్థీకరించారు. ఇందులో ఎంపీ ఆర్.కృష్ణయ్యను చేరుస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈయనతో పాటు ఎంపీలు సురేశ్ కుమార్ కశ్యప్, సంధ్య రాయ్, ధైర్యశీల్ మోహన్ పాటిల్ కూడా కమిటీకి నామినేట్ అయ్యారు. సామాజిక న్యాయశాఖ మంత్రి వీరేంద్ర దీనికి ఛైర్‌పర్సన్. సహాయ మంత్రులు బి.ఎల్. వర్మ, రామ్‌దాస్ అథవాలే డిప్యూటీ ఛైర్‌పర్సన్, సభ్యులుగా ఉంటారు. ఇందులో ఎంపీలు, హిందీ భాషా నిపుణులు సభ్యులుగా ఉంటారు. అధికార భాషగా హిందీ వినియోగం పెంచడం ఈ కమిటీ లక్ష్యం.

గడువు విధించినా
గవర్నర్లు పాటించకపోతే ఎలా?

గడువు విధించే అధికారం కోర్టులకు ఉందా?

» 'వీలైనంత త్వరగా బిల్లుల్ని ఆమోదించాలి' అని మాత్రమే రాజ్యాంగంలో ఉంది

» కొన్ని ఉదంతాల ఆధారంగా గవర్నర్లకు, రాష్ట్రపతికి కాలపరిమితి నిర్దేశించలేం: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: బిల్లులపై ఆమోదముద్ర కోసం గవర్నర్లకు గడువు విధించే అధికారం న్యాయస్థానాలకు ఉందా? ఒకవేళ గడువు విధిస్తే.. దానిని గవర్నర్లు పాటించకపోతే పరిస్థితి ఏమిటి? అంటూ సుప్రీంకోర్టు సందేహాలు వ్యక్తం చేసింది. 'బిల్లులపై గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదం' అంశంపై అత్యున్నత న్యాయస్థానం మంగళవారం విచారణ కొనసాగించింది. ఈ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం తరఫున అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. గవర్నర్లకు గడువు విధించకపోతే బిల్లులను వారు ఎంత కాలమైనా ఆమోదించకుండా ఉండే పరిస్థితి ఉంటుందని, తద్వారా సదరు బిల్లు కాలదోషం పట్టే పరిస్థితి తీసుకురావచ్చన్నారు. గవర్నర్ సూపర్ చీఫ్ మినిస్టర్‌లా మారే ప్రమాదం ఉందని, ఇది ఎంతమాత్రం సరికాదని తెలిపారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన కపిల్ సిబల్.. రాజ్యాంగ వ్యవస్థలు పని చేయకుండా అడ్డుకోవటానికి గవర్నర్లకు రాజ్యాంగం ఎటువంటి హక్కు కల్పించలేదని, రాజ్యాంగ వ్యవస్థలు పని చేసేలా కోర్టు జోక్యం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కాగా, విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ స్పందిస్తూ.. ఒక్కో అంశం ఒక్కో విధంగా ఉంటుందని, అన్ని బిల్లులకూ ఒకే గడువు ఎలా విధించగలమన్నారు. బిల్లుల ఆమోదంపై రాష్ట్రపతికి గడువును పేర్కొనటం అంటే బలవంతంగా విధించటం లాగే ఉందన్నారు. బిల్లుల ఆమోదానికి రాజ్యాంగం ఎటువంటి గడువును పేర్కొనలేదని, వీలైనంత త్వరగా ఆమోదించాలని మాత్రమే చెప్పిందని గుర్తుచేశారు. గవర్నర్లు బిల్లుల ఆమోదంపై జాప్యం చేసిన కొన్ని ఉదంతాల ఆధారంగా మొత్తం గవర్నర్ల వ్యవస్థ మీద, రాష్ట్రపతి మీద గడువు విధించలేమని ఒకదశలో ధర్మాసనం అభిప్రాయపడటం గమనార్హం. అలా చేస్తే కోర్టే రాజ్యాంగంలో సవరణ జరిపినట్లవుతుందని జస్టిస్ విక్రమ్‌నాథ్ పేర్కొన్నారు. జాప్యం జరుగుతుందని భావించినప్పుడు న్యాయస్థానానికి రావచ్చని, ఆ అవకాశం ఎప్పుడూ రాష్ట్రాలకు ఉంటుందని ధర్మాసనం గుర్తు చేసింది.

వాదనల్లో తెలంగాణ ప్రస్తావన


పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు ఎమ్మెల్యేల అభ్యర్థిత్వంపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌ను ఇటీవల సీజేఐ గవాయ్ ఆదేశించిన విషయాన్ని సింఘ్వీ గుర్తు చేశారు. గవర్నర్లకు కూడా ఇలాగే కాలపరిమితి విధించవచ్చన్నారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. 'దేశంలో ఉన్న అసెంబ్లీల స్పీకర్లందరికీ ఈ ఆదేశాలు ఇవ్వలేదు. అక్కడ ఉన్న కేసును బట్టి మాత్రమే ఆ ఆదేశాలిచ్చాం' అని స్పష్టం చేశారు. కాగా, ఈ అంశంపై సుప్రీంకోర్టు విచారణ కొనసాగనుంది.

శిక్ష తగ్గించాలని కోరే హక్కు
జీవిత ఖైదీలకూ ఉంది

సహజ మరణం సంభవించే వరకు జైలులోనే గడపాలంటూ తీర్పు వచ్చినప్పటికీ ఆ శిక్షను తగ్గించాలని కోరే హక్కు ఖైదీలకు ఉందని మంగళవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మైనర్లపై అత్యాచారం చేసి జీవితాంత శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు కూడా ఇలాంటి వినతి చేయవచ్చని తెలిపింది. పూర్వపు ఇండియన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 376డీఏ రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై ఈ స్పష్టత ఇచ్చింది. 16 ఏళ్లలోపు బాలికలపై అత్యాచారం, గ్యాంగ్‌రేప్‌లకు పాల్పడేవారికి విధించే శిక్షలను ఈ సెక్షన్ వివరిస్తుంది. నేరం రుజువయితే దోషులు సహజ మరణం సంభవించే వరకు జైలులోనే కాలం గడపాల్సి ఉంటుంది. దీనివల్ల క్షమాభిక్షను పొందే హక్కును ముద్దాయిలు కోల్పోతున్నారని, ఇది సమంజసమేనా అన్న ప్రశ్న ధర్మాసనం ముందుకు వచ్చింది.

భారత్ రష్యాతో కాదు అమెరికాతో ఉండాలి

» పుతిన్, జిన్‌పింగ్‌లతో సఖ్యత పెంచుకోవడం సిగ్గుచేటు: నవారో



వాషింగ్టన్, సెప్టెంబర్ 2: రష్యాతో భారత్ దోస్తీపై తరచూ తీవ్ర విమర్శలు చేస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో మరోసారి అక్కసు వెళ్లగక్కారు. ప్రధాని మోదీ అవకాశవాదంతో పుతిన్, జిన్‌పింగ్‌లతో సఖ్యత పెంచుకుంటున్నారని, ఇది సిగ్గు చేటని వ్యాఖ్యానించారు. భారత్ ఉండాల్సింది రష్యాతో కాదని, అమెరికాతో ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మోదీ త్వరలోనే గ్రహిస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. మరోవైపు, షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో)లో పూర్తిస్థాయి సభ్యత్వం కోసం ప్రయత్నిస్తున్న అజర్‌బైజాన్‌కు భారత్ చెక్ పెట్టింది. దీనిపై అజర్‌బైజాన్ విమర్శలు చేసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచినందుకు భారత్ పగతీర్చుకుంటోందని ఆరోపించింది. ఇదిలా ఉండగా, పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ మంగళవారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. బుధవారం జరగనున్న చైనా ఆర్మీ గ్రాండ్ పరేడ్‌లో మునీర్ పాల్గొననున్నారు.

పాకిస్థాన్‌తో బిజినెస్ కోసమే

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుటుంబ వ్యాపారాల కోసం భారత్‌తో సంబంధాలను పణంగా పెట్టారని ఆ దేశ మాజీ భద్రతా సలహాదారు జేక్ సలివాన్ ఆరోపించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "ట్రంప్ కుటుంబంతో కలసి వ్యాపారాలు చేసేందుకు పాకిస్థాన్ ముందుకు రావడంతో.. భారత్‌తో సంబంధాలను ట్రంప్ పణంగా పెట్టారు. ఇది అతిపెద్ద వ్యూహాత్మక తప్పిదం" అని పేర్కొన్నారు. చైనాకు చెక్ పెట్టాలంటే అమెరికా భారత్‌తో సత్సంబంధాలు కొనసాగించాలన్నారు.

నవంబరు కల్లా అమెరికాతో వాణిజ్య ఒప్పందం

» భారత్ ఎప్పుడూ డెడ్‌లైన్స్ పెట్టుకుని చర్చలు జరపదు: పీయూష్ గోయల్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయని.. త్వరలోనే పరిస్థితులన్నీ చక్కబడతాయని.. నవంబరుకల్లా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదురుతుందని ఆశిస్తున్నామని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ముంబైలో జరుగుతున్న అంతర్జాతీయ పెట్టుబడిదారుల వార్షిక సదస్సును ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించిన గోయల్.. భారత్‌తో వాణిజ్య, వ్యాపార సంబంధాలను పెంచుకోవాలనే ఆసక్తి, ఉత్సాహం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోందని అన్నారు. ఈయూతో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చర్చలు కూడా చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. అలాగే.. అంతకుముందు మరో కార్యక్రమంలో మాట్లాడుతూ అమెరికాతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. అయితే, భారతదేశం ఎప్పుడూ డెడ్‌లైన్స్ పెట్టుకొని వాణిజ్య చర్చలు జరపదని.. పరస్పర ప్రయోజనకరంగా ఉండే ఒప్పందాలపై మాత్రమే చర్చలు జరుపుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇండియా సరఫరా వ్యవస్థలు చాలా బలంగా ఉన్నాయని.. వేరే ఏ ఇతర దేశ దయాదాక్షిణ్యాలపైనా మనం ఆధారపడి లేమని ఆయన తేల్చిచెప్పారు. చిలీ, పెరు, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఓమన్ వంటి దేశాలతో కూడా కొత్త వాణిజ్య ఒప్పందాలను భారత్ కుదుర్చుకుంటున్నట్టు ఆయన వెల్లడించారు. ఇదిలా ఉండగా, సుంకాలు, ఇంధన విధానాలపై విభేదాలు ఉన్నప్పటికీ.. రెండు గొప్ప దేశాలైన ఇండియా, అమెరికా బంధానికి బలమైన పునాదులు ఉన్నాయని.. ఈ సమస్యను ఇరు దేశాలూ పరిష్కరించుకుంటాయని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ అన్నారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ విలువలు.. రష్యా, చైనా కన్నా అమెరికా విలువలకు దగ్గరగా ఉంటాయని 'ఫాక్స్ న్యూస్' వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రానికి యూరియా వచ్చేస్తోంది

వారంలో మరో 24 వేల టన్నుల యూరియా.. ఇప్పటికే 14 వేల టన్నులు వచ్చింది

- రైతులెవరూ ఆందోళన చెందవద్దు : మంత్రి తుమ్మల
- భారీ వర్షాలు, వరదలతో పంట నష్టంపై 5 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు

హైదరాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులెవరూ యూరియా కోసం ఆందోళన చెందవద్దని, ఇప్పటివరకు 14 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందిందని, వారంలో మరో 24 వేల మెట్రిక్ టన్నులు రానుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ యూరియా గంగవరం, కరైకల్, ధామ్రా పోర్టుల ద్వారా రానుందన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా డిమాండ్‌కు అనుగుణంగా యూరియా పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. అవసరమైన చోట తక్షణమే అందించేలా అధికారులు, ఉద్యోగులు సమన్వయం చేసుకోవాలన్నారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఎరువు ల విషయంలో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతోందని తెలిపారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన వానలు, వరదలతో సంభవించిన పంట నష్టంపై సర్వే నిర్వహించాలని, దీన్ని 5 రోజుల్లో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పరిహారం చెల్లింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

జిల్లాల్లో రైతుల ఆందోళనలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): యూరియా కోసం రైతులు పగలూ రాత్రీ పడిగాపులు కాస్తున్నారు. అరకొరగా వస్తున్న యూరియా కోసం ఎగబడుతున్నారు. పలుచోట్ల క్యూ లైన్లలో తోపులాటలతో ఉద్రిక్తత చోటుచేసుకుంటోంది. ఎదురుచూపులతో విసిగి వేసారి ఆందోళన బాట పడుతున్నారు. మంగళవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలుచోట్ల ఆందోళనలు జరిగాయి. కొణిజర్ల సొసైటీకి వచ్చిన రైతులు యూరియా సరఫరా కావడం లేదని ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఇల్లెందు మండలం నిజాంపేటలో రైతులు, వ్యవసాయ శాఖ అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. అక్కడ టోకెన్ల పంపిణీ సందర్భంగా తోపులాట చోటుచేసుకుంది. దుమ్ముగూడెంలో పీఏసీఎస్ వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. సొసైటీ సిబ్బందిని బయటకు తీసుకొచ్చి గేట్లు వేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట, బిజినేపల్లి, మహబూబ్‌నగర్ జిల్లా హన్వా డ, దేవరకద్ర, జడ్చర్ల, గద్వాలలో రాస్తారోకో చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో వందలాది మంది రైతులు, మహిళలు దుకాణాల ఎదుట పడిగాపులు పడ్డారు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ సొసైటీ వద్ద పడిగాపులు పడి నీరసించిన గిరిజన మహిళా రైతు రంగమ్మ సొమ్మసిల్లి పడిపోయింది. రైతులు జఫర్‌గఢ్‌లో రాస్తారోకో నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడలో తోపులాట జరిగి కొంతమంది రైతులు కిందపడిపోయారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్ నాయక్‌ను రైతులు అడ్డుకుని నిరసన తెలిపారు. కొత్తగూడ మండలం పొగుళ్లపల్లి, సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట క్యూ లైన్‌లో గంటల తరబడి నిల్చుండటంతో ఇద్దరు రైతులు ఫిట్స్ వచ్చి పడిపోయారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్, గంగాధర మండలాల్లో, కరీంనగర్, జగిత్యాల ప్రధాన రహదారిపై రైతులు ధర్నాకు దిగారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, షాబాద్‌లో రైతులు ఆందోళన నిర్వహించారు.


మహబూబాబాద్ జిల్లా గూడూరులో యూరియా కోసం క్యూకట్టిన రైతులు

పెళ్లాడతానని నమ్మించి అత్యాచారం..

మహిళను మోసగించిన వ్యక్తికి 20 ఏళ్ల కారాగారం

- 2017నాటి కేసులో రంగారెడ్డి కోర్టు తీర్పు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ మహిళపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి రంగారెడ్డి జిల్లా కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. అంతేకాక, బాధితురాలికి పరిహారంగా రూ.2 లక్షలు చెల్లించాలని ఆదేశించింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీసుస్టేషన్‌లో 2017లో నమోదైన ఓ కేసులో మంగళవారం ఈ మేరకు తుది తీర్పు వెల్లడించింది. ఇందుకు సంబంధించి సైబరాబాద్ డీసీపీ క్రైమ్ ఎ.ముత్యం రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన స్వాగత్ కుమార్ భోయ్ హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో నివాసముంటూ సాఫ్ట్‌వేర్‌గా పని చేసే వాడు. 2009 నుంచి 2017 వరకు హైదరాబాద్, నొయిడా, చెన్నైల్లో బాధితురాలితో కలిసి ఉన్న స్వాగత్ కుమార్ పెళ్లి చేసుకుంటానని మాట ఇచ్చి ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. అయితే, 2017 నవంబరు 28న స్వాగత్ కుమార్.. ఒడిసాలోని తన స్వస్థలంలో మరొకరిని పెళ్లి చేసుకుంటున్నాడని తెలుసుకున్న బాధితురాలు అక్కడికి వెళ్లి నిలదీసింది. తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి స్వాగత్ కుమార్ బాధితురాలిని బెదిరించి అక్కడి నుంచి పంపేశాడు. దీంతో బాధితురాలు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన అప్పటి గచ్చిబౌలి ఎస్‌హెచ్‌ఓ దర్యాప్తు చేపట్టారు. ఆ సమయంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ఎన్.వెంకటేశ్వర్లు కేసు దర్యాప్తు చేపట్టి నిందితుడు స్వాగత్ కుమార్ భోయ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి చార్జీషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన రంగారెడ్డి జిల్లా కోర్టు సెషన్స్ జడ్జి.. నేరం రుజువు కావడంతో స్వాగత్ కుమార్‌కు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5,100 జరిమానా, బాధితురాలకి రూ.2లక్షల పరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

లండన్‌లో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు హైదరాబాద్ యువకుల దుర్మరణం

- ఐదుగురికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- గణేశ్ నిమజ్జనానికి వెళ్లి వస్తుండగా యాక్సిడెంట్
- వీరు వెళ్లిన రెండు కార్లూ ఒకదానికొకటి ఢీకొట్టడంతో ప్రమాదం

సరూర్‌నగర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): లండన్‌లో వినాయక నిమజ్జనానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు చనిపోయారు. ఐదుగురు గాయపడగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులంతా తెలుగు రాష్ట్రాలకు చెందినవారే. మృతులను నాదర్‌గుల్‌కు చెందిన తర్రె చైతన్య(23), బోడుప్పల్‌కు చెందిన రాపోలు రిషి తేజ(21)గా గుర్తించారు. రావుల సాయిగౌతమ్, తాటికాయల నూతన్, గుర్రం యువతేజ రెడ్డి, గొల్ల వంశీ, పెంట్యాల వెంకట సుమంత్ ఈ ప్రమాదంలో గాయపడ్డారు. వీరిలో గౌతమ్, నూతన్ పరిస్థితి విషమంగా ఉంది. నాదర్‌గుల్‌కు చెందిన తర్రె ఐలయ్య, తర్రె మంగమ్మల చిన్న కుమారుడు చైతన్య. బీటెక్ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం ఫిబ్రవరి మొదటివారంలో క్రితం లండన్ వెళ్లాడు. అతడు, తన 8మంది స్నేహితులు ఆదివారం లండన్‌లో తాము ఉంటున్న ప్రాంతంలో వినాయకుడి శోభా యాత్ర నిర్వహించారు. తర్వాత, స్థానికంగా ఉన్న చెరువులో గణేశుడిని నిమజ్జనం చేయడానికి రెండు కార్లలో వెళ్లారు. తిరిగి వస్తుండగా, వీరి రెండు కార్లే అదుపుతప్పి ఒకదానికొకటి ఢీకొన్నాయి. ప్రమాదంలో చైతన్య, రిషి తేజ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. చైతన్య చనిపోయినట్లు కుటుంబసభ్యులకు సోమవారం రాత్రి సమాచారం అందింది. ప్రమాదం సమయంలో కార్లను డ్రైవింగ్ చేసిన బట్టమేకల గోపీచంద్, సబ్బాని మనోహర్‌లు ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, సోమవారం రాత్రి తమ ఇంటి సమీపంలోని మండపంలో వినాయకుడి పూజ పూర్తైన సమయంలోనే, తమ కుమారుడు రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైనట్లు ఫోన్ వచ్చిందని చైతన్య తండ్రి ఐలయ్య రోదిస్తూ చెప్పారు. ఆ తర్వాత గంట సేపటికి మళ్లీ ఫోన్ చేసి చనిపోయినట్లు చెప్పారన్నారు. చైతన్య మృతదేహాన్ని రెండు రోజుల్లో నాదర్‌గుల్‌కు తీసుకువచ్చే అవకాశం ఉంది. కాగా తాము కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలిసి విషయం చెప్పామని, ఆయనతో పాటు ఇతర నేతలు కూడా లండన్ అధికారులతో మాట్లాడారని నాదర్‌గుల్‌కు చెందిన బీజేపీ నేత అందెల శ్రీరాములు యాదవ్ తెలిపారు.


తర్రె చైతన్య, రాపోలు రిషి తేజ (ఫైల్)

కట్టుకున్న వాడే కాలయముడయ్యాడు

- ప్రేమించి పెళ్లాడిన భార్యను హత్య చేసిన భర్త
- బెట్టింగులతో అప్పుల పాలవడంతో కలహాలు

బూర్గంపాడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆ దంపతుల జీవితంలో ఆన్‌లైన్ బెట్టింగులు చిచ్చురేపాయి. బెట్టింగులకు బానిసైన భర్త ఆ కారణంగా అప్పులపాలయ్యాడు. భార్య వద్దని మందలించడంతో కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. చివరకు కట్టుకున్న భర్తే ఆమెను హత్య చేశాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడుకు చెందిన ఎస్‌కే షంషీర్ పాషా అలియాస్ ఛోటే బాబా, మహమూదా(32) ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న ఛోటే బాబా డబ్బుపై అత్యాశకు పోయి బెట్టింగులకు అలవాటు పడ్డాడు. ఆర్థికంగా నష్టపోయాడు. మళ్లీ అందులోనే డబ్బులు సంపాదించాలని అప్పులు చేసి మరీ బెట్టింగులు పెట్టాడు. కొంత కాలం నుంచి ఏ పనీ చేయకుండా ఇంటి దగ్గరే ఉంటూ వృథా ఖర్చులు చేస్తున్నాడు. దాంతో భార్య మహమూదా అతడిని మందలించింది. అదే సమయంలో అప్పులు ఇచ్చిన వ్యక్తుల నుంచి ఛోటే బాబాపై ఒత్తిడి పెరిగింది. రోజువారీ ఖర్చులకు డబ్బుల్లేని పరిస్థితి. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య కలహాలు మొదలయ్యాయి. ఇటీవల తరచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి గొడవ జరుగగా కోపోద్రిక్తుడైన ఛోటే బాబా.. మహమూదా గొంతు నులిమి చంపేశాడు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు.

రూ.4కోట్ల విలువైన 763 కిలోల గంజాయి స్వాధీనం

- అడవిలో దాచి.. తరలిస్తుండగా పట్టివేత.. నలుగురి అరెస్టు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో భారీ ఎత్తున గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అడవిలో గుట్టుగా దాచిన గంజాయిని తరలిస్తుండగా దాడి చేసిన పోలీసులు రూ.4కోట్ల విలువైన 763.84 కిలోల ఎండు గంజాయిని గుర్తించి సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి ఏపీలోని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అందాల పాండురెడ్డి, ఒడిసాలోని మల్కానగిరి జిల్లాకు చెందిన గుల్లారి మునిరాజ్, కొప్పు కోటయ్య, సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలానికి చెందిన భూక్య సాయికుమార్‌ను అరెస్టు చేశారు. వరంగల్ కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ టీం, ఖానాపురం పోలీసులు సంయుక్తంగా చేసిన ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం విలేకరులకు వెల్లడించారు. వ్యవసాయం, కూలీ పనులు చేసుకునే పాండురెడ్డి, మునిరాజ్, కోటయ్య, సాయికుమార్‌లు ఎక్కువ డబ్బుకు ఆశపడి గంజాయిని విక్రయించే గిల్లమడుగుకు చెందిన మజ్జి కృష్ణ, రమేశ్ వద్ద పని చేసేవారు. కృష్ణ, రమేశ్ చెప్పిన విధంగా గంజాయిని వాహనంలోకి ఎక్కిస్తే ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున చెల్లించేవారు. గుర్రాల, సమీప ప్రాంతంలోని అడవిలో పండించిన గంజాయిని రమేశ్ కొనుగోలు చేసి దానిని కలిమెల ప్రాంతం మీదుగా ఏపీ సరిహద్దులోని ప్రధాని రహదారికి తరలించేవాడు. ఈ క్రమంలో రమేశ్ సూచనల మేరకు పాండు, మునిరాజ్, కోటయ్య కలిసి ఆగస్టు 28న ఓ ట్రాలీ ఆటోలో గంజాయిని లోడు చేసుకుని సూర్యాపేటలోని సాయికుమార్ వద్దకు బయలుదేరారు. పాఖాల సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండడాన్ని గమనించి 5 కి.మీ.లు వెనక్కి వెళ్లి అడవిలోని ఓ గుట్టపై గంజాయిని దాచిపెట్టి వచ్చిన వాహనంలోనే వెళ్లిపోయారు. తిరిగి సెప్టెంబరు 1న పాండు, మునిరాజ్, కోటయ్యతోపాటు సాయికుమార్ కలిసి ఆ గంజాయిని ఓ ట్రాలీ ఆటోలోకి ఎక్కిస్తుండగా దాడి చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

జేఎన్‌టీయూతో పోలీస్ అకాడమీ ఒప్పందం

- సైబర్ ఇన్వెస్టిగేషన్ కోర్సుల్లో శిక్షణకు అంగీకారం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సైబర్ ఇన్వెస్టిగేషన్, సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణపై జేఎన్‌టీయూ, తెలంగాణ పోలీస్ అకాడమీ ప్రాథమిక అవగాహనకు వచ్చాయి. ఈ మేరకు మంగళవారం ఇరు సంస్థల ఉన్నతాధికారులు లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌వోఐ)పై సంతకాలు చేశారు. డిజిటల్ ఫోరెన్సిక్, సైబర్ దాడుల నివారణ, మాల్వేర్ విశ్లేషణ వంటి అంశాల్లో రెండు సంస్థలు వర్క్‌షాప్‌లు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నాయి. జేఎన్‌టీయూలో నిర్వహించిన కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్, అకడమిక్ వింగ్ ఎస్పీ కవిత, జేఎన్‌టీయూ వీసీ కిషన్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. కాగా, జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల్లో మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందించడం కోసం సింగరేణి నిధులు సమకూర్చేందుకు ముందుకొచ్చింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రజాస్వామ్య నైతికత

భారతీయ నాగరికత ప్రభవ ప్రాభవాలకు హిమాలయాలు ఎంత ముఖ్యమో భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య విశిష్టతా వికాసాలకు సార్వజనీన ఓటు హక్కు అంతే ప్రధానమైనది. కులమతాలకు అతీతంగా, విద్యార్హతలు, ఆర్థిక స్థాయితో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ద్వారా భారత గణతంత్ర రాజ్య వ్యవస్థాపకులు భారతీయుల ప్రజాస్వామిక ప్రస్థానాన్ని సుస్థిరమూ, స్ఫూర్తిదాయకమూ చేశారు. అతడు/ఆమె ప్రజాస్వామిక ప్రక్రియలో విధిగా పాల్గొనేలా చేయడంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) బాధ్యత బృహత్తరమైనది. మన గణతంత్ర రాజ్యం కంటే ఒక రోజు ముందే (జనవరి 25, 1950) ఏర్పడిన ఈ రాజ్యాంగ సంస్థ ఇటీవలి కాలంలో తన గురుతర బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం లేదనే సందేహాలు సామాన్యులలోను, పాలకపక్షం ప్రయోజనాలను కాపాడడమే లక్ష్యంగా వ్యవహరిస్తోందనే భయాందోళనలు రాజకీయ పక్షాలలోను వ్యక్తమవుతున్నాయి. ఆ భయ సందేహాలు సహేతుకమైనవని సోమవారం నాడు పట్నాలో ముగిసిన జాతీయ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఓటర్ అధికార్ యాత్ర నిర్ధారించింది.

మూడు సంవత్సరాల క్రితం కన్యాకుమారి నుంచి నుంచి కశ్మీర్ దాకా రాహుల్ నిర్వహించిన భారత్ జోడో యాత్ర భారత జాతీయ కాంగ్రెస్‌కు ప్రజాదరణను పెంపొందించింది. గత ఏడాది సార్వత్రక ఎన్నికలలో ఉత్తరాది రాష్ట్రాలలో బీజేపీ ఆధిక్యతను కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు గణనీయంగా దెబ్బతీశాయి. లోక్‌సభ ఎన్నికల అనంతరం నాలుగు నెలల వ్యవధిలో మహారాష్ట్ర, హర్యానా శాసనసభలకు జరిగిన ఎన్నికలలో బీజేపీ విజయం సాధించింది. మహారాష్ట్రలో, ఓటర్ల జాబితాలో మోసపూరితంగా దాదాపు నలభై లక్షల కొత్త ఓటర్లను చేర్చడం, అక్రమంగా పలువురు ఓటర్ల పేర్లను తొలగించడం వల్లే బీజేపీకి విజయం సాధ్యమయిందని రాహుల్ ఆరోపించారు. అలాగే గత లోక్‌సభ ఎన్నికలలో కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గంలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ ఓటర్ జాబితాలలో ఘోరమైన అవకతవకలు చోటుచేసుకున్నాయని, లక్షకు పైగా ఓట్లు అనుమానాస్పదమైనవని ఈసీఐ ఇచ్చిన జాబితాల ఆధారంగానే రాహుల్ నిరూపించారు. ఆయన లేవనెత్తిన ప్రశ్నలకు ఈసీఐ సరైన సమాధానాలు ఇవ్వలేకపోయింది.

జూన్‌లో బిహార్‌లో ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఈసీఐ చేపట్టింది. ఈ సంవత్సరాంతంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇంత తక్కువ వ్యవధిలో హడావుడిగా ఈ సవరణ కార్యక్రమాన్ని చేపట్టడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. బీజేపీకి తోడ్పడేందుకే లక్షలాది ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించేందుకు ప్రత్యేక సమగ్ర సవరణను ఈసీఐ చేపట్టిందని రాహుల్ తప్పుపట్టారు. ఆగస్టు 1న ఈసీఐ ప్రకటించిన ముసాయిదా ఓటర్ జాబితాలలో 65 లక్షల పేర్లను మినహాయించినట్టు వెల్లడవడంతో ప్రజల సందేహాలు మరింత బలపడ్డాయి. ముసాయిదా జాబితాలను నిశితంగా పరిశీలిస్తే పేర్ల తొలగింపుతో నష్టపోయిన ఓటర్లలో అత్యధికులు అణగారిన వర్గాలవారు, మతపరమైన మైనారిటీలు, మహిళలు ఉన్నారు. ఈ ప్రత్యేక సమగ్ర సవరణను వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలోను, పిదప దేశమంతటా నిర్వహిస్తామని ఈసీఐ ఇప్పటికే ప్రకటించడంతో కోట్లాది పౌరులు తమ ఓటుహక్కును కోల్పోయే ముప్పు వాటిల్లనున్నది. ఇదే జరిగితే ప్రజాప్రాతినిధ్యానికి అర్థమేమున్నది.? ఈ విపత్కర పరిస్థితులపై ప్రజలను జాగృతం చేసేందుకే జాతీయ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బిహార్‌లో 16 రోజుల పాటు ఓటర్ అధికార్ యాత్ర నిర్వహించారు. ప్రజలు అపూర్వంగా ప్రతిస్పందించారు. ప్రతిపక్ష ఇండియా కూటమిలో సమైక్యత వెల్లివిరిసింది. ఈ సానుకూల పరిస్థితులను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు రాహుల్ మరింత దృఢ సంకల్పంతోను, రాజనీతిజ్ఞతతోను వ్యవహరించవలసి ఉన్నది.

ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన ఎన్నికల వ్యవస్థలో ఇటువంటి అపసవ్యతలు చోటుచేసుకున్నప్పుడు అధికారంలో ఉన్నవారిని వేలెత్తి చూపకుండా ప్రతిపక్షాలు ఉండలేవు. ఎందుకంటే ప్రజాస్వామ్య నైతికతే ఓటుహక్కు. ఆ నైతికత భ్రష్టం కాకుండా భద్రంగా, ప్రయోజనకరంగా ఉండేలా జాగ్రత్త వహించడం ప్రతి విద్యావంతుడి విద్యుక్తధర్మం.

బహ్రెయిన్‌లోని శివ మందిరం గల్ఫ్ ప్రాంతంలో అత్యంత పురాతన హిందూ దేవాలయం. రెండు శతాబ్దాలకు పైగా చరిత్ర ఉన్న కోవెల అది. లోకమాన్య తిలక్ భారతదేశంలో వినాయక చవితి ఉత్సవాలకు శ్రీకారం చుట్టని కాలంలోనే బహ్రెయిన్‌లో వినాయక చవితి ఉత్సవాలు జరిగేవి. అన్యమత కార్యకలాపాలు నిషిద్ధమైన సౌదీ అరేబియాలో సైతం కొన్నేళ్లుగా తెలుగు ప్రవాసుల నేతృత్వంలో వినాయక చవితి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి.

ఎడారి దేశాల్లో వినాయక వేడుకలు

గల్ఫ్ లేఖ

భారతీయ పండుగలు సంప్రదాయాల సమ్మేళనాలు. తరతరాల ఆచారాలు, జీవన రీతులను సంరక్షిస్తూ భారతావని సాంస్కృతిక వైభవాన్ని, వైవిధ్యాన్ని అవి ప్రతిబింబిస్తాయి. భారతదేశంలో పండుగలు మత, సాంస్కృతిక, సామాజిక అంశాల పట్టుపోగులతో అల్లిన శోభాయమానమైన వస్త్రాలు. వివిధ పండుగల సంప్రదాయాలు భారతీయ సంస్కృతిలో అంతర్భాగం. పర్వదినాల సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల మధ్య అనుబంధాన్ని పెంచుతాయి. ఈ వేడుకలను నిర్వహించే వేదికలు భిన్న వర్గాల జనులను సమైక్యం చేస్తాయి. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ప్రజలను సంఘటితపరిచి వలస పాలకుల వ్యతిరేక పోరాట స్ఫూర్తిని రగిలించేందుకు వినాయక చవితి ఉత్సవాలను లోకమాన్య బాలగంగాధర్ తిలక్ స్ఫూర్తిదాయకంగా వినియోగించుకున్నారు. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా దేశ దేశాలలో ఉన్న భారతీయులు భారతీయ స్ఫూర్తిని ఆవాహన చేసుకుని తమను తాము విలక్షణంగా నిలబెట్టుకునేందుకు వినాయక చవితి, విజయదశమి, దీపావళి వేడుకలు జరుపుకోవడం పరిపాటిగా ఉన్నది.

గల్ఫ్ దేశాలలోని ప్రవాసులలో వినాయక చతుర్థి శోభ వెల్లివిరుస్తోంది. మాతృదేశంలో వలే ఆర్భాటంగా కాకున్నా అద్యంతం ఆధ్యాత్మికంగా గణనాథుడిని ప్రవాస భక్తులు ఆరాధిస్తున్నారు. స్వదేశంలో మాదిరిగా తొమ్మిది రోజుల పాటు కాకుండా ఈ ఎడారి దేశాలలో సాధారణంగా ఒకటి నుంచి మూడు రోజుల పాటు బొజ్జ గణపతికి పూజలు చేసి ఆ వేల్పు ప్రతిమను నిమజ్జనం చేస్తుంటారు. చాలామంది స్వగృహాలలోని స్నానపు తొట్టెల (బాత్ టబ్స్)లో నిమజ్జనం చేస్తుంటారు! చెంతనే ఉన్న అరేబియా సముద్రంలో నిమజ్జనం చేసేవారు తక్కువే. దుబాయి, మస్కట్, బహ్రెయిన్‌లలో కొన్ని ఎంపిక చేసిన ప్రదేశాలలో మాత్రం సింధీ వ్యాపారస్తులు వినాయక పూజలు తొమ్మిది రోజుల పాటు అట్టహాసంగా చేస్తుంటారు. ఈ సారి 18 అడుగుల ఎత్తు ఉన్న గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం ద్వారా గిన్నిస్ రికార్డులో తమ ఘనతను నమోదు చేయించుకోవడానికి దుబాయిలో కొందరు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీనిపై విభిన్న కథనాలు వినిపిస్తున్నాయి. ఒక్క దుబాయిలోనే కాదు, అన్ని ఎమిరేట్స్‌లోని ఔత్సాహికులకూ ఈ సందర్భం ఒక గుణాత్మక సందేశాన్ని ఇచ్చింది.



దుబాయి, షార్జా, మస్కట్ నగరాలలో భారతీయ సంప్రదాయ వస్తువులు, పూజ సామగ్రి విక్రయించే దుకాణాలు వినాయక చవితి ముందు రోజుల్లో గణపతి ప్రతిమల విక్రయాలతో సందడి సందడిగా ఉంటాయి. రంగురంగుల విద్యుత్ దీపాలు, భక్తి పారవశ్యంలోకి తీసుకెళ్లే ఆధ్యాత్మిక గేయాలను ఆలపించే సాంకేతిక సామగ్రి మొదలు పూజాద్రవ్యాల వరకు అనేకం 'మేడ్ ఇన్ చైనా'వి కావడం గమనార్హం.

గల్ఫ్ దేశాలలోని విద్యాలయాల వేసవి సెలవులు ఇటీవలే ముగిశాయి. సెలవులకు స్వస్థలాలకు వెళ్ళిన ప్రవాస భారతీయ కుటుంబాలు తిరిగి వస్తూ తమ వెంట ఏకదంతుని విగ్రహాలనూ తీసుకువచ్చాయి. దుబాయి, బహ్రెయిన్, ఒమాన్, ఖతర్‌లలోని కొన్ని లేబర్ క్యాంపులు వినాయక మండపాలతో కోలాహలంగా మారాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని తెలుగు ప్రవాసుల సమూహాలు తొమ్మిది రోజుల పాటు పూజలు చేస్తాయి. ఒక్క అజ్మాన్‌లోని త్రిమూర్తుల ఫాంలో మాత్రమే ఎత్తైన వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా మట్టి గణేశుని విగ్రహాన్ని ఇక్కడకు దిగుమతి చేసుకుని త్రిమూర్తులు దీన్ని ప్రతిష్ఠిస్తారు. సింధీ ప్రజల ప్రాబల్యం ఉన్న పండుగల వాతావరణంలో అజ్మాన్‌లోని తెలుగువారందరికి ఆ మట్టి గణేశుడే ఒక పెద్ద దిక్కు.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని రెండు హిందూ దేవాలయాల కంటే చాలా పురాతనమైన హిందూ దేవాలయం ఉన్న దేశం బహ్రెయిన్. ఈ దేశంలోని శివ మందిరం గల్ఫ్ ప్రాంతంలో అత్యంత పురాతన హిందూ దేవాలయం. రెండు శతాబ్దాలకు పైగా చరిత్ర ఉన్న కోవెల ఇది. లోకమాన్య తిలక్ భారతదేశంలో వినాయక చవితి ఉత్సవాలకు శ్రీకారం చుట్టని కాలంలోనే బహ్రెయిన్‌లో వినాయక చవితి ఉత్సవాలు జరిగేవి. కృష్ణ మందిరంతో పాటు అనేక లేబర్ క్యాంపులలో వినాయక చవితిని ఘనంగా నిర్వహిస్తున్నారు. బహిరంగ విగ్రహారాధన, అన్యమత కార్యకలాపాలు నిషిద్ధమైన సౌదీ అరేబియాలో సైతం కొన్నేళ్లుగా తెలుగు ప్రవాసుల నేతృత్వంలో వినాయక చవితి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి.

కువైత్‌లో కొనసాగుతున్న విస్తృత వీసా తనిఖీల కారణంగా వినాయక చవితి కార్యక్రమం పూర్తిగా వ్యక్తిగత ఆరాధనగా మారింది. రాయలసీమ ప్రవాసులు చేసే హడావుడి ఈ సారి పూర్తిగా తగ్గిపోయింది. ఒమాన్‌లోని మస్కట్ నగరంలో గల చరిత్రాత్మక శివ మందిరంలోనే కాకుండా ఆ దేశ వ్యాప్తంగా గణనాథుని పూజలు జరుగుతున్నాయి. లేబర్ క్యాంపులలో ప్రతి వారాంతంలోనూ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని ఉంటుంది. మాతృదేశంలో వలే ఇక్కడ కూడా లడ్డూను వేలం వేయడం పరిపాటి అయింది. కొన్నాళ్లుగా నిర్వహిస్తున్న ఈ వేలం యువతలో మత సంప్రదాయాల పట్ల ఉత్సుకతను పెంచుతోంది. గల్ఫ్‌లో ఏటా ఒక నూతన ప్రదేశంలో వినాయకుడు పూజలు అందుకుంటున్నాడు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

బీఆర్ఎస్ భవితవ్యం ఏమిటి?



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

భారతదేశంలో ప్రాంతీయ పార్టీలకు భవిష్యత్తు ఉన్నదా? తెలంగాణలో ఒకప్పుడు ఉజ్వలమైన పాత్రను పోషించిన భారత రాష్ట్ర సమితి దుస్థితి చూస్తుంటే ఈ అనుమానం రాకమానదు. బీఆర్ఎస్ ఎదుర్కొంటున్న పరిస్థితి అన్ని ప్రాంతీయ పార్టీలకూ వస్తుందని చెప్పలేము కాని బీఆర్ఎస్ దుస్థితి నుంచి మాత్రం ప్రాంతీయ పార్టీలు, వాటి నేతలు ఎలా వ్యవహరించకూడదో తెలుసుకునే అవకాశం ఉన్నది, తెలుసుకోవాలి కూడా. గత లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి కేవలం 240 సీట్లు మాత్రమే లభించాయి. ప్రాంతీయ పార్టీలపై ఆధారపడి ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడింది. ఇండియా కూటమిలో కాంగ్రెస్ సంఖ్యాబలం కంటే రెట్టింపుకు పైగా సంఖ్యాబలం ప్రాంతీయ పార్టీలదే.

అంత మాత్రాన ప్రాంతీయ పార్టీల పరిస్థితి మెరుగ్గా ఉన్నదని చెప్పడానికి వీల్లేదు. ఇందుకు 2024 జూన్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికలే తార్కాణం. కాని బీజేపీకి మద్దతునిచ్చిన ప్రాంతీయ పార్టీల్లో ఒక్క తెలుగుదేశం, జేడీ(యు) ప్రధాన పార్టీలు కాగా మిగతావన్నీ చిన్నా చితక పార్టీలు. ఎన్డీఏలో ఉన్నామని చెప్పుకుంటున్న దాదాపు 20 పార్టీలకు ఒక్క సీటూ లేదు. ఇండియా కూటమిలో కూడా సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, తృణమూల్ మాత్రమే ప్రధాన పార్టీలు. దాదాపు 30కి పైగా పార్టీలు రెండు కూటముల్లోనూ అయిదు స్థానాలలోపే సాధించగా, వాటిలో మెజారిటీ పార్టీలకు కేవలం ఒక్కొక్క సీటే లభించింది. బీజేడీ, బీఆర్ఎస్, అన్నాడీఎంకే వంటి ప్రధాన పార్టీలు అదృశ్యం కాగా, శివసేన, లోక్ జనశక్తి, ఎన్సీపీ, జేఎంఎం వంటి పార్టీలు నిలదొక్కుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.

నిజానికి భారత రాష్ట్ర సమితి ప్రాంతీయ పార్టీల్లో కెల్లా జూనియర్ పార్టీ. డీఎంకే 1949లోనూ, ఆ పార్టీ నుంచి చీలిన అన్నాడీఎంకే 1972లోనూ జన్మించాయి. శివసేన 1966 నుంచీ ఉనికిలో ఉన్నది. జార్ఖండ్ ముక్తి మోర్చా 1972లో ఆవిర్భవించింది. తెలుగుదేశం 1982లో ఏర్పడితే, సమాజ్‌వాదీ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ 1990వ దశకంలో జన్మించాయి. ఈ పార్టీలన్నీ ఇవాళ్టికీ అస్తిత్వంలో ఉండగా అవి ఏర్పడిన ఎంతో కాలానికి జన్మించిన బీఆర్ఎస్ మాత్రం ఎందుకు అంతర్గత సంక్షోభంలో చిక్కుకున్నది? ఈ విషయమై ఆ పార్టీ ఆత్మపరీక్ష చేసుకోవాల్సిన అవసరం ఉన్నది.

చాలా ప్రాంతీయ పార్టీలకు ఒక సిద్ధాంతం, చరిత్ర, లక్ష్యాలు ఉన్నాయి. అవి రాజ్యాంగంలో పీఠిక లాంటివి. ఇటీవల మరణించిన జేఎంఎం అధినేత శిబూసోరెన్ కేవలం రాజకీయ నాయకుడు కాదు. భూస్వాములు, వడ్డీ వ్యాపారులు ఉపాధ్యాయుడైన తన తండ్రిని 1957లో హత్య చేస్తే వారికి వ్యతిరేకంగా సుదీర్ఘకాలం పోరాడుతూ ఎదిగిన ప్రజా నాయకుడు. ఆదివాసీలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం, వారిని కట్టుబానిసత్వం నుంచి విముక్తి చేయడం కోసం పోరాడినవాడు. డీఎంకేకు 1916 నుంచే ద్రవిడ ఉద్యమం నిర్వహించిన చరిత్ర ఉన్నది. పెరియార్, అన్నాదురైలు నిర్మించిన వారసత్వం ఉన్నది. ఇవాళ స్టాలిన్ ఆ వారసత్వాన్ని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. సోషలిస్టు నాయకుడు రామ్ మనోహర్ లోహియా సామాజిక న్యాయం కోసం ప్రారంభించిన పోరాట క్రమంలో సమాజ్‌వాదీ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్ ఉద్భవించాయి. ములాయం తర్వాత అఖిలేశ్, లాలూ తర్వాత తేజస్వి తమ తండ్రుల దారిలో రాష్ట్రాల్లో బీజేపీని ఢీకొంటున్నారు. ఎన్ని ఆటుపోట్లు వచ్చినా 85 ఏళ్ల వయస్సులో శరద్ పవార్ మరాఠా ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు పోరాడుతున్నారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి కూడా బెంగాలీల ఆత్మగౌరవానికి తానే ప్రతీకగా భావిస్తూ బీజేపీని శాయశక్తులా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోంది. తెలుగు వారి ఆత్మగౌరవం, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏర్పడిన తెలుగుదేశం ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, రాష్ట్ర విభజన జరిగినా అస్త్ర సన్యాసం చేయకుండా నిలదొక్కుకుని ఇవాళ కేంద్రంలో ఎన్డీఏ సర్కార్‌కు కీలక మద్దతునిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా మూడు దశాబ్దాల క్రితం ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబునాయుడు ఇంకా అదే ఉత్సాహంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ ప్రాంతీయ పార్టీలు కేంద్రంలో ఏ పార్టీతో సంబంధాలు పెట్టుకున్నాయన్నది ప్రధానం కాదు. చంద్రబాబు లాగా కరుణానిధి, మమతా బెనర్జీ, జయలలిత కూడా బీజేపీతోనూ కాంగ్రెస్‌తోనూ సంబంధాలు ఏర్పరుచుకున్నవారే. అయినా వారు తమ అస్తిత్వాన్ని పణంగా పెట్టినవారు కాదు. ఏది జరిగినా ఓటమిని అంత సులభంగా అంగీకరించేవారు కారు. మరి కేసీఆర్‌కు ఏమైంది? ఆయన పార్టీ ఎందుకు లుకలుకలకు గురవుతోంది?

కారణం ఏమంటే తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడ్డ లక్ష్యాలకు, ఆశయాలకూ కేసీఆర్ దూరం కావడమే. నేల విడిచి సాము చేయడమే. చాలా మంది ప్రాంతీయ నాయకులకున్న స్థిరత్వం, లక్ష్యశుద్ధి, ప్రజాస్వామ్య స్ఫూర్తి కేసీఆర్‌కు లేవు. తెలంగాణ ప్రజల్లో, ముఖ్యంగా సామాజికంగా బలహీనవర్గాల్లో ఆకాంక్షలు పెరిగిపోయిన క్రమంలో జయశంకర్, కోదండరాం వంటి అనేక మంది నేతలు నిర్మించిన ఉద్యమం ఆయన రాజకీయంగా బలపడేందుకు తోడ్పడింది.

కేసీఆర్ పార్టీ ప్రారంభించిన ఏడేళ్ల వరకూ కేటీఆర్, కవిత దరిదాపుల్లో ఉండేవారు కాదు. 'మా రాము అమెరికాలో ఉంటాడు. నెలకు 300 డాలర్లు పంపుతాడు. తెలంగాణ ఏర్పడకపోయినా నా మనుగడకేమీ ఢోకా లేదు' అని ఆయన తుగ్లక్ రోడ్‌లో కేటీఆర్‌ను పరిచయం చేసిన రోజులున్నాయి. చాలా పార్టీల్లో ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల్లో వారసులు ఉండడం సహజం. కాని ఆ పార్టీలేవీ వారసుల మూలంగా అంతర్గత సంక్షోభంలో చిక్కుకోలేదు. ములాయం, లాలూ, కరుణానిధి, శిబూ సోరెన్‌ల వారసులే ఆ తర్వాత ముఖ్యమంత్రులయ్యారు. పైగా వారి బంధువులు కూడా పార్టీల్లో, పదవుల్లో కీలక స్థానాలు పోషించారు. అన్నీ సజావుగా జరిగాయి. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో కూడా రాహుల్, ప్రియాంక ఎంత సన్నిహితంగా, ఎవరి బాధ్యతలు వారు నెరవేరుస్తూ ఉంటారో స్పష్టంగా కనపడుతుంది. బీఆర్ఎస్ కుటుంబసభ్యుల వల్ల దెబ్బతిన్నదని చెప్పడానికి వీల్లేదు. కేసీఆర్ వారి విషయంలో అప్రమత్తంగా, జాగరూకతతో లేకపోవడం వల్ల, సరైన మార్గదర్శకత్వం అందించపోవడం వల్ల, వారి పాత్రను నిర్దేశించకపోవడం వల్ల, కొన్ని విషయాల్లో అదుపులో పెట్టకపోవడం వల్ల దుష్పరిణామాలు జరిగాయనడానికి ఆస్కారం ఉన్నది.



కొన్ని దశాబ్దాలుగా మనుగడలో ఉన్న ఇతర ప్రాంతీయ పార్టీల నేతల్లో లేని అనేక అప్రజాస్వామిక, నియంతృత్వ దుర్లక్షణాలు కేసీఆర్‌లో ఉన్నాయి. ఈ కారణంగానే అధికారం కోల్పోయిన ఏడాదిన్నరలోనే ఆయన మనుగడ కోసం తండ్లాడవలసి వస్తోంది. 'మనం వ్యవస్థలతో చెలగాటమాడితే అవి తర్వాత మనతో చెలగాటమాడతాయి..' అని చంద్రబాబు ఒక సందర్భంలో అన్నారు. కేసీఆర్ విషయంలో ఇప్పుడదే జరుగుతోంది. కేసీఆర్ తదుపరి అడుగులెలా ఉంటాయన్నదే భారత రాష్ట్ర సమితి మనుగడను నిర్ణయిస్తుంది.

కేసీఆర్ చాలా పుస్తకాలు చదివి ఉండొచ్చు కాని ఆ పుస్తకాల వల్ల ఆయన ఏమి నేర్చుకున్నారనేది ప్రధానం. 'ఎవరైనా ఏమైనా చెబితే అర్థం చేసుకునేందుకు వినరు. జవాబిచ్చేందుకు వింటారు..' అని భారతీయుల గురించి ప్రముఖ అమెరికన్ విద్యావేత్త స్టీఫెన్ రిచర్డ్స్ కోవే రాశారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు చాలా సార్లు ఫోన్ చేసేవారు. ఆయన పాలన గురించి వస్తున్న విమర్శలను చెప్పేందుకు ప్రయత్నిస్తే కొట్టి పారేసేవారు. 'కాళేశ్వరం అన్ని విమర్శలకూ సమాధానమిస్తుంది.. దానితో రాష్ట్రం రూపురేఖలు మారిపోతాయి' అని ఒకరోజు చెప్పారు. ఎంతసేపూ ఢిల్లీ రాజకీయాల గురించి, ముఖ్యంగా బీజేపీ గురించే ఆయన మాట్లాడేవారు. దేశ రాజకీయాల్లో చక్రం తిప్పగలనని ఆశించేవారు. ఫాంహౌజ్‌లో ఉన్నదే పూర్తిగా జాతీయ రాజకీయాలపై దృష్టి సారించడం కోసమే. ఢిల్లీలో బిల్డింగ్ కట్టి యజ్ఞం చేస్తే తమ పార్టీ జాతీయ పార్టీ అయిపోతుందని నమ్మిన వ్యక్తి కేసీఆర్. కాళేశ్వరం విషయంలో ఆయన తాను అనుకున్నదే సరైనదని, ఇంజనీర్లకు కూడా ఏమీ తెలియదని భావించేవారని అనేకమంది చెప్పేవారు. ఆ వ్యక్తి తాను పట్టిన కుందేలుకు మూడేకాళ్లని భావిస్తుంటే విద్యాసాగర్‌రావుతో సహా అనేకమంది మేధావులు ఆయనకు చెప్పేందుకు సాహసించేవారు కాదు. ఆ ప్రాజెక్టుకు అయిన ఖర్చులో భారీ అవినీతి జరిగిందని చెప్పేందుకు ఇంజనీర్ల ఇళ్లలో భారీ మొత్తంలో దొరికిన డబ్బే నిదర్శనం.

కేసీఆర్ వ్యవహార శైలి విచిత్రమైనది. ఒక థింక్ టాంక్ అన్నది ఏర్పర్చుకోకపోగా, తన చుట్టూ ఉన్న ఆలోచనాపరుల్ని విస్మరించారు. 'కేసీఆర్ గొప్ప మేధావి. ఆయన చేతితో ముక్కు రుద్దుకున్నారంటే చాలు ఏదో కీలకమైన వ్యూహం వేశారన్నమాట.' అని ఒక రోజు మజ్లిస్ నేత ఒవైసీ సెంట్రల్ హాలులో చెప్పారు. ఇలాంటివన్నీ నడిచినన్ని రోజులే నడుస్తాయి. ఒక రోజు తుగ్లక్ రోడ్ నివాసంలో కేసీఆర్, జయశంకర్‌లతో మాట్లాడేందుకు కాంగ్రెస్ నేత జయరాం రమేశ్ వచ్చారు. మధ్యలో జయశంకర్ మాట్లాడబోగా కేసీఆర్ ఆయనను 'మీకేం తెలుసు. ఆగండి' అని అడ్డుకున్నారు. ఇలాంటి అవమానాలు ఆయన చుట్టూ ఉన్న మేధావులు చాలా మంది ఎదుర్కొన్నారు. 'కేసీఆర్‌తో ఎలా వేగుతున్నారు సార్' అని జయశంకర్‌ను అడిగితే 'కనీసం భౌగోళిక తెలంగాణ రావడం ప్రధానం. అందుకు రాజకీయ సాధనం కేసీఆరే. ఆయనను విస్మరించలేం..' అని చెప్పేవారు. భౌగోళిక తెలంగాణ వచ్చినా జయశంకర్ ఆశించిన సామాజిక తెలంగాణ దిశగా అడుగులు పడలేదు. వ్యవహారశైలి మాత్రమే కాదు. దేశంలో కొన్ని దశాబ్దాలుగా మనుగడలో ఉన్న ఇతర ప్రాంతీయ పార్టీల నేతల్లో లేని అనేక అప్రజాస్వామిక, నియంతృత్వ దుర్లక్షణాలు కేసీఆర్‌లో ఉండడం వల్లే ఇవాళ అధికారం కోల్పోయిన ఏడాదిన్నరలోనే ఆయన మనుగడకోసం తండ్లాడవలసి వస్తోంది. 'మనం వ్యవస్థలతో చెలగాటమాడితే అవి తర్వాత మనతో చెలగాటమాడతాయి..' అని చంద్రబాబు ఒక సందర్భంలో అన్నారు. కేసీఆర్ విషయంలో ఇప్పుడదే జరుగుతోంది. కేసీఆర్ తదుపరి అడుగులెలా ఉంటాయన్నదే భారత రాష్ట్ర సమితి మనుగడను నిర్ణయిస్తుంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

సంక్లిష్ట తరుణంలో సరైన ఎంపిక!

ప్రపంచంలో అతి పెద్ద పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు పెద్దల సభకు అధ్యక్షత వహించడమంటే చిన్న విషయం కాదు. అందుకు అర్హతలతో పాటు యోగ్యతలూ ముఖ్యమే. చట్టసభల ఔన్నత్యాన్ని ఉద్దీపింపజేసే ఈ ప్రక్రియలో అభ్యర్థుల ఎంపిక, ఎన్నిక ఒక కీలక సందర్భం! కొన్ని విషయాల్లో నిర్ణయాలు ఎంత ప్రధానమో అందుకు సంబంధించిన సానుకూల సంకేతాలను ముందుగా ప్రజాక్షేత్రంలోకి తీసుకువెళ్ళడమూ అంతే ప్రధానం. అర్థాంతరంగా ఖాళీ ఏర్పడటంతో ఇప్పుడు జరుగుతున్న భారత ఉపరాష్ట్రపతి పదవి ఎన్నిక ప్రక్రియ కూడా అటువంటిదే! ప్రతిపక్ష ఇండియా కూటమి తమ అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఎంపిక చేయడం ద్వారా ఒక గొప్ప సంప్రదాయాన్ని కొనసాగించింది.

ప్రజాస్వామ్య పద్ధతులు పలుచబారుతున్న సంక్లిష్ట సమయమిది. దేశ అత్యున్నత చట్టసభల్లో రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతను నిర్వహించే విపక్షాలను నిర్లక్ష్యం చేస్తున్న గడ్డు రోజులివి. సరిగ్గా ఇప్పుడే జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వంటి న్యాయకోవిదుడు, ప్రజాస్వామ్యవాది, రాజ్యాంగ విధేయుడి అవసరం ఉన్నత చట్టసభలకు ఎంతగానో ఉన్నది. పార్టీలకు అతీతంగా సభను నడిపే సభాపతిని ఎన్నుకునే ప్రక్రియలో పార్టీ సరిహద్దులు దాటి ఆత్మప్రబోధానుసారం ఓటు వేసైనా యోగ్యుడైన అభ్యర్థిని ఎన్నుకోవాల్సిన బాధ్యత గౌరవ సభ్యులపైన ఉంది.

ఉపరాష్ట్రపతిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఎన్నికైతే, ఆయనే స్వయంగా వెల్లడించినట్టుగా, రాజ్యసభ అధ్యక్ష హోదా నిర్వహణ ఆయన ఇదివరకు నిర్వహించిన న్యాయ ప్రక్రియకు కొనసాగింపు వంటిదే! హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సామాజిక దృక్పథాన్ని, మానవ హక్కుల చేతనను జోడించి భారత న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన ఆయన గతం ఇక్కడ పనికొస్తుంది.



ఉపరాష్ట్రపతిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఎన్నికైతే, ఆయనే స్వయంగా వెల్లడించినట్టుగా, రాజ్యసభ అధ్యక్ష హోదా నిర్వహణ ఆయన ఇదివరకు నిర్వహించిన న్యాయ ప్రక్రియకు కొనసాగింపు వంటిదే! ప్రజాపక్షం వహించి నిర్భీతితో ఇచ్చే తీర్పులాగా నిర్ణయాన్ని ప్రకటించడమే సభా నిర్వహణలో చుక్కాని. హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సామాజిక దృక్పథాన్ని, మానవ హక్కుల చేతనను జోడించి భారత న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన ఆయన గతం ఇక్కడ పనికొస్తుంది. ఇటువంటి విషయాల్లో జస్టిస్ కృష్ణ అయ్యర్, జస్టిస్ భగవతి వంటి కోవిదుల తరగతికి చెందినవారాయన. ప్రజాస్వామ్య పాలనా విధానంపై విశ్వాసమూ, రాజ్యాంగం పట్ల సంపూర్ణ విధేయతా, సామాజిక న్యాయం పట్ల నిస్సందేహమైన నిబద్ధతా, జనహితంలో విలక్షణమైన దార్శనికతా ఆయనలో కనిపిస్తాయి.

నా స్వీయానుభవమే ఒకటి మీతో పంచుకుంటాను. 1989లో నేను తొలిసారి ఎమ్మెల్యే అయ్యాను. నా నియోజకవర్గ పరిధిలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' పేరిట, జిల్లా కలెక్టర్ అనుమతితో, మండల అధికారులను వెంట తీసుకొని గ్రామ గ్రామం తిరుగుతూ గ్రామ సభలు ఏర్పాటు చేసేవాళ్ళం. పార్టీలకు అతీతంగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తూ, వాటిని అక్కడికక్కడే సంబంధిత అధికారుల దృష్టికి తెస్తూ ఆ సమస్యల్ని పరిష్కరించేవాళ్ళం. ఈ కార్యక్రమానికి మంచి స్పందన రావడంతో ప్రతిపక్షం ఓర్వలేక నా పైన, దీనికి అనుమతిచ్చిన జిల్లా అధికారులపైన కోర్టులో కేసు వేసింది. మేం అధికార దుర్వినియోగం చేస్తున్నామన్నది వారి అభియోగం. అప్పుడు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి న్యాయవాదిగా నా కేసు వాదించారు. ప్రజాప్రతినిధిగా ఎన్నికైన నాయకుడు పార్టీలకు అతీతంగా ప్రజాసేవకు నిలబడటం, ప్రభుత్వాధికారుల సేవల్ని అందుకు వినియోగించడం రాజ్యాంగబద్ధమనే అంశం ప్రాతిపదికగా ఆయన తన వాదనలను వినిపించారు. మేం కేసు గెలిచాం. పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవలందించాలన్న విశాల ప్రజాస్వామ్య దృక్పథాన్ని ఆయన తన ఆలోచనా ధోరణిగా అలవర్చుకొని, నేటి వరకూ కొనసాగిస్తూనే ఉన్నారు.

1971లో న్యాయవాద వృత్తి చేపట్టిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి న్యాయరంగంలో వివిధ హోదాలకు ఎదిగారు. రాజ్యాంగ సంబంధపు అంశాల్లో హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో కేసులపై వాదించటంలోను, ప్రజాప్రయోజన వ్యాజ్యాల విషయంలోను ఆయనకు మంచి పేరుండేది. ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో, జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ (నల్సా) ఛైర్మన్‌గా సేవలందించారు. 1995లో హైకోర్టు జడ్జిగా, 2007 నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులై 2011 వరకు పని చేశారు. రాజకీయ ప్రభావాలకు న్యాయ వ్యవస్థ లోను కాకూడదన్న బలమైన నమ్మికతో సుదర్శన్‌రెడ్డి పదవీ కాలమంతా వృత్తి నిబద్ధతకు కట్టుబడే నడచుకున్నారు.

హైకోర్టు, సుప్రీంకోర్టు స్థాయిలో ఆయన వెలువరించిన పలు తీర్పులు న్యాయవాదులకు, వృత్తి నిపుణులకు మార్గదర్శకాలుగా నిలుస్తాయి. ఛత్తీస్‌గఢ్ 'సల్వాజుడుం' కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం సభ్యుడిగా ఆయన వెలువరించిన తీర్పు చరిత్రలో నిలుస్తుంది. తీవ్రవాదానికి పోటీగా గిరిజన పౌరుల చేతికి ఆయుధాలిచ్చి, రాజ్యమే దళాలను ఏర్పాటు చేయటం, హింస-ప్రతిహింసలో ప్రజలను భాగస్వాముల్ని చేయటం అధర్మమూ, ప్రమాదకరమేగాక రాజ్యాంగ వ్యతిరేకమని ఆయన ఈ తీర్పులో విస్పష్టంగా పేర్కొన్నారు. న్యాయహోదా ముగిసిన తర్వాత ప్రజాక్షేత్రంలో క్రియాశీలంగా ఉంటూ ప్రజాస్వామ్య ఉద్యమాలకు ప్రత్యక్ష పరోక్ష మద్దతు ప్రకటిస్తూ వచ్చారు. సమయం, సందర్భం, పౌరుల అవసరాల్ని బట్టి గొంతు విప్పడం కూడా ఆయన్ని ప్రజాక్షేత్రంలో ప్రత్యేకమైన వ్యక్తిగా నిలిపింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ఆయన ప్రత్యక్షంగా మద్దతు తెలిపారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత పాలన గతి తప్పుతున్నప్పుడు ఆయనేం మౌనంగా లేరు. ప్రజాభిప్రాయాన్ని తన వ్యాఖ్యలు, ప్రకటనల ద్వారా ప్రతిబింబిస్తూనే వచ్చారు.

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే పదకొండేళ్ల పాలనలో వివిధ ప్రజాస్వామ్య వ్యవస్థలు నిర్వీర్యమవుతూ వస్తున్నాయి. కేంద్ర నేర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆదాయ పన్ను (ఐటీ) విభాగం వంటి సంస్థల్ని తమ రాజకీయ ప్రయోజనాల కోసం దురుపయోగపరుస్తున్నారు. చివరకు భారత ఎన్నికల సంఘం వంటి స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థల విశ్వసనీయతను కూడా స్వార్థంతో భంగపరుస్తున్నారు. చట్ట సభల నిర్వహణ సజావుగా లేదు. విపక్షాల గొంతు నొక్కి, ఏకపక్షంగా ప్రజావ్యతిరేక, రాజ్యాంగ ప్రతికూల బిల్లుల్ని తెచ్చి ఆమోదింపజేసుకుంటున్నారు. ఇదే తీరు నియంత్రణ లేకుండా కొనసాగితే రాజ్యాంగానికి రక్షణ లేకపోగా ప్రజాస్వామ్యమే గంపగుత్తగా ప్రమాదంలో పడే ఆస్కారం ఉంది. ఇటువంటి సంక్లిష్ట, సంక్షుభిత సమయాల్లోనే జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వంటి జనహిత, ప్రజాస్వామ్య వాదుల నాయకత్వం చట్ట సభలకు వన్నె తెస్తుంది. పార్టీలకతీతంగా ఆత్మప్రబోధానుసారం నిర్ణయం తీసుకొని భారత చట్టసభల ఔన్నత్యాన్ని నిలబెట్టడానికి సభ్యులకు ఇది ఒక గొప్ప అవకాశం.

■ డా. జి. చిన్నారెడ్డి
ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం

వర్సిటీల్లో ఆచార్యుల నియామకాలు జరిగేనా?

విద్యార్థులు, యువత ఆకాంక్షలకు అనుగుణంగా పాలన చేస్తామని అధికారంలోకి వచ్చిన ప్రస్తుత అధికార పార్టీ అధ్యాపకుల నియామకంపై ఇదిగో, అదిగో అనుడే తప్ప రెండేళ్లు గడిచినా స్పష్టమైన ప్రకటన చేయలేకపోయింది. ఉద్యోగ నియామకాలకు సంబంధించిన యూజీసీ నిబంధనలను కాదని కొత్త నిబంధనల పేరుతో కాలయాపన చేస్తూ వస్తోంది. నిబంధనలు ఏవైనా... అధ్యాపకుల నియామకాలు జరగకపోతే ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు వెంటిలేటర్ పైకి వెళ్లే ప్రమాదం కనిపిస్తోంది. రాష్ట్రంలోని యూనివర్సిటీలలో 2,828 పోస్టులు ఉండగా, వాటిలో 1,869 అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఓయూలో–845, కేయూలో–298, జేఎన్టీయూలో–232, ఆర్జీయూకెటీ–128, మహాత్మాగాంధీ–35, పాలమూరు–73, తెలంగాణ–73, శాతవాహన–45, బీఆర్ అంబేడ్కర్–48, జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్–31, పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో–61 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంటే 78 శాతం అధ్యాపకులు లేకుండానే విశ్వవిద్యాలయాలు నడుస్తున్నాయి. సత్వరమే నిర్దిష్టమైన క్యాలెండర్‌ను ప్రకటించి ఆచార్యుల నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. 200, 100 ఖాళీలంటూ తప్పుడు లెక్కలతో కాకుండా, వాస్తవంగా ఖాళీగా ఉన్న ప్రతి ఉద్యోగాన్ని భర్తీ చేయాలి. అప్పుడే ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలు తమ పూర్వ వైభవాన్ని సంతరించుకుంటాయి. మిగతా విశ్వవిద్యాలయాలు తమ అస్తిత్వాన్ని నిలుపుకుంటాయి.

విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల నియామకాలతో పాటు కనీస మౌలిక వసతుల కల్పనపైనా ప్రభుత్వం దృష్టి సారించాలి. ఎప్పుడో 50 ఏళ్ల క్రితం నిర్మించిన వసతి గృహాలు, భోజనశాలల స్థానంలో కొత్తవి నిర్మించాల్సిన అవసరం ఉంది. ఆధునిక సాంకేతికత ప్రపంచాన్నే శాసిస్తున్న ప్రస్తుత ప్రపంచంలో పరిశోధనలకు గాను అవసరమైన లాబోరేటరీలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఉస్మానియా విశ్వవిద్యాలయ సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి కనీసం వెయ్యి కోట్ల నిధులను కేటాయించాలి. అప్పుడే తెలంగాణ సమాజం, విద్యార్థి లోకం ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశంసిస్తుంది.

– జీవన్
ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు




ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA

బుధవారం 3 సెప్టెంబరు 2025

5



మెరుగైన వైద్య సేవలు అందించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- వడ్డేపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిపై సీరియస్ అవుతున్న కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ మెడికల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. హనుమకొండ వడ్డేపల్లిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన రికార్డులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులలో సరిగా వివరాలు నమోదు చేయని సిబ్బందిపై కలెక్టర్ సీరియస్ అయి సిబ్బందిని మందలించారు. ఆరోగ్య కేంద్రంలోని పలు విభాగాలను సందర్శించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌టెక్నీషియన్ అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్ ఆరా తీయగా తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్‌కు పంపించినట్లు వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య కలెక్టర్‌కు తెలిపారు. రోగులకు వైద్య పరీక్షలు ఎలా నిర్వహిస్తున్నారని కలెక్టర్ అడగగా వారంలో రెండురోజుల పాటు (సోమ, శుక్రవారాలు) స్టాఫ్‌నర్స్ ద్వారా రక్తనమూనాలు సేకరించి వాటిని తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్‌కు పంపిస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం వడ్డేపల్లిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిర్మిస్తున్న శాశ్వత భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట హనుమకొండ తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, వడ్డేపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మాలిక, ఇతర వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

కవిత వెంట నడిచేదెవరు!?

బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్‌తో అయోమయంలో గులాబీ, జాగృతి కేడర్

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ, కేసీఆర్ తనయ కల్వకుంట్ల కవిత సస్పెన్షన్ ఎపిసోడ్... ఉమ్మడి జిల్లాలో ఉత్కంఠ రాజకీయాలకు తెరతీసింది. ఊహించినట్టుగానే బీఆర్ఎస్ అధిష్ఠానం కవితను పార్టీ నుంచి గెంటేయడంతో అటు బీఆర్ఎస్, ఇటు జాగృతి శ్రేణులు అయోమయంలో పడిపోయాయి. తాజా పరిణామాలతో గులాబీ కండువాతో పాటు జాగృతి కండువా కప్పుకుని పని చేసిన నేతలు.. ఎటుపోవాలో తేల్చుకోలేని సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. బీఆర్ఎస్‌లో కొనసాగటమా..? జాగృతి వెంట నడవటమా..? అనేది ఉత్కంఠగా మారింది. మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయభాస్కర్ సోదరుడు విజయభాస్కర్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో జాగృతి కీలక నేతగా ఉన్నారు. కవితకు సన్నిహితుడిగా పేరుపొందారు. తాజా పరిణామాల్లో ఆయన గులాబీ పార్టీ వైపే మొగ్గు చూపుతున్నట్లుగా సమాచారం. విభజిత జిల్లాల్లోని కవిత అనుచర నేతల స్టాండ్ ఏమిటనేది ఇంకా తేలాల్సివుంది. బీఆర్ఎస్‌లోని కీలక నేతలు, అసంతృప్తనేతలు కవిత వెంట నడుస్తారా? అనేది కూడా చర్చనీయాంశంగా మారింది.



- ఇన్నాళ్లు కలిసి పని చేసిన గులాబీ, జాగృతి శ్రేణులు
- బీఆర్ఎస్‌లో కొనసాగడమా..? కవిత వెంట వెళ్లడమా..?
- సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్న నాయకులు, శ్రేణులు
- జాగృతిలో కీలక నేతగా ఉన్న దాస్యం విజయ్‌భాస్కర్ బీఆర్ఎస్ వైపే..
- ఇప్పటికే సింగరేణి టీజీబీకేఎస్ నుంచి కవితకు చెక్
- ముఖ్య నేతలతో కవితకు సత్సంబంధాలు అంతంత మాత్రమే..
- తాజా పరిణామాలపై ఓరుగల్లు గులాబీ శ్రేణుల్లో ఉత్కంఠ



▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవితపై పార్టీ అధిష్ఠానం వేటు వేయడం కలకలం రేపుతోంది. పార్టీ వ్యతిరేక కలాపాలకు పాల్పడుతుండటంతో కవితను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లుగా బీఆర్ఎస్ అధిష్ఠానం ప్రకటించింది. దీంతో ఉమ్మడి వరంగల్ గులాబీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి తెలంగాణ జాగృతి పేరుతో కవిత బీఆర్ఎస్‌తో కలిసి పని చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ జాగృతికి బలమైన కేడర్ ఉండేవారు. మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సోదరుడు దాస్యం విజయ్‌భాస్కర్‌తో పాటు అనేక మంది కీలక నేతలు తెలంగాణ జాగృతి కార్యక్రమాలు చేపట్టారు. ఏటా ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించటంతో మహిళలకు బాగా చేరువైంది. విద్యార్థులను కలుపుకుని తెలంగాణ ఉద్యమంలో జాగృతి కార్యకర్తలు చురుకుగా పాల్గొన్నారు. కాకతీయ యూనివర్సిటీ సమస్యలపైన జాగృతి కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు. కొన్నేళ్లుగా బీఆర్ఎస్‌తో కలిసి జాగృతి కార్యకర్తలు అనేక ఉద్యమాల్లో పాల్గొన్న చరిత్ర ఉంది. అయితే చాలామంది కార్యకర్తలు, నాయకులు జాగృతి కార్యక్రమాల్లో పాల్గొంటూనే బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. కవితను పార్టీ నుంచి బహిష్కరించటంతో పార్టీ, జాగృతిలో పని చేస్తున్న కేడర్ సందిగ్ధంలో పడిపోయింది. కవిత కొత్తగా పార్టీని ఏర్పాటు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. దీంతో కవితతో పాటు కొత్త పార్టీలోకి వెళ్లాలా? లేక ఉద్యమం నుంచి కొనసాగుతున్న బీఆర్ఎస్‌లోనే ఉండిపోవాలా? అనే అయోమయం నెలకొంది.

కవిత వెంట నడిచేదెవరు..?

పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్సీ కవితకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో మద్దతుగా నిలిచే బలమైన నాయకులు

(మిగతా 7లో..)



తొర్రూరు బస్టాండ్ సెంటర్ ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కేసీఆర్‌ను బద్‌నాం చేస్తున్నారు..

- కాళేశ్వరంపై విచారణను సీబీఐకి అప్పగించడం సరికాదు
- బీఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్, మాలోతు కవిత
- కురవిలో మంత్రుల కాన్వాయ్‌ని అడ్డుకునేందుకు యత్నం

మహబూబాబాద్ టౌన్/మట్టెవాడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణను రాష్ట్ర సర్కార్ సీబీఐకి అప్పగించడాన్ని నిరసిస్తూ మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళనలు చేపట్టారు. మహబూబాబాద్ తహసీల్ ఆఫీస్ ఎదుట మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌ను బదనాం చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ నాటకం ఆడుతోందని దుయ్యబట్టారు. తొర్రూరు బస్టాండ్ సెంటర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాళేశ్వరంపై కాలయాపన చేసి గోదావరి జలాలను ఆంధ్రాకు తీసుకువెళ్లే కుట్ర జరుగుతుందని విమర్శించారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు మాలోతు కవిత, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌ల ఆధ్వర్యంలో కురవిలోని జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ క్రమంలో మహబూబాబాద్‌లో మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి జిల్లా కేంద్రానికి వస్తున్న మంత్రులు దామోదరరాజనర్సింహా, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి,

(మిగతా 6లో..)



వరంగల్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

పోలీసులను చూసి.. గంజాయిని దాచి..



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

- అడవిలో 763 కిలోల ఎండు గంజాయి నిల్వ
- వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- డ్రగ్ కంట్రోల్ టీమ్, ఖానాపురం పోలీసుల ఆపరేషన్
- స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ 3.81 కోట్లు
- ఏపీ, ఒడిషా, సూర్యాపేటకు చెందిన నలుగురు స్మగ్లర్ల అరెస్టు

7

వైద్యరంగానికి సర్కార్ పెద్దపీట

- సామాన్యుడికి అందుబాటులోకి మెరుగైన వైద్యం
- ఆరోగ్య శాఖలో 8 వేల ఉద్యోగాలు భర్తీ
- జిల్లా కేంద్రాల్లో క్యాన్సర్ కేర్ సెంటర్‌ల ఏర్పాటుకు కృషి
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా



మానుకోటలో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహా, వేదికపై మంత్రులు సురేఖ, పొంగులేటి తదితరులు

మహబూబాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యరంగానికి పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు సర్కార్ ఆస్పత్రుల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రూ.186 కోట్లతో నిర్మించిన వైద్యకళాశాల బాలుర, బాలికల హాస్టళ్లు, 50 పడకల క్రిటికల్ కేర్ సెంటర్ భవనాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు.

మెడికల్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. మహబూబాబాద్‌లో త్వరలోనే 310 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వైద్యశాఖలో 8 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు రాజనర్సింహా తెలిపారు. వైద్య కళాశాలలో మెరుగైన విద్యనందించేందుకు ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు పేదలకు వైద్య సేవలందించేందుకు డాక్టర్లు, సిబ్బందిని భర్తీ చేశామన్నారు.

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించక పోయినా అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా చూసుకుంటూ.. ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు. మెరుగైన వైద్యం కావాలంటే డాక్టర్లు కావాలి, వారిని తీర్చి దిద్దాలంటే వైద్య కళాశాలలో మెరుగైన విద్యఅందాలని, అందుకోసం వైద్య కళాశాలలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. యూరియాను పెద్ద సమస్యగా చిత్రీకరిస్తున్నారని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని అందరికి యూరియా అందుతుందన్నారు. కేంద్రాన్ని పదేపదే కోరినా కొంత మేరకు మాత్రమే యూరియా ఇచ్చారని ఆరోపించారు.

అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ తెలంగాణలో గత పాలకుల నిర్లక్ష్యం వల్ల వైద్య విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అరకొర వసతుల నడుమ వైద్య కళాశాలలను ఏర్పాటు చేసి, చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని హంగులతో వైద్య కళాశాలలను నిర్మిస్తుందన్నారు. సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యకళాశాల, జిల్లా ఆస్పత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరారు. సంవత్సర కాలంలో వైద్యశాఖకు సంబంధించి అన్ని భవనాల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మానుకోట జిల్లా హెల్త్, ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతుందన్నారు. అనంతరం నూతన అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ జాటోతు రాంచందర్‌నాయక్, మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, టీపీసీసీ ఉపాధ్యక్షులు ఝాన్సీరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, లేకుంటే గద్దె దిగిపోవాలని ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రూ.8వేల కోట్ల వరకు విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందని, వీటిని వెంటనే విడుదల చేయాలని, అలాగే మెస్, కాస్మోటిక్ చార్జీలను కూడా తక్షణమే విడుదల చేయాలన్నారు. నూతన విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. కాగా, ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను సుబేదారి పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి గంట అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కల్యాణ్, బీరెడ్డి జశ్వంత్, అనూష, జిల్లా సహాయ కార్యదర్శి పరిమళ, ఈశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు మడికొండ ప్రశాంత్, చెన్నూరి సాయికుమార్, ఎం.డి. ఇస్మాయిల్, పవన్‌కుమార్, అరుణ్‌కుమార్, నిఖిల్, మహేష్, భాను, రవళి, సుమ, సుమతి, రాధిక, మమత, ప్రవళితో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఆగని యూరియా తిప్పలు

హనుమకొండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వరంగల్, హనుమకొండ జిల్లాల్లో రైతుల యూరియా తిప్పలు కొనసాగుతూనే వున్నాయి. వరుసగా ఆందోళనలకు దిగుతున్నా సరిపడా బస్తాలు అందించడం లేదు. దీంతో పీఏసీఎస్‌ల వద్ద ఉద్రిక్తతలు నెలకొంటున్నాయి. మంగళవారం యూరియా కొరతను నిరసిస్తూ ఖానాపురం మండలం మంగళవారిపేట పరిధిలోని వివిధ తండాలకు చెందిన వందలాది మంది రైతులు రామలింగయ్యపల్లె రైతువేదిక ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించి 3 గంటల పాటు రాస్తారోకో చేశారు. మహబూబాబాద్ జిల్లాకు యూరియాను తరలిస్తున్న లారీలను అడ్డుకొని బస్తాలను లాక్కునేందుకు యత్నించారు. పర్వతగిరి, రాయపర్తి, వర్ధన్నపేట, ధర్మసాగర్ తదితర ప్రాంతాల్లో యూరియా కోసం రైతులు బారులు తీరారు.

వైఎస్‌కు ఘన నివాళి



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతి కార్యక్రమం మంగళవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగింది. 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు తదితరులు వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించారు.

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ సిటీ



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్ కుట్రలకు కవిత బలి

● కూతురు కంటే కార్యకర్తలే కేసీఆర్‌కు ముఖ్యం
● జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పన్నిన కుట్రలకు ఎమ్మెల్సీ కవిత బలి అయ్యారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జనగామ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన కవిత సస్పెండ్‌పై స్పందించారు. కవిత చేసిన వ్యాఖ్యలు పార్టీని గాయపరిచేవిగా ఉన్నాయని అన్నారు. కేసీఆర్ సమయం చూసి నిర్ణయం తీసుకుంటారని, అందువల్లే మారేందుకు కవితకు కొంత సమయం ఇచ్చారని పేర్కొన్నారు. కవితపై చర్యలు తీసుకోవాలంటూ పార్టీ కార్యకర్తల నుంచి కూడా డిమాండ్లు వచ్చాయన్నారు. కేసీఆర్ తన కూతురు అయినప్పటికీ 60లక్షల మంది పార్టీ కార్యకర్తల మనోభావాలకే గౌరవమిచ్చారన్నారు. కవిత వ్యాఖ్యలు, కాంగ్రెస్ కుట్రలకు పార్టీ బలి కావొద్దనే ఉద్దేశంతోనే బహిష్కరణ నిర్ణయం తీసుకున్నారని స్పష్టం చేశారు. కేసీఆర్ నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతిస్తున్నారన్నారు. కవితపై చర్యల ద్వారా ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని కేసీఆర్ తేల్చారన్నారు.

కేయూలో తీజ్ ఉత్సవాలు

హాజరైన వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం



తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం, మాజీ ఎంపీ సీతారాంనాయక్ తదితరులు

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ లాడ్జ్ వద్ద 9 రోజులు పాటు జరిగే తీజ్ ఉత్సవాలను మొదటి రోజు ఘనంగా ప్రారంభించారు. కేయూ ఈసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్‌లు హాజరయ్యారు. భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు, మాజీఎంపీ సీతారాంనాయక్ మాట్లాడారు. తీజ్ ఉత్సవాలను వర్సిటీలో జరుపుకోవడానికి అనుమతించడంపై మాజీ ఎంపీ సీతారాంనాయక్ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలతో పాటు పాలక మండలి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, సైన్స్ విభాగాల డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు, స్కాలర్లు, మహిళ విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కాజీపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్పృహ కోల్పోయి పడి ఉన్న వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కాజీపేట ఎస్సై నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రాకారం.. గత నెల 18న విష్ణుపురి వాటర్‌ట్యాంక్ వద్ద ఓ వ్యక్తి స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు చికిత్స నిమిత్తం ఎంజీఎంలో చేర్పించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి ఎత్తు 5.5 వయస్సు 35 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుంది. తెలుపు రంగు పొడవైన ముఖం, నల్ల గడ్డం ఉంది. నల్ల ప్యాంట్, బ్లూచెక్స్ షర్ట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు 87126 85008 ఫోన్‌నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు.

ఆరు నెలల్లో జనగామ మెడికల్ కాలేజీ నిర్మాణం

సెంట్రల్ మెడికల్ స్టోర్ మంజూరుకు సన్నాహాలు

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

జనగామ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఆరు నెలల్లోగా జనగామ మెడికల్ కాలేజీ, హాస్టల్ బిల్డింగుల నిర్మాణాలను పూర్తి చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జనగామ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జిల్లా ఆస్పత్రి)లో ఏర్పాటు చేసిన సీటీ స్కాన్ మిషన్‌ను మంగళవారం ప్రారంభించి, సేవలను అందుబాటులోకి తెచ్చారు. అనంతరం జిల్లా ఆస్పత్రి వైద్యులు, మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు, జిల్లా వైద్యాధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వైద్యశాఖ కార్యక్రమాల అమలు, మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ నిర్మాణ పనులు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో వైద్యశాఖ పరంగా చేయాల్సిన పనులను ఆయన నోట్ చేసుకున్నారు.

అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. జనగామ మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు ప్రస్తుతం 50శాతం పూర్తయ్యాయని, రాబోయే ఆరు నెలల్లోగా పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో మూడో అంతస్థు నిర్మాణం చేసి మరో 70పడకలను పెంచాలని భావిస్తున్నామన్నారు. అలాగే జనగామకు సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌ను మంజూరు చేసి శాశ్వత భవన నిర్మాణం చేయాల్సి ఉందన్నారు.



సీటీ స్కాన్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న దామోదర రాజనర్సింహ

నేడు కేయూ స్పోర్ట్స్ బోర్డు కార్యవర్గ సమావేశం

కేయూక్యాంపస్ సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యవర్గ సమావేశం బుధవారం (నేడు) ఉదయం 10 గంటలకు కేయూ సెనెట్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. వర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ కళాశాలల వ్యాయమ విభాగం డైరెక్టర్లు పాల్గొంటారని వివరించారు. 2025-25 ఏడాదికి సంబంధించిన క్రీడలు, అథ్లెటిక్స్ నిర్వహణకు సంబంధించిన క్రీడా క్యాలెండర్‌పై చర్చిస్తారని తెలిపారు. ఇంటర్ కాలేజీ టోర్నమెంట్, ఇంటర్ వర్సిటీలు, సౌత్ జోన్, ఇల్ ఇండియా ఇంటర్ వర్సిటీ క్రీడలకు క్రీడ జట్ల ఎంపికలపై చర్చిస్తామని వెల్లడించారు. సమావేశంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ హాబీబుద్దీన్‌లు పాల్గొంటారని వెంకయ్య తెలిపారు.

రేపు ఉత్తమ గణపతులకు బహుమతులు

కాళోజీ కళాక్షేత్రం వేదికగా అందజేత

సిల్వర్ జూబ్లీ వేడుకల్లో నవరాత్రి ఉత్సవ సమితి

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మహానగరంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవ సమితుల్లో ఉత్తమమైనవి ఎంపిక చేసిన బహుమతులను అందించనున్నట్లు వరంగల్ మహానగర్ గణపతి నవరాత్రి ఉత్సవ సమితి కన్వీనర్ న్యాలగొండ భాస్కర్‌రావు మంగళవారం చెప్పారు. వరంగల్ మహానగర పరిధిలో గతంలోకంటే ఎక్కువగా ఈసారి రెండున్నరవేలకు పైచిలుకు మట్టి గణపయ్యలను ఏర్పాటు చేశారన్నారు. మొత్తంమీద సుమారు 6,400 గణపతులను ప్రతిష్ఠింపజేసినట్లు తెలిపారు. వీరిలో ఉత్తమ గణపతులను ఎంపిక చేసి గురువారం సాయంత్రం 5 గంటలకు హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం వేదికగా బహుమతులు చేస్తామన్నారు. పోలీస్ కమిషనర్, పశ్చిమ ఎమ్మెల్యే, ఇతర అధికార గణంతో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

ఏడు ప్రాంతాలుగా..

వరంగల్ మహానగరాన్ని విశ్వకర్మనగర్, హనుమకొండ నగర్, విశ్వవిద్యాలయనగర్, వరంగల్ నగర్, కాశిబుగ్గ నగర్, భవానీనగర్, ఖిలానగర్‌లుగా ఏడు ప్రాంతాలుగా విభజించినట్లు భాస్కర్‌రావు తెలిపారు. ఈ ప్రాంతాల్లో ఉత్తమ గణపతుల ఎంపిక కోసం తమ ఉత్సవ సమితి నుంచి 15 మంది పనిచేస్తున్నట్లు తెలిపారు. ఏడు ప్రాంతాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయతోపాటు ఉత్తమ బహుమతులు, ఇంకా ఓవరాల్‌గా వరంగల్ మహానగర్ పరిధిలో విశేష కార్యక్రమాలు నిర్వహించే గణపతి ఉత్సవ సమితిలను మరో మూడింటిని ఎంపికచేసి బహుమతులు అందజేస్తామన్నారు. తనతోపాటు కేసీరెడ్డి జయపాల్‌రెడ్డి, వెలగందుల రాజ, శ్రీరాం ఉదయ్‌కుమార్, నందాల చందర్‌బాబులు కో కన్వీనర్లుగా వ్యవహరిస్తూ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు.

సిల్వర్ జూబ్లీ వేడుకలు

2000 మార్చి మాసంలో ప్రముఖ న్యాయవాది భగవాన్‌దాస్ మందాని, ఆర్ఈసీ ప్రొఫెసర్ ఎం.పాండురంగారావు, కాజీపేటకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ విశ్వనాథ్‌రావుల సారథ్యంలో గణపతి నవరాత్రి ఉత్సవ సమితి ఆవిర్భవించిందని భాస్కర్‌రావు చెప్పారు. వారి తదనంతరకాలంలో రెండు దశాబ్దాలుగా తాను కన్వీనర్‌గా ఉంటూ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. అదే క్రమంలో ఈసారి కాళోజీ కళాక్షేత్రం వేదికగా తమ సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలను నిర్వహించుకుంటున్నామన్నారు.



వేడుకల ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీపీ

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

● వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ● వర్ధన్నపేట పీఎస్ తనిఖీ

వర్ధన్నపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని కోనారెడ్డి చెరువును పరిశీలించిన అనంతరం పోలీస్‌స్టేషన్‌ను సీపీ తనిఖీ చేశారు. సీపీకి పోలీస్ అధికారులు పూలమొక్కలను అందించి స్వాగతం పలికారు. సాయుధ పోలీసులు సీపీకి గౌరవ వందనం చేశారు. పీఎస్, రిసెప్షన్, సీసీటీఎన్ఎస్ విభాగాల పనితీరును సంబంధిత పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్, కోర్టు, దర్యాప్తులో ఉన్న కేసులపై పలు ఆదేశాలు జారీ చేశారు. శాఖపరమైన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు నమ్మకాన్ని కలిగించడంతో పాటు పోలీసులపై ప్రజల్లో విశ్వాసం పెంచాలన్నారు. నిజాయితీగా విధులు నిర్వర్తించాలని, పీఎస్‌కు వచ్చేవారితో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. తనిఖీల్లో వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు సాయిబాబు, మేరుగు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



కోనారెడ్డి చెరువును పరిశీలిస్తున్న సీపీ

శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

పలు డివిజన్‌లలో క్షేత్రస్థాయి పర్యటన



నాగమయ్యగుడి ప్రాంతంలో మ్యాన్‌హోల్ పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధి 66 డివిజన్‌ల పరిధిలో శానిటేషన్ పనులు వంద శాతం జరగాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ వరంగల్ నగరంలోని పలు డివిజన్‌లలో క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సిబ్బంది కాలనీలలో పనులు సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు. వరంగల్‌లోని 7, 41, 42 డివిజన్‌లలోని పలు కాలనీలలో పర్యటించి డ్రేనేజీలు, మ్యాన్‌హోల్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పోశాల పద్మ, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈ రవి కుమార్, డీఈ శ్రీకాంత్, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ మధూకర్ పాల్గన్నారు.

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

● నిర్వాహకులతో పాటు విటుడి అరెస్టు

హసన్‌పర్తి, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): వ్యభిచారం గృహంపై టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడి చేసి నిర్వాహకుడితో పాటు ఒకరిని అరెస్టు చేసినట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం... వరంగల్ జిల్లా సంగెం మండలం గుంటూర్‌పల్లికి చెందిన దండ వెంకట్రావ్ అతడి భార్య హనుమకొండ గోపాల్‌పూర్ విజయగణపతి కాలనీ రోడ్ నెం.15లో కొంత మంది వ్యక్తులు వ్యభిచార గృహాన్ని నడుపుతున్నట్లు పక్కా సమాచారం అందింది. దీంతో మంగళవారం కేయూ ఎస్సై శ్రీకాంత్‌తో పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ఉండగా వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ విచారణలో వ్యభిచార నిర్వాహకులు వెంకట్రావ్ అతడి భార్య రజిత ఆలియాస్ రాణిలతో పాటు వరంగల్ శివనగర్‌కు చెందిన బొట్టు శ్రీనివాస్, మహిళను అరెస్టు చేసి వారి వద్ద కండోమ్ పాకెట్లు, 3 సెల్‌ఫోన్‌లు, రూ.25.530 నగదు, ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ కేయూ పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రవికుమార్ తెలిపారు. ఈ దాడుల లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు, ఆర్ఎస్సై భానుప్రకాష్ టాస్క్‌ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.



ఆల్‌ఇండియా కౌన్సిల్ సదస్సులో పాల్గొన్న మేయర్ సుధారాణి

వరంగల్ నగరాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ సదస్సులో సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరాభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వరంగల్ మేయర్ గుండు సుధారాణి స్పష్టం చేశారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ (ఏఐసీఎం) సదస్సు హరియాణా రాష్ట్రంలోని కర్నాల్ జిల్లాలో మంగళవారం జరిగింది. రెండు రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి హాజరై వరంగల్ ప్రాశస్త్యాన్ని వివరించారు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.4,170 నిధులు మంజూరు చేసిందన్నారు. ఇటీవల యునెస్కో నెట్‌వర్క్ ఆఫ్ లర్నింగ్ సిటీస్‌కు వరంగల్ నగరం ఎంపికైందన్నారు. కాగా, హరియాణాలో జరిగిన 53వ సర్వసభ్య సమావేశానికి జాతీయ గృహనిర్మాణ పట్టణ వ్యవహారాల, విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దేశంలోని పలు రాష్ట్రాల మునిసిపల్ కార్పొరేషన్‌ల మేయర్లు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా విద్యాలత

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం.విద్యాలతకు పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎం.విద్యాలతకు డైరెక్టర్, పంచాయతీ రాజ్ గ్రామీణ ఉపాధి హైదరాబాద్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యాలత మంగళవారం హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం విద్యాలతను కలెక్టర్ స్నేహ శబరీష్, డీఆర్‌డీఓ హనుమకొండ మేన శ్రీను, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్, జిల్లా పరిషత్ హనుమకొండ ఉపముఖ్య కార్యనిర్వాహణాధికారి బి.రవి, కార్యాలయ పర్యవేక్షకులు కె.రవిప్రకాష్, సునీల్, సిబ్బంది నవీన్, గోపాల్‌సింగ్, వేణుగోపాల్, నాలుగో తరగతి సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



అమరధామంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం

పరకాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల ఆశయాలను కొనసాగించాలని, స్వేచ్ఛా స్వాతంత్రం కోసం జరిగిన పోరాటంలో తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రత్యేక గుర్తింపు ఉందని నాన్ పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ సిరికొండ శ్రీనివాసచారి అన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పలు ఉద్యమ సంఘాలు, రచయిత సంఘాలు అమరధామంలో అమరవీరులకు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు రేపాల నర్సింహారాములు, తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీష్‌రెడ్డి, ఎడ్ల సుధాకర్, బూచి ప్రభాకర్‌రెడ్డి, రేగూరి రాఘవరెడ్డి, మాడుగుల పాపిరెడ్డి, జగతి పాల్గొన్నారు. పరకాల అమరవీరుల నెత్తుటి సాక్షిగా వారి త్యాగాలు, బలిదానాలను స్ఫూర్తిదాయకంగా తీసుకొని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని స్వాతంత్ర సమరయోధుల వారసుల సంఘం ప్రధాన కార్యదర్శి రేపాల నర్సింహారాములు అన్నారు. మంగళవారం పరకాలలో అమరవీరుల స్మారణ భవనం ఆవరణలోని అమరవీరుల స్మారక శిలాఫలాకానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరవీరుల స్మారక భవనంతోపాటు అమరధామాన్ని పర్యాటక కేంద్రాలను పదిల పర్చుకొని భావితరాలకు స్ఫూర్తిగా నిలిచేలా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాడి ప్రతాప్‌రెడ్డి, ముదురుకోళ్ల సంపత్, జనార్దన్‌రావు, జలాలుద్దీన్, సారంగపాణి, కైలాసం, ప్రభాకర్‌రెడ్డి, సమ్మయ్య, నర్సింగరావు, విజయ్‌కుమార్, లింగయ్య, రాజయ్య, సాంబయ్య, శివనాగులు తదితరులు పాల్గొన్నారు.

సాహసగాథలను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

సాహసగాథలను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పరకాలోని అమరధారంలో స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు బీజేపీ ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. నాటి అమరుల చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్, జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావు, డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, గురుప్రసాద్, గుజ్జ సత్యనారాయణరావు, మేఘనాథ్, సంగా పురుషోత్తం, రాజ్‌కుమార్, పూర్ణాచారి, విజేందర్‌రావు, రామన్న, రాజభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను బద్‌నాం చేస్తున్నారు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ విప్ జాటోత్ రాంచందర్‌నాయక్‌ల వాహనాలను బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకున్నారు. పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తల నడుమ తోపులాట చోటు చేసుకుంది. అనంతరం పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తలను రోడ్డుపై నుంచి తప్పించి రాంచందర్‌నాయక్ కాన్వాయిని పంపించారు.

కాంగ్రెస్ కుట్రలు మానుకోవాలి

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలను మానుకోవాలని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వరంగల్ చౌరస్తాలో భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం తెలంగాణ ప్రజల కలల ప్రాజెక్టు అని, విచారణ పేరుతో దీన్ని సీబీఐకి అప్పగించడం తెలంగాణ గౌరవాన్ని తాకట్టు పెట్టడమే అని విమర్శించారు. కేసీఆర్ నిర్మించిన ఈ ప్రాజెక్టు వల్ల లక్షల ఎకరాలు సస్యశ్యామలం అయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మరుపల్ల రవి, దిడ్డి కుమారస్వామి, బీఆర్ఎస్ నాయకులు దాచెపల్లి సీతారాం, చిమ్మని సంతోష్ కుమార్, మోడెం ప్రవీణ్‌కుమార్, చిలువేరు పవన్‌కుమార్, తాళ్ల ఉమాదేవి, దండు దయాసాగర్, రామా బాబురావు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కురవిలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ కవిత

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7555	5300
మక్కలు	1700	1521
కందులు	5929	3022
పెసళ్లు	5622	3022
పల్లికాయ (సూక)	6610	3500
పల్లికాయ (పచ్చిది)	4480	2400
పసుపు (కాడి)	10889	7889
పసుపు (గోల)	10669	8996
తేజ మిర్చి	12500	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	12000	12000
యూఎస్341ఏసీ	15000	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం



బాధ్యత లేకుండా బంధాల్లోకి..

- జీవితంలో స్థిరపడకముందే యువత పెళ్లి బాట
- ప్రేమ విఫలమయ్యాక బలవన్మరణాలు
- కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్న వైనం
- ప్రేమ పెళ్లిళ్లు ఎక్కువయ్యాయంటున్న పోలీసులు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో స్థిరపడకముందే యువత ప్రేమ పేరుతో ఒక్కటవుతున్నారు. తల్లిదండ్రులకు తెలియకుండా పెళ్లి చేసుకుంటున్నారు. కొద్ది రోజులకు విభేదాలు వచ్చాక కన్నవారికి ముఖం చూపించలేక ఆత్మహత్య చేసుకుని తల్లితండ్రులకు కడుపుకోత మిగులుస్తున్నారు. పిల్లలను ప్రయోజకులను చేయాలని రాత్రింబవళ్లు తల్లిదండ్రులు కష్టపడుతూ ఎంత ఖర్చయినా లెక్క చేయకుండా పేరున్న విద్యాసంస్థలో చదివిస్తున్నా.. అప్పు తెచ్చి మరీ ఖరీదైన సెల్‌ఫోన్‌లు, దుస్తులు, మోటర్ సైకిళ్లు కొనిస్తున్నా.. కన్నవారి కష్టం వారికి తెలియడం లేదు. కన్నవారి కలలను మధ్యలోనే చెరిపేసి చదువు పూర్తి కాకముందే ప్రేమ పేరుతో రహస్యంగా పెళ్లిచేసుకుంటున్నారు. అయినా బిడ్డల భవిష్యత్ ఆగం కాకుండా ఉండేందుకు కన్నవారు పడరాని పాట్లుపడుతూ ఠాణాల చుట్టూ నిందితుల్లాగా తిరుగుతున్నారు. మేజర్లు కావడంతో వారి జీవితాలపై నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ వారికుందని పోలీసుల సైతం కౌన్సెలింగ్ చేసి వదిలిపెట్టడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు.

ప్రతీరోజు ఫిర్యాదు..

ప్రతీరోజు ఏదో ఒక పోలీస్‌స్టేషన్‌లో ప్రేమ పెళ్లిళ్లు, లేదా ఒక్కటైన తర్వాత మనస్పర్థలతో విడిపోయి పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడం పరిపాటిగా మారింది. తల్లిదండ్రులకు తెలియకుండా జీవితంపై ఎలాంటి అవగాహన ఏర్పడకుండానే రహస్యంగా వివాహం చేసుకొని రక్షణ కల్పించండంటూ పోలీసులను ఆశ్రయించేవారు కొందరైతే.. విడిపోయి పరస్పరం ఫిర్యాదు చేసుకొనేవారు మరి కొందరు ఉంటున్నారు. అందరూ ఒకేలా ఉండకపోయినా ఫిర్యాదుల్లో అధిక శాతం తెలిసీతెలియని వయసులో పెళ్లి చేసుకోవడం.. కొద్ది రోజులకు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడం సాధారణమైపోయింది. కొన్ని కొన్ని సందర్భాల్లో ఆర్థిక పరిస్థితి బాగా లేక, తమ పిల్లలను పోషించలేక, తల్లిదండ్రులకు ముఖం చూపించలేక తనువు చాలిస్తున్నారు.

ఉదాహరణకు కొన్ని...

- ఉన్నత చదువు చదవి ఇంగ్లీష్‌లో మంచి ప్రావీణ్యం ఉన్న ఓ యువతి ప్రేమ వివాహం చేసుకుంది. ఇంతలో యువతి సామాజిక వర్గం తనకు ఇష్టం లేదని యువకుడి తల్లి చెప్పడంతో యువతిని యువకుడు వదిలిపెట్టాడు. దీనిపై సెంట్రల్ జోన్‌లోని ఓ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.
- బీసీ సామాజికి వర్గానికి చెందిన యువతీయువకులు డిగ్రీ మధ్యలోనే ఇష్టపడి పెళ్లిచేసుకున్నారు. దీనిపై ఇరు వర్గాల తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో యువతి పోలీస్‌స్టేషన్‌లో నానా హంగామాచేసి తనకు ఆ యువకుడే కావాలని ప్రాణం పోయినంత పనిచేయడంతో పోలీసులే స్వయంగా మహిళ పోలీసులను ఇచ్చి ఆస్పత్రికి తరలించారు.

ఎర్రబారుతున్న పంటలు

- ఎడతెగని వానలతో పత్తిలో రాలుతున్న పూత, పిందె
- పెరుగుతున్న కలుపు మొక్కలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- సలహాలు పాటించాలి: వ్యవసాయ శాస్త్రవేత్త విజయభాస్కర్



చింతనెక్కొండ దూపతండా దగ్గర పత్తిలో నిలిచిన నీరు



దిక్కుతోచని స్థితిలో రైతు



దుగ్గొండి మండలం తిమ్మంపేటలో మునిగిన వరి పొలం

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వరుస వర్షాలు అన్నదాతలను ఆగం చేస్తున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలు ప్రధానంగా పత్తి పంటపై ప్రభావం చూపుతున్నాయి. పత్తి పంట ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. ఈ దశలో వరుసగా వర్షాలు కురుస్తుండడంతో పూత, పిందె రాలిపోతోంది. నేలలో నీరు నిల్వ ఉండడం వల్ల మొక్కలు ఎర్రబారుతున్నాయి. దాదాపు అన్ని పంటల పరిస్థితి ఇలాగే ఉంది. దీంతో పంట దిగుబడి తగ్గడమే కాకుండా కనీసం పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

ఈ ఖరీఫ్ సాగు చాలా ఖరీదైపోయింది. జూన్‌లో వర్షాలు కురిసినట్లే కురిసి ఆ తదుపరి కనిపించకుండా పోయాయి. కొన్ని పత్తి గింజలు మొలకెత్తగా మరి కొన్ని అలాగే ఉండిపోయాయి. దీంతో మళ్లీ రెండోసారి విత్తనాలు నాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు ఎరువుల కొరత ఏర్పడింది. ముఖ్యంగా యూరియా దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు చేలల్లో కలుపు పెరిగింది. ఫలితంగా పెట్టుబడి ఖర్చు రెండింతలైంది.

అధికారుల సలహాలు పాటించాలి..

రైతులు ఇలాంటి సమయంలో నష్టపోకుండా ఉండాలంటే వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు తీసుకోవాలని టీఆర్‌వీకె వరంగల్ కో ఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త విజయభాస్కర్ సూచించారు. 'ప్రస్తుతం పత్తిపంట పూత, పిందె దశలో ఉన్నది. ఈ దశలో తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2 గ్రాముల కార్బనిడ్జం, మోన్కోజెబ్ కలిగిన శిలీంధ్ర నాశినిని లీటరు నీటిలో కలిపి మొక్క మొదట్లో తడిచేటట్లు వారంలో రెండు మార్లు పిచికారి చేయాలి..' అని వివరించారు. మునిగిన పంటలో నీటిని తీసివేసిన తరువాత పంట కోలుకోవడానికి 19-19-19 లేదా యూరియా పది గ్రాములు కలుపుకుని వారంలో రెండు లేదా మూడు సార్లు పిచికారి చేయాలని, అదేవిధంగా ఎకరానికి 25 యూరియా, 15కిలోల పొటాష్ ఎరువులను పై పాటుగా 20 రోజుల నుంచి 40 రోజుల వయసులో మొక్కల మొదళ్లకు పది సెంటీమీటర్ల దూరంలో పాదులు తీసి ఎరువులు వేశాక మట్టితో కప్పాలని తెలిపారు.

'వరి పంటలో ముఖ్యంగా పాముపొడ తెగులు నివారణకు వాలిడామైసిన్ 2 మి.లీ. లీటరు నీటిలో కలిపి వారానికి రెండుసార్లు పిచికారి చేయాలి. కాండం కుళ్లు ఆశించిన పంటలో హెక్సాకొనాజోల్ 2 మి.లీ. ఒక లీటరు నీటికి లేదా కార్డనిజం ఒక గ్రాము ఒక లీటరు నీటిలో కలిపి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి. ముంపునకు గురైన వరి పొలాల్లో సల్ఫేడ్ దుష్ప్రభావాలను ఆశించడానికి అనుకూలమైన పరిస్థితులు కనబడుతున్నాయి. వరి పంటలో మొక్క వేర్లకు తగినంత గాలి తగిలేలా మురుగునీటిని తీసివేయాలి. పొలంలో సన్న నెర్రెలు వచ్చే వరకు ఆరబెట్టి మళ్లీ నీరు పెట్టాలి. ఇక మొక్కజొన్నలో కాండం కుళ్లు తెగులు గమనించాం. దీని నివారణకు 35 శాతం క్లోరిన్ కలిగిన బ్లీచింగ్ పౌడర్‌ను ఎకరానికి 4 కిలోల చొప్పున పొలంలో సాళ్ల వెంబడి వేసుకోవాలి. ముడత తెగులు ఆశించిన మొక్కల్లో మాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటిలో కలిపి మొక్కలపై పిచికారి చేయాలి..' అని రైతులకు సూచించారు.

7న చంద్ర గ్రహణం

- ఆదివారం నాడు 3.36 గంటల పాటు ప్రభావం
- మధ్యాహ్నమే ఆలయాల బంద్



వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాదిలో ఈ నెల 7న అతి పెద్ద చంద్రగ్రహణం సంభవించనుంది. ఆదివారం రాత్రి 9.56 గంటలకు గ్రహణం ప్రారంభమై అర్ధరాత్రి 1.32 గంటలకు ముగుస్తుంది. దాదాపు 3.36 గంటల పాటు గ్రహణం కొనసాగుతుంది. దీన్ని అతి పెద్ద గ్రహణంగా పేర్కొంటున్నారు. ఇండియాతో పాటు మొత్తం దాదాపు 14 దేశాల్లో ఈ చంద్రగ్రహణం సంభవిస్తుందని పండితులు చెబుతున్నారు. భాద్రపద మాసంలో గ్రహణం అనేది గతంలో ఎప్పుడూ రాలేదని, దీనివల్ల ప్రకృతి విపత్తులు సంభవించే అవకాశం ఉందని రాజరాజేశ్వరీదేవి దేవస్థానం ప్రధానార్చకుడు లక్ష్మణాచార్యులు తెలిపారు. ముఖ్యంగా కుంభ, మేష, వృశభ, మిథున రాశివారు కాస్త జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఆలయాలు మూసి వేయాలని, తిరిగి సోమవారం ఉదయం తెరిచి సంప్రోక్షణ చేసి పూజలు నిర్వహించిన అనంతరం ఉదయం 8 గంటలకు భక్తుల దర్శనానికి ఏర్పాట్లు కొనసాగించాలని అన్నారు. ప్రజలు ఆదివారం రాత్రి 8గంటల వరకే భోజ నాలు చేయాలని, తర్వాత ఎలాంటి ఆహారం గాని, తాగునీరు గాని తీసుకోకూడదని, మళ్లీ గ్రహణం అనంతరమే ఏదైనా తీసుకోవాలని సూచించారు.

జపం చేసిన తీర్థం తీసుకోవాలి..

కుంభ, మేష, వృశభ, మిథున ఈ నాలుగు రాశుల వారికి గ్రహణ ప్రభావం ఉన్నందున గ్రహణం అనంతరం వీరు 1.25 కిలోల మినుములు, 1.25 కిలోల బియ్యాన్ని బ్రాహ్మణులకు దానంగా ఇవ్వాలని, లేదంటే వాటిని నానబెట్టి ఆవుకు ఆహారంగా పెట్టాలని లక్ష్మణాచార్యులు సూచించారు. సోమవారం దేవాలయంలో జపం చేసిన తీర్థాన్ని ఈ నాలుగు రాశుల వారికి ఇస్తామని, వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సగం.. సగం..

- ఒకే గదిలో జీపీ కార్యాలయం.. తరగతి గది నిర్వహణ
- శిథిలావస్థకు చేరిన భవనం
- ఎమ్మెల్యే శంకుస్థాపన చేసినా ఫలితం శూన్యం
- దశాబ్ద కాలంగా ఇబ్బందిపడుతున్న విద్యార్థులు
- చెట్ల కిందే కొనసాగుతున్న విద్యాబోధన



గ్రామపంచాయతీ భవనం.. పాఠశాల,



తరగతి గది స్లాబ్ బిచ్చులు ఊడిన దృశ్యం



సగం తరగతి గదలోనే బోధిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అసలే శిథిలావస్థకు చేరుకున్న భవనం.. ఉన్నది ఒకటే గది.. అందులోనే జీపీ కార్యకలాపాలతో పాటు తరగతి గది నిర్వహణ.. బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్న విద్యార్థులు, సిబ్బంది.. ఇది ఆత్మకూరు మండలం లింగమడుపల్లి గ్రామంలో నెలకొన్న దుస్థితి. ఫలితంగా అటు విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇటు జీపీ సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. విద్య కోసం కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నామని పాలకులు చెబుతున్నా ఆచరణలో మాత్రం ఆ అభివృద్ధి కనిపించడం లేదనడానికి ఇదే నిదర్శనం. ఓ వైపు గది స్లాబ్ బిచ్చలు ఊడి పడుతుండడంతో ఉపాధ్యాయులు విద్యార్థులను చెట్ల కింద కూర్చోబెట్టి బోధిస్తున్నారు. దీంతో వర్షం కురుసినా... ఎండ తీవ్రంగా ఉన్నా పాఠశాలకు సెలవు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గతంలో పలువురు కలెక్టర్లు ఈ పాఠశాలను సందర్శించి అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం వెంటనే నిధులు కేటాయిస్తామని భరోసా ఇవ్వడం తప్ప ఇంతవరకు ఆచరణలో పెట్టలేదు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. దశాబ్ద కాలం గడిచినా ఈ పాఠశాల దుస్థితి మారడం లేదు. ఉన్న ఒక్క గదిలోనే గ్రామపంచాతీ పరికరాలు, పాఠశాలకు సంబంధించిన సామగ్రి ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పిల్లల చదువు సరిగా కొనసాగడం లేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి అదనపు తరగతి గదుల నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



చెట్ల కిందనే బోధిస్తున్న ఉపాధ్యాయులు

శంకుస్థాపన చేసినా ఫలితం శూన్యం..

పరకాల ఎమ్మెల్యేగా రేవూరి ప్రకాష్‌రెడ్డి గెలిచిన వెంటనే గ్రామ పంచాయతీ భవనానికి ఆగమేఘాల మీద శంకుస్థాపన చేశారు. కాని పనులు మొదలు పెట్టక ముందే నిధులు కాస్త ల్యాప్స్ అయ్యాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల ఆశలు ఆడియాశలయ్యాయి. మరోవైపు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సైతం ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో రాకుండా పోయాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పిల్లల భవిష్యత్ కోసం నిధులు కేటాయించాలని, వెంటనే తరగతి గదులను నిర్మాణం ప్రారంభించాలని కోరుతున్నారు.

కవిత వెంట నడిచేదెవరు!?

(5వ పేజీ తరువాయి)

ఎవరనేది చర్చనీయాంశంగా మారింది. ఓరుగల్లు నుంచి జాగృతి కార్యక్రమాలను పర్యవేక్షించే దాస్యం విజయ్‌భాస్కర్.. కవిత వెంట నడిచేందుకు సుముఖంగా లేనట్లుగా సమాచారం. ఇటీవలకాలంలో కవిత నిర్వహించిన చాలా కార్యక్రమాలకు విజయ్‌భాస్కర్ దూరంగానే ఉంటున్నారు. హైదరాబాద్‌లో కవిత ప్రెస్‌మీట్‌కు ఆయన హాజరుకాలేదు. అలాగే ఆయన సోదరుడు వినయ్‌భాస్కర్ బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా ఉండటంతోపాటు కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో విజయ్‌భాస్కర్ గులాబీ గూటిలోనే కొనసాగనున్నారని ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు.

ఇక భూపాలపల్లి జిల్లా నుంచి మాడ హరీష్‌రెడ్డి, మహబూబాబాద్ జిల్లా నుంచి ఎన్.శ్రీకాంత్‌గౌడ్, జాగృతి మహిళ రాష్ట్ర కన్వీనర్ మాధవీలత, ములుగు జిల్లా నుంచి రాము, వరంగల్ జిల్లా నుంచి యార బాలకృష్ణ, హనుమకొండ జిల్లా నుంచి పర్లపల్లి శ్రీశైలం, జనగామ జిల్లా నుంచి మురళి తదితరులు జాగృతికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే వీరిలో చాలామందికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న విజయ్‌భాస్కర్.. బీఆర్‌ఎస్‌లో కొనసాగడానికి మొగ్గు చూపటంతో మిగతా వారి పరిస్థితి ఏమిటనేది చర్చనీయాంశంగా మారింది. భూపాలపల్లికి చెందిన మాడ హరీష్‌రెడ్డి తాను జాగృతిలోనే కొనసాగుతానని సోషల్ మీడియాలో ప్రకటించుకున్నారు. మిగతా నేతలు కవిత ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అని వేచి చూస్తున్నారని సమాచారం.

కవిత సొంత పార్టీ పెడుతుందా? లేక ఇతర పార్టీలో చేరుతుందా? అనే ఉత్కంఠ జాగృతి కార్యకర్తల్లో ఉంది. సొంత పార్టీ పెడితే ఏం చేయాలి..? వేరే పార్టీలో చేరితే ఏం చేయాలనేది కవిత తీసుకునే నిర్ణయంపై తాము అడుగులు వేస్తామని కవిత జాగృతి నేతలు పేర్కొంటున్నారు. గతంలో మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మహబూబాబాద్ మాజీ ఎంపీ కవితలు ఎమ్మెల్సీ కవిత వెంట అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయితే కవిత బీఆర్‌ఎస్‌పై చేసిన ఆరోపణలపై మంగళవారం హైదరాబాద్‌లో సత్యవతిరాథోడ్ కౌంటర్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. బీఆర్‌ఎస్ కీలక మహిళ నేతలు ఎవరూ కూడా కవిత వెంట వెళ్లే అవకాశం లేదని గులాబీ శ్రేణులు పేర్కొంటున్నాయి.

ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల్లో ఎవరికీ కవితతో పెద్దగా సత్సంబంధాలు లేవు. పార్టీలో చెప్పుకో తగిన నేతలు కూడా కవితతో టచ్‌లో ఉన్నట్లుగా సమాచారం కూడా లేదు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఎమ్మెల్సీ కవిత వెంట నడిచేవారు పెద్దగా ఎవరూ లేరనే చర్చ జరుగుతోంది. అలాగే కవిత సింగరేణిలో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్)కు గౌవర అధ్యక్షురాలిగా కొనసాగారు. ఇటీవల పార్టీలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా కవితను గౌరవ అధ్యక్షురాలి పదవి నుంచి తొలగించి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు అప్పగించారు. అయితే దీంతో కవిత వర్గం వారు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కవిత సింగరేణిలో హెచ్‌ఎంఎస్‌కు గౌరవ అధ్యక్షురాలిగా నియామకం అయ్యారు. అయితే కవితతో పాటు టీబీజీకేఎస్ నుంచి పెద్దగా హెచ్‌ఎంఎస్‌లోకి కేడర్ వెళ్లలేదని టీబీజీకేఎస్ నేతలు పేర్కొంటున్నారు. మొత్తంగా కల్వకుంట్ల కవితతో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి బీఆర్‌ఎస్ నేతలు, అనుబంధ సంఘాల నేతలు బయటకు వెళ్లే అవకాశాలు లేవనే చర్చ జరుగుతోంది.

పోలీసులను చూసి.. గంజాయిని దాచి..

- వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ 3.81 కోట్లు



పాఖాల సమీప అడవుల్లో లభ్యమైన గంజాయి బ్యాగ్‌లు

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): పోలీసుల నుంచి తప్పించుకునేందుకు అడవిలోని గుట్టపై గంజాయి నిల్వ చేసి.. అదును చూసి సరుకును తరలించడానికి ప్రయత్నిస్తుండగా పక్కా సమాచారంతో కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ టీం, ఖానాపురం పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. ఈ క్రమంలోరూ. 3.81 కోట్ల విలువ చేసే 763 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆపై నలుగురి అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషన్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అందాల పాండురెడ్డి, ఒడిస్సా రాష్ట్రం మల్కానగిరి జిల్లాకు చెందిన గుల్లారి మునిరాజ్, కొప్పు కోటయ్య, సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలానికి చెందిన భూక్య సాయికుమార్‌లు వ్యవసాయం, కూలీ పనిచేసేవారు. తద్వారా వచ్చే డబ్బులు కుటుంబపోషణకు సరిపోకపోవడంతో డబ్బులు ఎక్కువగా సంపాదించే మార్గాన్ని ఎంచుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో గంజాయి విక్రయించే గిల్లమడుగుకు చెందిన మజ్జి కృష్ణ, రమేశ్ పరిచయమయ్యారు. వాహనంలో గంజాయి లోడ్‌చేస్తే పెద్ద మొత్తంలో డబ్బులు ఇస్తామని చెప్పడంతో కోటయ్య, పాండురెడ్డి, మునిరాజ్‌లు ఒప్పుకొని గంజాయి లోడ్‌చేసే వారు. లోడ్ చేసినందుకు ఒక్కొక్కరికి రూ.10,000 ఇచ్చేవారు. ఈ క్రమంలోనే గుర్రాల గ్రామానికి చెందిన రమేశ్ అక్కడే పండించే గంజాయిని కొనుగోలు చేసి కూలీల ద్వారా కలిమెల ప్రాంతం నుంచి ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని మెయిన్ రోడ్డుకు తరలించేవారు.

ఈ క్రమంలో ఆగస్టు 28న రమేశ్ అనే వ్యక్తి గంజాయి లోడ్ చేసేది ఉందని పాండు, మునిరాజ్, కోటయ్యలను పిలిచి గంజాయిని సూర్యాపేటలోని సాయికుమార్‌కు అప్పగించాలని చెప్పాడు. నెంబర్ ప్లేటులేని ట్రాలీ ఆటోలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం, ఇల్లందు, మహబూబాబాద్ జిల్లా గంగారం మీదుగా వరంగల్ వైపు తరలిస్తున్నారు. ఈ క్రమంలో పాఖాల సమీపంలో పోలీసులు వాహనా లు తనిఖీలు చేస్తుండగా గమనించారు. వెంటనే 5 కిలోమీటర్ల వెనుకకు వచ్చి అడవిలోని ఓ గుట్టపై గంజాయి దాచి దానిపై కవర్ కప్పి వచ్చిన ట్రాలీ లోనే వెనక్కి వెళ్లారు. ఆపై ఈ నెల 1న గంజాయి తీసుకువెళ్లేందుకు సాయికుమార్ వస్తున్నాడని సమాచారం ఇవ్వడంతో గంజాయి దాచిన ప్రాం తాన్ని చూపించేందుకు మునిరాజ్, కోటయ్య, అందాల పాండురెడ్డి పల్సర్ బైకుపై గుట్ట వద్దకు వచ్చారు. రోడ్డుపై సిద్ధం చేసుకున్న సాయికుమార్‌కు చెందిన ట్రాలీలో గుట్టపై ఉన్న గంజాయి బ్యాగ్‌లను లోడ్ చేసేందుకు సిద్ధపడుతుండగా పక్కా సమాచారంతో ఖానాపురం, కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ టీమ్ పోలీసులు దాడి చేశారు. గుట్టపై నుంచి 23 ఎండు గంజాయి బ్యాగులను స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కాగా, గంజాయి స్మగ్లర్లను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందిని సీపీ సన్‌ప్రీత్‌సింగ్ అభినందించారు. ఈ సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, ఏసీపీలు జితేందర్, రవీందర్‌రెడ్డి, డ్రగ్ కంట్రోల్ టీం అధికారులు సతీష్‌కుమార్, శివకేశవులు, ఆర్ఎస్సైలు పూర్ణచందర్, మనోజ్, నాగరాజు, ఖానాపురం ఎస్సై రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

అలా వచ్చి.. ఇలా..

విధి నిర్వహణలో కార్డియాలజీ డాక్టర్ నిర్లక్ష్యం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కళాశాల అనుబంధ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని కార్డియాలజీ విభాగంలో ఓ వైద్యురాలి నిర్లక్ష్యం రోగులకు శాపంగా మారింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండాల్సిన వైద్యురాలు.. కేవలం గంట మాత్రమే విధుల్లో ఉండి వెళ్లడాన్ని మంగళవారం వీడియోలో బంధించారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కార్డియాలజీ రెగ్యులర్ వైద్యురాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోగులకు సేవలు అందించాల్సి ఉండగా, కొన్ని నెలలుగా అందుబాటులో ఉండటం లేదని తెలుస్తోంది. ఎంజీఎంలో కార్డియాలజీ రోగులు ఎమర్జెన్సీకి వస్తే అక్కడ కూడా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కొద్ది రోజులుగా రోగులను ప్రయివేట్ ఆస్పత్రికి తరలిస్తున్నట్లు సమాచారం. ఇక్కడ పని చేసే టెక్నీషియన్లు సదరు వైద్యురాలికి సహకరిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా డీఎంఈ, ఎంజీఎం సూపరింటెండెంట్, జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సల్ల చెరువును సందర్శించిన ఏసీపీ

మడికొండ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మడికొండలోని సల్ల చెరువును మంగళవారం కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి సందర్శించారు. గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకొని చెరువు వద్ద చేపట్టాల్సిన పనులను పరిశీలించారు. పోలీస్, రెవెన్యూ, మునిసిపల్, ఇరిగేషన్ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిమజ్జనం ప్రదేశంలో లైటింగ్, బారికేడ్లు, క్రేన్, సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ కంట్రోల్, గజ ఈతగాళ్ల ఏర్పాటు తదితర అంశాల పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, ఎస్సైలు రాజ్‌కుమార్, రాంమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.


గణేష్ నిమజ్జనానికి సూచనలు చేస్తున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

పచ్చదనానికి భాగస్వామ్యం అవసరం

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం పెంచడానికి నగర పౌరుల భాగస్వామ్యం అవసరమని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం మునిసిపల్ హార్టికల్చర్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం మొక్కలతో భవిష్యత్తు అనే అంశంపై వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. కేర్ అండ్ క్యూర్ వారి సౌజన్యంతో వరంగల్ నగరంలోని విశాల ప్రదేశాల్లో మొక్కలు నాటే ప్రక్రియకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో పలాస రమేష్, హెచ్‌వో లక్ష్మారెడ్డి, క్యూర్ అండ్ కూర్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య వెలదండి రవితో పాటు హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సభ్యత్వ నమోదు ప్రారంభం


సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రాంతి రమేష్

వడ్డెపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ఉమ్మడి వరంగల్ జిల్లా మున్నూరుకాపు సంఘం భవనంలో మంగళవారం మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం రావు పిలుపు మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రాంతి రమేష్ తదితరులు మున్నూరు కాపు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్నూరు కాపులు స్వయం కృషితో అన్ని రంగాల్లో రాణించాలని పిలుపు నిచ్చారు. మున్నూరుకాపు సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల రవికుమార్, ప్రధాన కార్యదర్శి పేరాల శ్రీధర్, జిల్లా నాయకులు మందోటి మహేందర్ పటేల్, పోతు కుమారస్వామి, మల్లికార్జున్ రావుపటేల్, వేణు పటేల్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమ స్థలాన్ని సందర్శించిన రెడ్‌క్రాస్ సొసైటీ

కాజీపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సొసైటీ, జిల్లా సంక్షేమ అధికారి సంయుక్త ఆధ్వర్యంలో కాజీపేట సోమిడిలో నిర్మించనున్న వృద్ధాశ్రమానికి సంబంధించిన 20 గుంటల స్థలాన్ని మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ విజయచందర్, రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈవీ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ బావుసింగ్‌లు సందర్శించారు. స్థల హద్దులు నిర్ణయించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యులు మాట్లాడారు. వృద్ధాశ్రమ అవసరాల దృష్ట్యా స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక చొరవతో స్థలాన్ని మంజూరు చేయించారన్నారు. త్వరలోనే వృద్ధాశ్రమాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. స్థలాన్ని పరిశీలించిన వారిలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, బిళ్ల రమణారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, డీసీపీవో ఎస్. ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేసి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న అభిమానులు

మడికొండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మడికొండ చౌరస్తా వద్ద పవన్ కల్యాణ్ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లపు మధు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. సాయంత్రం టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో అభిమాన కాజీపేట మండల అధ్యక్షుడు దాసరి వీరేష్, బోళ్ళ శివకుమార్, కొట్టె కిరణ్, జానపట్ల రామ్-లక్ష్మణ్, ప్రశాంత్, భరత్, బాచి, ఎలిషాల మహేష్, మూల నాగరాజు, పల్లపు రాజేష్, లక్క క్రిష్ణ, ఆకుల శరత్, దోచి తదితరులు పాల్గొన్నారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించొద్దు..

వడ్డెపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనడం రాజ్యాంగ విరుద్ధమని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వాంకుడోత్ వీరన్న అన్నారు. మంగళవారం హనుమకొండలోని గిరిజన సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పల్లకొండ శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు, అసెంబ్లీ గత ఎన్నికల సందర్భంగా మాజీ ఎంపీ సోయం బాబురావు ఢిల్లీలో లంబాడీలకు వ్యతిరేకంగా సభను నిర్వహించి రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఉన్న సోయం బాబురావు భద్రాచలం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్‌తో కలిసి లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని దుర్మార్గమైన ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు రమేష్, సిద్ధూ, లాలూ, వీరన్న పాల్గొన్నారు.

వైద్యాధికారులు సమయపాలన పాటించాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైద్యాధికారులు సమయపాలన పాటించాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య సూచించారు. ఆశాడే సందర్భంగా ఏకకాలంలో అందరూ ప్రోగ్రామ్ అధికారులు పీహెచ్‌సీలను సందర్శించి సమీక్ష నిర్వహించాలనే ఉద్దేశంతో తనతోపాటు ప్రోగ్రామ్ అధికారులు సమీక్ష నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. డెంగ్యీ పాజిటివ్ కేసులు, ఫీవర్ సర్వే, నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు, ముక్త్ భారత్ అభియాన్‌లో బాగంగా నిర్వహిస్తున్న స్ర్కీనింగ్, పరీక్షలు, ఎక్స్‌రే పరీక్షల నిర్వహణపై సమీక్షించినట్లు పేర్కొన్నారు. వైద్యాధికారులు సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య సూచించారు.

ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శిగా రెబెకా

మడికొండ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాజీపేట మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) కార్యదర్శిగా మడికొండ జడ్పీహెచ్‌ఎస్ పీడీ పోగుల రెబెకా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల విద్యాశాఖాధికారి బండారు మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. గత కార్యదర్శి కడిపికొండ జడ్పీహెచ్ఎస్ పీడీ కె.సదానందం ఉద్యోగ విరమణ పొందిన నేపథ్యంలో మంగళవారం కడిపికొండలో వివిధ పాఠశాలకు చెందిన పీడీలు రెబెకాను ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా ఎన్నుకున్నారని తెలిపారు. ఈసందర్భంగా రెబెకాను ఉపాధ్యాయులు అభినందించారు.

మెపా యూత్ జిల్లా అధ్యక్షుడిగా సాగర్

వడ్డెపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) అనుబంధ యూత్ జిల్లా నూతన కార్యవర్గానికి మంగళవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యాలయంలో ఎన్నికలను మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగాయి. హనుమకొండ జిల్లా యూత్ అధ్యక్షుడిగా గోనెల సాగర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా గోనెల దేవేందర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా పిట్టల దినేష్, బాలబోయిన సంతోష్, ఆర్థిక కార్యదర్శిగా గోనెల సాయిరాజ్‌లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా నర్ర శివాజీ, నర్ర సుధాకర్, గోనెల విక్రమ్, నూరి ముదిరాజ్‌లను ఎన్నుకున్నారు.

వినాయక మండపాలలో భక్తుల సందడి

- అన్నదానాలు- గణపతి హోమాలు
- విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు


లోటస్ కాలనీలో గణపతికి 61 రకాల నైవేద్యాలను సమర్పించిన భక్తులు


కనకదుర్గా కాలనీ కమ్యూనిటీ హాల్‌లో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

వడ్డెపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని వివిధ డివిజన్లలో గణపతి నవరాత్రోత్సవాలు ఏడో రోజు మంగళవారం భక్తి ప్రపత్తులతో భక్తులు నిర్వహించుకుంటున్నారు. మండపాల వద్ద అన్నదానాలు, గణపతి పూజలు భజన కీర్తనలతో గణపతి మండపాలు భక్తులతో సందడిగా నెలకొన్నాయి. హనుమకొండ 57వ డివిజన్ గాంధీ నగర్‌లో గణపతి హోమం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన వితరణ గావించారు. డివిజన్‌లోని కుడా కాలనీలోని వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. 56వ డివిజన్ గోపాల్‌పూర్ జవహర్‌కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లోని మండపం వద్ద ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, జవహర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బైరి సోమయ్య,


వేయిస్తంభాల గుడిలో అన్నదానం చేస్తున్న దృశ్యం

బీజేపీ శ్రేణులు ప్రత్యేక పూజలు చేశారు.59వ డివిజన్ కనకదుర్గాకాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో నవరాత్రి ఉత్సవాలను నేత్రపర్వంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం కమ్యూనిటీ హాల్‌లోని వినాయక మండపం వద్ద గణపతి హోమంతోపాటు అన్నప్రసాద వితరణ గావించారు.

● న్యూశాయంపేట: హనుమకొండ హంటర్‌రోడ్‌లోని నందిహిల్స్‌కాలనీలో స్వామివారికి మంగళవారం సాయంత్రం కాలనీ భక్తులు 108 రకాల ప్రసాదాలను నైవేద్యంగా నివేదన చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. న్యూశాయంపేటలోని లక్ష్మీ గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మహిళలు కుంకుమ పూజ చేశారు. న్యూశాయంపేటలోని గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద గౌరీ కుంకుమ అర్చనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● రెడ్డి కాలనీ : రెడ్డికాలనీ ప్రాంతంలోని లోటస్ కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటున్నారు. మంగళవారం కాలనీలోని మహిళలు 61 రకాల నైవేద్యాలను గణపతికి సమర్పించి భక్తి ప్రపత్తులతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల కోలాటాలతో గణపతి మండపం మార్మోగింది.

● హనుమకొండ కల్చరల్: హనుమకొండలోని ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయంలో మంగళవారం ఆలయంలోని కాకతీయుల కాలంనాటి మూల గణపతిని శ్వేతార్క మూలగణపతిగా అలంకరింపజేసి భక్తుల దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం మహాన్నదాన కార్యక్రమం భక్తుల విశేష ఆదరణ పొందుతోంది. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఈవో అనిల్‌కుమార్‌తోపాటు రుద్రేశ్వర సేవా సమితి సభ్యులు వందలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. మంగళవారం టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కో ఆర్డినేటర్ రామిరెడ్డి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

● కాజీపేట: కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో మంగళవారం లక్ష గరికలతో ప్రత్యేక పూజలు చేశారు. మహేశ్ శర్మ, ఐనవోలు రాధకృష్ణ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా గరికలతో అర్చన చేశారు. పూజ అనంతరం అన్నపూర్ణ భవన్‌లో అన్నదానం చేశారు. ఈ ప్రత్యేక పూజల్లో ఆలయ సిబ్బంది, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య

వడ్డెపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బొడ్డు దయాకర్ మాదిగ ఆధ్వర్యంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. వరంగల్ నిట్ ఉద్యోగులతో పాటు ఇతర శాఖల్లో పనిచేస్తున్న ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు.


బక్కి వెంకటయ్యకు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎంఈఎఫ్ జిల్లా నేతలు

వినతి పత్రం సమర్పించిన వారిలో ఎంఈఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద రాజు మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాస్‌మాదిగ, జిల్లా నాయకులు కరుణాకర్, కార్తీక్, ప్రమోద్ మాదిగ ఉన్నారు.

నీటి కుక్కను పట్టుకునేందుకు యత్నాలు

రంగంలోకి దిగిన వన్యప్రాణి సిబ్బంది

హనుమకొండ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ న్యూశాయంపేట శివారులోని చెరువు వద్ద కొద్దిరోజులుగా తచ్చాడుతున్న నీటి కుక్కలను (ఓటర్) పట్టుకునేందుకు వన్యప్రాణి సంరక్షణ బృందం రంగంలోకి దిగింది. వరంగల్ జూ పార్క్ పూర్వ వణ్యప్రాణి డాక్టర్ ప్రవీణ్, ప్రస్తుత డాక్టర్ కార్తికేయ, రేంజర్ మయూరితో నేతృత్వంలో రెస్క్యూ టీం మంగళవారం ఉదయం నీటి కుక్కలు ఉన్న ప్రాంతానికి వెళ్లి పరిసరాలను పరిశీలించాయి. చెరువు సమీపంలో బోన్లను కూడా ఏర్పాటు చేశారు. ఒకటి రెండు రోజుల్లో వీటిని పట్టుకుంటామని డాక్టర్ ప్రవీణ్ తెలిపారు.


న్యూశాయంపేట చెరువు పరిసరాలను పరిశీలిస్తున్న రెస్క్యూ టీం

రెస్క్యూ బృందంలో జూపార్క్ కాంపౌండర్ సాంబరాజు, సిబ్బంది శంకర్, క్రిష్ణ, స్వామి, కొమురయ్య, స్వామీ తదితరులు ఉన్నారు.

ప్రజా రవాణాకు ఇబ్బందులు లేకుండా చూడాలి..

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- ములుగురోడ్ జంక్షన్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) ప్రజా రవాణాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రంగం చర్యలు తీసుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. కొంతకాలంగా కురుస్తున్న వర్షాల కారణంగా ములుగు రోడ్ జంక్షన్‌లో పాక్షికంగా దెబ్బతిని, గుంతలు మయంగా మారిన ప్రధాన రోడ్డును ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మంగళవారం పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. తక్షణమే రోడ్డు మరమ్మతులతో పాటు శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిత్యం జనం సమూహంతో పాటు వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనాలతో రద్దీగా ఉండే ములుగురోడ్డు జంక్షన్.. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్డు దెబ్బతినడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీంతో వెంటనే అక్కడి చేరుకొని సంబంధిత అధికారులతో చర్చించి మరమ్మతు పనులు చేపట్టాలని చెప్పానన్నారు. అదే విధంగా ములుగురోడ్ జంక్షన్ రోడ్డు విస్తరణ, సీసీ రోడ్ల ఏర్పాట్ల అంశాలను అధికారులతో చర్చించామన్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరింత కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్‌రావు, టీపీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ దేవరకొండ విజయ సురేందర్, మాజీ కార్పొరేటర్ అబుబక్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అంబేద్కర్ రాజు, నాయకులు మాడిశెట్టి రాజు, కమల్, వరుణ్, రాకేష్, అనిల్, రెడ్ క్రాస్ సభ్యులు సంగీత్, జీడబ్ల్యూఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ములుగురోడ్ జంక్షన్‌ను సందర్శించి సంబంధిత అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కేయూలో పేపర్‌వైజ్ నోటిఫికేషన్లు విడుదల చేయాలి

కేయూక్యాంపస్ సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో అన్ని విభాగాల్లో వర్క్‌లోడ్‌ను అనుసరించి పేపర్‌వైజ్ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని కేయూ స్కాలర్ల సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను తన చాంబర్‌లో కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా స్కాలర్ మట్టెడ కుమార్ మాట్లాడుతూ. కేయూ వ్యాయామ విద్యా కళాశాలలో థియరీ, ప్రాక్టికల్స్ విద్యను బోధించేందుకు ఎంపీఈడీ అభ్యర్థులతో పాటు పీహెచ్‌డీ స్కాలర్లకు అనుమతి కల్పించాలని డిమాండ్ చేశారు. వర్సిటీ పరిధిలో ఇతర విభాగాల్లో పీహెచ్‌డీ స్కాలర్లను బోధనకు అనుమతి కల్పించాలని అన్నారు. 2025-26 ఏడాది పేపర్‌వైజ్ నోటిఫికేషన్ విడుదల చేసి రిక్రూట్‌మెంట్ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లూరి సాయి, గూడెం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కూల్చి, స్థలాన్ని ఆక్రమించిన వారిపై కేసు నమోదు

వరంగల్ సిటీ, సెప్టెంబరు 2 : (ఆంధ్రజ్యోతి): నగరం లోని ఏనుమాముల కోటిలింగాల గుడి ఎదురుగా గల తన భూమిలో నిర్మించుకున్న ఇంటిని కొందరు వ్యక్తులు కూల్చివేయడంతో పాటు ఆ స్థలాన్ని ఆక్రమించారని సుం కరి వేణుగోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏనుమాముల పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి... కాజీపేటకు చెందిన వేణుగోపాల్ కోటి లింగాల గుడి ఎదురుగా సర్వే నెంబర్ 170లో ప్లాటు నెం. 4/ఏ, 4/బి లో 300 గజాల స్థలాన్ని 2008లో కొనుగోలు చేశారు. ఎల్ఆర్ఎస్ కట్టి, కార్పొరేషన్ నుంచి నెంబర్ తీసుకుని ఇల్లు నిర్మించి ఇంటి పన్ను కూడా చెల్లి స్తున్నారు. ఈ క్రమంలో సోల రవి, గాదె సుదర్శన్ రావు, కొండా రాజేశం, అయిలేని రాంరెడ్డి, దయ్యాల ప్రభాకర్, ఇనుముల నాగరాజు తదితరులు రాత్రి వేళలో వేణుగోపా ల్ నిర్మించుకున్న ఇంటిని కూల్చి వేసి ఇంటిలో ఉన్న సా మాన్లు, ఇంటి గేటును ఎత్తు కెళ్లిపోయారు. ఈ ఘటనకు సంబంధించి రవి అతని అనుచరులపై వేణుగోపాల్ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

9వ డివిజన్‌లో డెంగీ కలకలం

పరిశీలించిన వైద్యాధికారి, సిబ్బంది

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా కురుస్తున్న వర్షాలకు తోడు వరద, మురుగు రోడ్లపై నిలిచిపోవడంతో తీవ్ర దుర్గంధం కారణంగా ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఈ క్రమంలో పలు కాలనీల్లో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. హనుమకొండ 9వ డివిజన్ ఓంసాయికాలనీలోని రెండు నెలల చిన్నారికి డెంగీ వ్యాధి సోకింది. దీంతో డీఎంహెచ్‌వో అప్పయ్య అదేశాల మేరకు బుధవారం యూపీహెచ్‌సీ పోచమ్మకుంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.దీప్తి, జీడబ్ల్యూఎంసీ మలేరియా సిబ్బంది చిన్నారి నివాసానికి చేరుకున్నారు. చిన్నారి ఇంటితోపాటు సమీపంలోని పలు నివాసాల్లో మలేరియా సిబ్బంది దోమల నివారణ కోసం పైరిత్రిన్ ద్రావణాన్ని పిచికారి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దీప్తి మాట్లాడుతూ.. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఈగలు, దోమలు దరిచేరకుండా ఉంటాయన్నారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా నోడల్ పర్సన్ డి. శ్రీనివాస్, అశావర్కర్లు తరట్లపెల్లి ప్రవళిక, బత్తుల నర్మదా రాసమల్ల మంజుల, మలేరియా సిబ్బంది సుధాకర్, దేవేందర్, సాంబయ్య, స్థానికులు గుండ సుధాకర్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్న మలేరియా సిబ్బంది

టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ


న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్‌పాలకవర్గం

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సొసైటీ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో సుబేదారిలోని రెడ్‌క్రాస్‌లో మంగళవారం 30మంది టీబీ(క్షయ)వ్యాధిగ్రస్తులకు రెడ్‌క్రాస్‌పాలకవర్గం చేతుల మీదుగా న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్ చందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా టీబీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశామన్నారు. జూలై నుంచి ఆరు నెలల వరకు ప్రతీ నెల 30 మందికి న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్‌రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, బిల్లా రమణారెడ్డి, జిల్లా టీబీ (క్షయ) నివారణ అధికారి కె.హిమబిందు, రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ జె.కిషన్‌రావు, టి.మధుసూదన్‌రావు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



వానల్లో మొక్కల సంరక్షణ..

మనం సాధారణంగా బాల్కనీలో, ఇంటి పరిసరాల్లో మొక్కల కుండీలను ఏర్పాటు చేసుకుంటూ ఉంటాం. వర్షాకాలంలో ఈ మొక్కలు బాగా పెరుగుతాయి. కానీ ఒక్కోసారి ఆకులు పసుపు రంగులోకి మారడం, కాండానికి ఫంగస్ రావడం, వేళ్లు కుళ్లిపోయి మొక్కలు వడలిపోవడం లాంటివి గమనిస్తూ ఉంటాం. అలాకాకుండా మొక్కలు ఆరోగ్యంగా పెరగాలంటే వర్షాకాలంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...

- నీళ్లు ఎక్కువగా అవసరంలేని మొక్కల కుండీలకు వర్షం తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వీటి మీద గ్రీన్ నెట్ అమర్చడం మంచిది.
- వర్షాకాలంలో కుండీలను ముప్పావు వంతుకు పైగా మట్టితో నింపాలి. దీనివల్ల వర్షపు నీరు ఎక్కువగా కుండీల్లో నిలవకుండా ఉంటుంది.
- కుండీల్లో మట్టి మరీ మెత్తగా ఉంటే అది ఎక్కువగా నీటిని పీల్చుకుంటుంది. దీనివల్ల వర్షాకాలంలో మొక్కలు త్వరగా పాడవుతాయి. అలాంటప్పుడు ఈ మెత్తని మట్టిలో కొద్దిగా ఇసుకను కలిపితే అదనపు నీరు త్వరగా బయటికి వెళుతుంది.
- కుండీ అడుగు భాగంలో ఉండే రంధ్రాలను గమనించాలి. కుండీలో చేరిన అదనపు నీరు బయటికి వస్తుందో లేదో పరిశీలించాలి. రంధ్రాల వద్ద వేళ్లు లేదా మట్టి చేరి నీళ్లు బయటికి పోకుండా అడ్డుపడుతుంటాయి. వీటిని ఎప్పటికప్పుడు సరిచేస్తూ ఉండాలి.
- వర్షాకాలంలో కుండీల కింద పళ్లాలు ఉంచకూడదు. అలా ఉంచితే మొక్కల వేళ్లు కుళ్లిపోయే అవకాశం ఉంటుంది. చిన్న కాళ్లు ఉన్న కుండీలను ఎంచుకోవడం మంచిది. అలా లేని పక్షంలో కుండీ కింద నాలుగు వైపులా చదునుగా ఉన్న రాళ్లు అమర్చాలి. అప్పుడు కుండీలో చేరే వర్షపు నీరు సులువుగా బయటికి వెళుతుంది.
- వర్షాకాలంలో గాలులు బలంగా వీస్తుంటాయి. వీటి ధాటికి కుండీల్లోని మొక్కలు వంగిపోవచ్చు. ఒక్కోసారి వేళ్లతో సహా ఒరిగిపోవచ్చు. అలాకాకుండా మొక్కలన్నింటికీ ఆధారంగా కర్రలను కుండీల్లో నిలబెట్టాలి.
- కాండానికి కింది భాగంలో ఉన్న ఆకులకు తేమ ఎక్కువగా తగులుతూ ఉంటుంది. దీనివల్ల మొక్కకు ఫంగస్ చేరవచ్చు. కాబట్టి కుండీలో మట్టికి దగ్గరగా ఉండే ఆకులను కత్తిరించడం మంచిది.

ప్రేరణ

ప్రపంచవ్యాప్తంగా సమాజ సేవ, స్నేహసంబంధాల కోసం కృషి చేస్తోన్న అంతర్జాతీయ మహిళా సంస్థ... 'ఇన్నర్ వీల్ క్లబ్' తాజాగా హైదరాబాద్‌లో మొట్టమొదటి ఇన్నర్ వీల్ ఛాంపియన్స్ క్రికెట్ లీగ్‌ను ఏర్పాటు చేసింది. ఈ మ్యాచ్‌లో 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు మహిళలు పాల్గొని, జీవితంలోని ఏ దశలోనైనా చురుగ్గా ఉండడం సాధ్యమేనని నిరూపించారు. ఆ విశేషాలు నవ్య పాఠకుల కోసం...

యాభైల్లో యువతుల్లా..





ఇన్నర్ వీల్... ప్రపంచంలోని అతి పెద్ద అంతర్జాతీయ స్వచ్ఛంద మహిళా సంస్థ. సమాజ సేవ, స్నేహ సంబంధాలను పెంపొందించడం లక్ష్యంగా 1924లో ఈ సంస్థను స్థాపించారు. రోటరీ ఇంటర్నేషనల్ సహకారంతో పని చేస్తున్న ఇన్నర్ వీల్... క్లబ్బులు, అసోసియేషన్ల ద్వారా నిధులను సమీకరిస్తూ, వెనుకబడిన వర్గాలకు, అనాథలకూ, మహిళలకూ సహాయపడుతూ ఉంటుంది. భారతదేశంలోని 27 ఇన్నర్ వీల్ జిల్లాలను నాలుగు జోన్లుగా విభజించుకుని, వాటిలోని సభ్యులైన 44 మంది మహిళలు ఒక జట్టుగా ఏర్పడి హైదరాబాద్ ఇన్నర్ వీల్ ఛాంపియన్స్ క్రికెట్ లీగ్‌లో పాల్గొన్నారు. క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొన్నారు కాబట్టి వీళ్లందరూ క్రికెట్ ప్లేయర్స్ అనుకుంటే పొరపాటు. స్నేహభావాన్ని చాటుకోవడంతో పాటు, నడివయసులో సైతం ఆరితేరిన క్రికెటర్ల మాదిరిగా చురుగ్గా ఉండగలుగుతామని నిరూపించడం కోసమే మహిళలు ఈ లీగ్‌లో పాల్గొనడం చెప్పుకోదగిన విశేషం.

యాభైల్లో కొత్త జీవితం మొదలవుతుంది

సమాజానికి సేవ చేయాలని కోరుకునే మహిళలు మనలో ఎంతోమంది ఉంటారు. అవసరంలో ఉన్న వారికి తమకు తోచిన సహాయాన్ని అందించాలని పరితపించే మహిళలూ ఉంటారు. ఇలాంటి మహిలందరికీ ఇన్నర్ వీల్ ఒకే వేదికగా ఉపయోగపడుతోంది. ఈ ఏడాది మేం గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను చేపట్టాం. ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశాం. ప్రజలకు ఈ సేవలన్నీ ఉచితమే! ఇన్నర్ వీల్ సభ్యుల్లో ఎక్కువ మంది పెళ్లైన మహిళలే! వీళ్లలో 45 నుంచి 60 ఏళ్ల వయసు మహిళలు ఈ క్రికెట్ లీగ్‌లో పాల్గొన్నారు. ఒక సంస్థలో భాగంగా సేవలు అందించాలనుకునే మహిళలు కేవలం సమాజానికే సేవలందిస్తూ అక్కడికే పరిమితమైపోకూడదు. నడివయసులో ఉన్నప్పటికీ శారీరకంగా దృఢంగా ఉన్నామని సాటి మహిళలకు నిరూపించగలగాలి. ఈ లక్ష్యంతో తాజా క్రికెట్ లీగ్‌ను ఏర్పాటు చేసి, దేశవ్యాప్తంగా దాదాపు 200 మంది మహిళలు హైదరాబాద్‌లో జరిగిన క్రికెట్ లీగ్‌లో పాల్గొన్నారు. కొచ్చి, పంజాబ్, కోల్‌కతా, ముంబయి.. ఇలా దేశంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి సొంత ఖర్చులతో వాళ్లందరూ హైదరాబాద్‌కు చేరుకున్నారు. నేను బెంగుళూరు నుంచి ఈ లీగ్‌లో పాల్గొన్నాను. నాకు 50 ఏళ్లు. కిర్లోస్కర్ హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నాను. అలాగే ఇన్నర్ వీల్ డిస్ట్రిక్ట్ 316కు డిస్ట్రిక్ట్ ఛైర్మన్‌గా కూడా పని చేస్తున్నాను. దక్షిణ జోన్ కొఆర్డినేటర్‌ను నేనే కాబట్టి ఈ లీగ్‌లో పాల్గొనే ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, కేరళ, తమిళనాడుల నుంచి మహిళలను నేనే ఎంపిక చేశాను. వాళ్లలో టీచర్లున్నారు, మహిళా వ్యాపారవేత్తలున్నారు. వీళ్లలో కొందరికి క్రికెట్ పూర్తిగా కొత్త. అయినప్పటికీ ఈ లీగ్‌లో పాల్గొనడం ద్వారా అమ్మమ్మల వయసులో సైతం చురుగ్గా ఉండొచ్చని నిరూపించగలిగారు.

- జయశ్రీ సాగర్,
ఇన్నర్ వీల్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్, బెంగుళూరు.

అపరిమిత సేవలే మా లక్ష్యం



ఈ క్రికెట్ లీగ్‌లో 27 జిల్లాలకు చెందిన ఇన్నర్ వీల్ మహిళలు పాల్గొన్నారు. వీళ్లందరూ స్నేహబంధాన్నీ, క్రీడాస్ఫూర్తినీ చాటుకోవడమే ప్రధానంగా ఈ లీగ్‌లో పాల్గొన్నారు. ఇక్కడ గెలుపోటములు ప్రధానం కాదు. ఇన్నర్ వీల్‌లోని మహిళా సభ్యులందరినీ చేరువ చేయడం, సాటి మహిళలకు ప్రేరణగా మారడమే ఈ క్రికెట్ లీగ్ లక్ష్యం. నిజానికి ఇన్నర్ వీల్‌లోని మహిళలందరూ సేవ ద్వారా పరస్పరం అనుబంధాన్ని పెంపొందించుకున్నవారే! మా ఉమ్మడి లక్ష్యం ఒకటే కాబట్టి అందరి మధ్యా దృఢమైన అనుబంధం ఉంటుంది. ఇన్నర్ వీల్ స్వచ్ఛంద సంస్థలాగే పని చేస్తుంది. కానీ ఇది స్వచ్ఛంద సంస్థ కాదు. 100కు పైగా దేశాలు ఇన్నర్‌వీల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. భారతదేశంలోనే 17 వేల ఇన్నర్ వీల్ క్లబ్బులున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 1.2 లక్షల మంది మహిళా సభ్యులు ప్రపంచవ్యాప్తంగా సమాజసేవలో పాల్గొంటున్నారు. ఈ సంస్థ తరఫున అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు, పాఠశాలలు, మహిళా సాధికారతల కోసం నిధులను సేకరిస్తూ ఉచిత సహాయసహకారాలు అందిస్తూ ఉంటాం. పాఠశాలలకు మౌలిక సదుపాయాల కల్పనలో సహాయపడడంతో పాటు, ఆరోగ్య శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తూ ఉంటాం. పాఠశాలల్లో, కాలేజీల్లో చెట్లు నాటే కార్యక్రమాలు చేపడుతూ ఉంటాం. ప్రతి ఏటా ఒక లక్ష విత్తన బంతులను పంపిణీ చేస్తూ, పర్యావరణానికి సహాయపడుతున్నాం. నిమ్స్ ఆస్పత్రిలో కీమో వార్డులో చికిత్స పొందే పిల్లలకు లైబ్రరీని ఏర్పాటు చేశాం. ఇటీవలే గాంధీ ఆస్పత్రి మెటర్నిటీ వార్డుకు స్ట్రెచర్స్, వీల్ ఛైర్స్, ఇంక్యుబేటర్స్‌ను అందించాం. ఇలా మేం అందించే సేవలకు ఒక పరిమితంటూ ఉండదు. ఎవరికి ఏ సహాయం అవసరమో గుర్తించి, ఆ అవసరాలను తీర్చడమే లక్ష్యంగా మేం ముందుకు వెళ్తూ ఉంటాం!

- స్వర్ణలత, డిస్ట్రిక్ట్ ఛైర్మన్, హైదరాబాద్.

వయసు... పరిమితి కాదు ప్రేరణ



ఇన్నర్ వీల్ అంతర్జాతీయ ప్రెసిడెంట్, ఆస్ట్రేలియాకు చెందిన **కే మోర్లాండ్**, హైదరాబాద్‌లో జరిగిన ఛాంపియన్స్ క్రికెట్ లీగ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... "భారత్ అద్భుతమైన దేశం. భారత్, ఆస్ట్రేలియా రెండూ క్రికెట్ ఆడతాయి. ఈ ఆటను అమితంగా ప్రేమిస్తాయి. అభిరుచి, ప్రతిభలకు లింగబేధం లేదని నిరూపిస్తూ, ఈ మహిళా క్రికెట్ జట్టు, ఆట నియమాలను తిరగరాస్తోంది. స్థానిక మైదానాల నుంచి ప్రపంచ స్టేడియంల వరకూ, మహిళా క్రికెటర్లు కొత్త తరాలకు స్ఫూర్తిగా మారుతూనే ఉన్నారు. వయసు ఒక పరిమితి కాదు, ఒక ప్రేరణ. జీవనశైలి వ్యాధులు పెరుగుతున్న ఈ యుగంలో, జీవితంలోని ఏ దశలోనైనా చురుగ్గా, సాహసోపేతంగా ఉండడం సాధ్యమేనని ఈ మహిళలు నిరూపించారు" అని ఆమె ప్రసంగించారు.

• గోగుమళ్ల కవిత

ఫ్యాషన్





వేడుకల్లో వెలిగిపోయేలా బంగారు, వెండి జరీ ధగధగలు, కలనేతల కళాకాంతులు సొంతం చేసుకోవాలనుకునే వారి కోసం పలు రకాల పట్టు చీరలు ఇప్పుడు మార్కెట్లో దొరుకుతున్నాయి. వాటిలో కొన్నిటి మీద ఓ లుక్కేద్దామా?


కళ్లు చెదిరే కాంతుల్లా...

- చామంతులు, కనకాంబరాలు కలిపి కట్టిన పూమాలలా కనిపించాలంటే పవిట చెంగు, కుచ్చిళ్లు ఒక రంగు లో, చీర మొత్తం మరో రంగులో ఉండాలి. అలాంటి కాంట్రాస్ట్ రంగుల్లోనే చీర భారీగా కనిపించి కనువిందు చేస్తుంది.
- తెల్ల పట్టుచీర హుందాతనమే వేరు. ప్రింటెడ్ డిజైన్ మోడర్న్ లుక్‌ని తెచ్చిపెడితే, కాంట్రాస్ట్ జరీ బార్డరు చీర మొత్తానికే వన్నె తెస్తుంది.
- వెండి వెలుగులు విరజిమ్మాలంటే వెండి జరీలో ధగధగలాడాలి. నలుగురిలో ప్రత్యేకంగా కనిపించాలనుకుంటే వెండి జరీ చీరను ఎంచుకుంటే సరి!
- కుచ్చిళ్ల దగ్గర జరీ బార్డరు మోకాళ్ల వరకూ ఉండడం తాజా ఫ్యాషన్! ఈ స్టయిల్ చీరకు వినూత్న ఆకర్షణను తెచ్చిపెడుతుంది. జరీ మీద కనిపించీ, కనిపించకుండా ఉండే సెల్ఫ్ డిజైన్ చీరకే వన్నె తెస్తుంది.





"పౌరుల్లో ప్రతి ఒక్కరికీ హక్కులు ఉంటాయి. ఖైదీలు దీనికి మినహాయింపు కాదు. కానీ వారి సమస్యలను ఎవరూ పట్టించుకోరు. వారి తరఫున మాట్లాడడానికి ఎవరూ ముందుకు రారు. ఈ పరిస్థితి మారాలి" అంటున్నారు **అపూర్వ వివేక్**. రాంచీకి చెందిన ఈ న్యాయవాది... మహిళా ఖైదీలను విద్యావంతులను చేయడానికి, న్యాయపరమైన సాయం అందించడానికి పాటుపడుతున్నారు. వారి హక్కుల పరిరక్షణ కోసం తన గళాన్ని గట్టిగా వినిపిస్తున్నారు.



మహిళా ఖైదీలకు అండ... హక్కుల సాధనే అజెండా!

"తెలిసినవారు ఎవరైనా ఎదురుపడినప్పుడు.. ఎక్కడికి వెళ్తున్నారని అడిగేవారు. "జైలుకు" అని చెబితే ఆశ్చర్యంగా చూసేవారు. ఇప్పుడు అందరికీ నేనేమిటో, నేను చేస్తున్న పని ఏమిటో తెలుసు. రోజూ ఎక్కువ సమయం నేను గడిపేది జైల్లోనే మరి" అని నవ్వుతూ చెబుతారు అపూర్వ వివేక్. మహిళా ఖైదీల సంక్షేమం కోసం 'హోషియా సోషియో-లీగల్ సెంటర్ ఫర్ విమెన్' (హెచ్‌ఎస్‌ఎస్‌సిడబ్ల్యూ) అనే సంస్థను ఆమె స్థాపించారు.

పాఠాలతో మొదలుపెట్టి...

2013లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్న అపూర్వ... ఖాళీ సమయాల్లో పిల్లలకు పాఠాలు చెప్పేవారు. అప్పుడే ఒక స్వచ్ఛంద సంస్థతో కలిసి పని చేయడం ప్రారంభించారు. జైలులో మహిళా ఖైదీల గురించి అధ్యయనం చేయడానికి ఇతర వాలంటీర్లతో కలిసి రాంచీలోని బిర్సాముండా సెంట్రల్ జైలుకు వెళ్లారు. అక్కడ ఖైదీల జీవన పరిస్థితులను చూసి చలించిపోయారు. ముఖ్యంగా మహిళా ఖైదీల దుస్థితి ఆమెను తీవ్రంగా ఆలోచింపజేసింది. "చాలామందికి చదువు లేకపోవడం వల్ల వారికి తమ హక్కులేమిటో తెలియదు. న్యాయవాదులు తెచ్చిన కాగితాల మీద గుడ్డిగా సంతకాలు పెట్టడం తప్పితే... వాటిలో ఏం రాసి ఉందో, అది తమకు ఉపయోగమో కాదో అవగాహన లేదు. అందుకే వారికి ప్రాథమిక విద్య నేర్పాలని నిర్ణయించుకున్నాను" అని గుర్తుచేసుకున్నారు అపూర్వ. మహిళా ఖైదీలతో పాటు వారి పిల్లలకు కూడా పాఠాలు చెప్పడానికి జైలు అధికారుల అనుమతి తీసుకున్నారు. "మొదట్లో నన్ను అందరూ అనుమానంగా చూసేవారు. వారి వ్యక్తిగత విషయాలు తెలుసుకోవడానికి అధికారుల తరఫున వచ్చానని భావించేవారు. క్రమంగా నా ఉద్దేశమేమిటో అర్థం చేసుకున్నారు. కనీసమైన చదువు లేనివారికి అక్షరాలు దిద్దించడం, కూడబలుక్కొని చదవగలిగేవారితో వార్తా పత్రికలు చదివించడంతో జైలులో నా తరగతులు ప్రారంభమయ్యాయి. క్రమంగా వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి కూడా తెలిశాయి" అని వివరించారు అపూర్వ.

పలు కారాగారాల్లో...

జైలులో గడుపుతున్నవారిలో ఎక్కువమంది విచారణ ఖైదీలు. న్యాయవాదులను నియమించుకొనే స్తోమత లేనివారు. కొందరి తరఫున ప్రభుత్వమే న్యాయవాదులను ఏర్పాటు చేసినా... కేసులు ఏళ్ల తరబడి సాగుతూనే ఉంటాయి. మహిళా ఖైదీల్లో గర్భిణులు కూడా ఉంటారు. వారికి సరైన వైద్య సహాయం కానీ, పోషకాహారం కానీ ఉండదు. వారికి జన్మించిన పిల్లలకు సరైన సంరక్షణ అందదు. ఈ సమస్యలకు తన వంతుగా ఏదైనా పరిష్కారం చూపాలని అపూర్వ అనుకున్నారు. 'లా' చదివి, న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. సోషల్ వర్క్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. 2022లో 'హెచ్‌ఎస్‌ఎస్‌సిడబ్ల్యూ' సంస్థను ఏర్పాటు చేసి... మహిళా ఖైదీల సంక్షేమం కోసం కార్యక్రమాలను పూర్తిస్థాయిలో ప్రారంభించారు. అప్పటివరకూ నేను ఒంటరిగా చేస్తున్న కార్యక్రమాలను వ్యవస్థాగతం చేశాను. స్వచ్ఛంద సేవకులు, ఔత్సాహికుల భాగస్వామ్యంతో రాంచీ సెంట్రల్ జైల్‌లోని మహిళా ఖైదీలకు విద్యతో పాటు నైపుణ్య శిక్షణను మా సంస్థ తరఫున చేపట్టాం. ఆ తరువాత జైళ్ళ శాఖ అధికారుల ప్రోత్సాహంతో జార్ఖండ్ రాష్ట్రంలోని పలు కారాగారాలకు వాటిని విస్తరించాం. వైద్య శిబిరాల ఏర్పాటు, కుంగుబాటు, మానసికమైన ఒత్తిడిని నివారించడం కోసం కౌన్సెలింగ్, మహిళా ఖైదీల కేసుల్లో న్యాయపరమైన సహాయం, జైలు నుంచి విడుదలైనవారికి పునరావాసం, ఉపాధి కల్పన, వారి పిల్లలకు విద్య, వైద్య సౌకర్యాలు, ఆశ్రయం లాంటి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. దీనికోసం వివిధ ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటున్నాం" అని చెప్పారు అపూర్వ.

చారిటీగా భావించడం లేదు...

ఒకసారి ఒక మహిళా ఖైదీ సమస్య అపూర్వ దృష్టికి వచ్చింది. ఆ ఖైదీ అరెస్ట్ అయినప్పుడు గర్భవతి. ఆమె అబార్షన్ చేయించుకోవాలని అనుకుంది. కానీ దానికి న్యాయపరమైన అనుమతి వచ్చేసరికి ఆరు వారాలకు పైగా సమయం పట్టింది. అప్పటికే సమయం మించిపోయిందని, అబార్షన్ చేయడం కుదరదని వైద్యులు చెప్పారు. ఆమె తీవ్రమైన ఆవేదనకు గురయింది. ఈ సంఘటన నేపథ్యంలో... మహిళా ఖైదీల పునరుత్పత్తి హక్కులపై అపూర్వ చేసిన పోరాటం 'జార్ఖండ్ ప్రిజన్ మాన్యువల్'లో మార్పులకు దారి తీసింది. "ఇలాంటి సంఘటనలు భావోద్వేగపరమైన ఒత్తిడిని ఖైదీలకు తీసుకువస్తాయి. తమ బాధను ఎవరికైనా వినిపించాలనుకుంటారు. ఆ బాధ్యతను మేము తీసుకుంటున్నాం. వారికోసం మేము చేస్తున్న ఏ పనినీ చారిటీగా భావించడం లేదు. ఆ మహిళలకు హక్కులు ఉన్నాయి. ఆ హక్కులపై వారికి అవగాహన కల్పించి, వాటిని వినియోగించుకొనేలా చూస్తున్నాం. ఇప్పటివరకూ వేలమంది మహిళా ఖైదీలకు మా సంస్థ ద్వారా సాయపడ్డాం. భవిష్యత్తులో అన్ని జైళ్ళలో మహిళా ఖైదీల ఇబ్బందులను పరిష్కరించాలనేది మా లక్ష్యం" అని అంటున్నారు అపూర్వ.

పిల్లల జ్ఞాపకశక్తి కోసం...

కొంతమంది పిల్లలు ఎంత బాగా చదివినప్పటికీ మరుసటిరోజే అన్నీ మర్చిపోతుంటారు. అలాకాకుండా పిల్లల జ్ఞాపకశక్తిని పెంచడానికి తల్లిదండ్రులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...

- మెదడు సమర్థవంతంగా పనిచేయాలంటే శరీరానికి విశ్రాంతి, నిద్ర అత్యవసరం. పిల్లలు రోజుకు కనీసం ఎనిమిది నుంచి పది గంటల వరకు హాయిగా నిద్రపోవాలి. అప్పుడే వారిలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. టీవీ, మొబైల్, ల్యాప్‌టాప్‌ల వాడకంపై పరిమితులు విధించి పిల్లలు సమయానుసారం నిద్రించేలా చూసుకోవాలి.
- కొంతమంది పిల్లలు ఉదయం పూట అల్పాహారం తీసుకోకుండా పాలు తాగకుండా బడికి బయలుదేరుతుంటారు. ఇది అంత మంచి పద్ధతి కాదు. తృణధాన్యాలతో తయారు చేసిన ఆహారపదార్థాలు, తేలికగా జీర్ణమయ్యే వంటకాలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ లాంటివాటిని పిల్లలకు అల్పాహారంగా తినిపించాలి. దీనివల్ల మెదడుకు పోషకాలు, శక్తి చేకూరుతాయి. బడిలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను పిల్లలు చక్కగా అర్థం చేసుకుని తేలికగా గుర్తుపెట్టుకోగల్గుతారు.
- పిల్లలతో చదరంగం, క్యారమ్స్, మెమరీ కార్డ్ లాంటి ఆటలు ఆడించాలి. పజిల్స్ సాల్వ్ చేయడం, సుడోకు లాంటి పదబంధాలను పూరించడం అలవాటు చేయాలి. వీటివల్ల మెదడుకు తగినంత వ్యాయామం లభిస్తుంది. దీంతో పిల్లలకు ఆలోచన సామర్థ్యం, జ్ఞాపక శక్తి చక్కగా పెరుగుతాయి.



ఆర్థిక నిపుణుడు ,ఐఏఎస్ అధికారి నాగరాజుకు నాయుడమ్మ పురస్కారం



తెనాలి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ పురస్కారానికి ఆర్థిక వ్యవహారాల నిపుణుడు, ఐఏఎస్ అధికారి నాగరాజు మద్దిరాల ఎంపిక య్యారు. కేంద్ర ఆర్థిక శాఖలో ఆర్థిక సేవల విభాగ కార్యదర్శిగా ఉన్న ఆయ నకు 2025 సంవత్సరం పురస్కారాన్ని అందజేయనున్నారు. ఈ మేరకు గుంటూరు జిల్లా తెనాలిలో డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు తెలి పారు. ప్రఖ్యాత చర్మశాస్త్రవేత్తగా గుర్తింపు పొందిన డాక్టర్ నాయు డమ్మ బాపట్ల జిల్లా అమృతలూరు మండలం యలవర్రు గ్రామంలో జన్మించారు. చర్మ శాస్త్రంలో అలుపెరుగని పరిశోధనలు చేసి ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలిచారు. అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ఐడీఆర్‌సీకి భారత్ తరఫున తొలి గవర్నర్‌గా ప్రాతి నిధ్యం వహించారు. నాయుడమ్మ పేరుపై ఏటా శాస్త్రవేత్తలు, వివిధ రంగాల్లో నిపుణులకు అవార్డును ప్రదానం చేస్తున్నారు. ఈ ఏడాది పురస్కారాన్ని నాగరాజు మద్దిరాలకు తెనాలి రామకృష్ణ కవి కళాక్షే త్రంలో ఈనెల 10న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అందించను న్నారు. మద్దిరాల నాగరాజు 1993వ బ్యాచ్‌కు చెందిన త్రిపుర కేడర్ ఐఏఎస్ అధికారి. ఆయన కృష్ణా జిల్లాలో 1966లో జన్మించారు. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. అంతకు ముందు రెవెన్యూ, అభివృద్ధి పాలన, గిరిజన అభివృద్ధి, ఆర్థిక, అంత ర్జాతీయ సంబంధాలు, పరిశ్రమలు, వాణిజ్యం, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాల్లో ఆయన సేవలు అందించారు.

మేడారం మాస్టర్‌ప్లాన్ సిద్ధం!

- అధునాతన వసతులతో గద్దెలు
- ఈశాన్యం నుంచి ప్రవేశ ద్వారం
- వీఐపీ బ్లాక్, అడ్మిన్ భవనాల నిర్మాణం
- 29 ఎకరాల్లో అమ్మల స్మృతి వనం
- మాస్టర్‌ప్లాన్‌పై నేడు మంత్రులు.. సీతక్క, కొండా సురేఖ సమీక్ష

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వందల ఏళ్ల చరిత్ర ఉన్న మేడారం సమ్మక్క-సా రలమ్మ ప్రాంగణం అభివృద్ధిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం.. అధునాతన వసతుల కల్పనకు 'మాస్టర్ ప్లాన్'ను సిద్ధం చేసింది. ఆసి యాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరున్న సమ్మక్క-సారలమ్మ జాతర కోసం శాశ్వత, తాత్కాలిక విధానాల్లో పనులను చేపట్టనుంది. ఈ మాస్టర్ ప్లాన్‌పై మంత్రులు సీతక్క, కొండా సురేఖ బుధవారం సమీక్ష నిర్వహించనున్నారు. ఈ పండుగకు జాతీయ హోదా కల్పించి, నిధులు ఇవ్వాలంటూ త్వరలో కేంద్రానికి లేఖ రాయనున్నట్లు సమాచారం. 2019, 2021, 2023లోనూ ప్రభుత్వం ఈ మేరకు కేంద్రానికి లేఖలు రాసిన విషయం తెలిసిందే.!

ఈ పనులతో గద్దెలకు హంగులు

- మాస్టర్ ప్లాన్‌లో నిర్మాణాలన్నీ గిరిజన, కోయ సంప్రదాయాల శైలిలో ఉంటాయి.
- మేడారం జాతరకు 10 రాష్ట్రాల నుంచి కోటి మందికి పైగా భక్తులు వస్తారు. దీంతో.. అమ్మల గద్దె లను అధునాతనంగా తీర్చిదిద్ది.. చుట్టూ భక్తులు తిరి గేందుకు అనువుగా 20 అడుగుల రోడ్డును నిర్మిస్తారు. గద్దెలకు బయటి వైపు 40 అడుగుల వెడల్పుతో బఫర్ జోన్‌ను ఏర్పాటు చేస్తారు.
- గద్దెల దగ్గరకు వెళ్లేందుకు పూజారులు, ప్రము ఖుల కోసం ప్రత్యేక మార్గం ఉంటుంది. జాతర ప్రాంగ ణంలో వీరి భద్రత కోసం ప్రత్యేకం గా సెక్యూరిటీ బ్లాకులు ఉంటాయి.
- గద్దెల వద్దకు వెళ్లేందుకు వీలుగా ఈశాన్యంలో 'మహాద్వారం' పేరుతో ఓ ప్రధాన ద్వారాన్ని ఏర్పాటు చేస్తారు.
- భక్తులు ముడుపులు, కాను కలు చెల్లించేందుకు భారీ హుండీ లను అందుబాటులో పెడతారు.
- దర్శనం తర్వాత భక్తులు బయటకు వెళ్లేందుకు మూడు ద్వారాలు ఉంటాయి.
- పోలీసు నిఘా, జాతర కవరేజీలో ఉండే మీడియా కోసం రెండు భారీ టవర్లను నిర్మిస్తారు.
- ప్రాంగణం బయటివైపు వాహనాల పూజలకు ఏర్పాట్లు ఉంటాయి.
- మొక్కులు తీర్చుకునే వారి కోసం ప్రత్యేకంగా 4 హాళ్లను నిర్మిస్తారు.
- గద్దెల చుట్టూ రానున్న నిర్మాణాలు కూడా గిరి జన శైలిలో ఉంటాయి.
- గద్దెల వెనక వైపున్న 29 ఎకరాల్లో సమ్మక్క-సా రలమ్మ, నాగులమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు, వారి అనుచరగణానికి సంబంధించిన చరిత్రను తెలిపేలా 'వనదేవతల స్మృతి వనం' ఏర్పాటు కానుంది.



మాస్టర్‌ప్లాన్ పూర్తయితే.. మేడారం ప్రవేశం.. తల్లుల గద్దెలు ఇలా ఉంటాయి

కరెంట్ స్తంభం విరిగి పడి ఐటీ ఉద్యోగి మృతి



సాత్విక్(ఫైల్)

ఉప్పల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం ఊరేగింపులో కరెంట్ స్తంభం విరిగి మీద పడి ఓ ద్విచక్రవాహనదారుడు ప్రాణాలు కోల్పోయాడు. హైదరాబాద్‌లోని నాచారం ఈఎస్ఐ ఆస్పత్రి ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన ఈ ప్రమాదంలో సాత్విక్(23) అనే ఐటీ ఉద్యోగి మరణించాడు. వివరా లిలా ఉన్నాయి. నాచారం కార్తికేయనగ ర్‌కు చెందిన కృష్ణమూర్తి కుమారుడు సాత్విక్(23) పుణెలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. స్నేహితులు వినాయక మండపాలు ఏర్పాటు చేయగా ఉత్సవాల్లో పాల్గొనేందుకు నాలుగు రోజుల క్రితమే హైదరాబాద్ వచ్చాడు. సోమవారం స్నేహితుల వద్దకు వెళ్లిన సాత్విక్ అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. నాచారం వీఎస్‌టీ కాలనీ వినాయక మండప నిర్వాహకులు 16 అడుగుల విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువెళు తుండగా.. ఈఎస్ఐ ఆస్పత్రి దాటాక రోడ్డుకు అడ్డంగా ఉన్న ఇంట ర్నెట్ కేబుల్ ఆ విగ్రహానికి చిక్కుకుంది. దీంతో ఏర్పడిన కుదుపుతో రోడ్డు డివైడర్‌లో ఉన్న ఓ తుప్పు పట్టిన వీధి దీపపు స్తంభం విరిగి అటుగా వస్తున్న సాత్విక్‌పై పడింది. దీంతో తీవ్రంగా గాయపడి సాత్విక్ మరణించాడు. వినాయక మండప నిర్వాహకుడితో పాటు వాహన డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



థియేటర్లలో ఆస్వాదించే చిత్రం

శివకార్తికేయన్

శివకార్తికేయన్ కథానాయకుడిగా మురుగదాస్ తెర కెక్కించిన చిత్రం 'మదరాసీ'. ఎన్‌వీ ప్రసాద్ నిర్మిం చారు. రుక్మిణీ వసంత్ కథానాయిక. ఈ నెల 5న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో శివకార్తికేయన్ మాట్లాడుతూ 'థియేటర్లలో ప్రతీ ప్రేక్షకుడు ఆస్వాదించే చిత్రమిది. నా గత చిత్రాలను ఆదరించినట్లే 'మదరాసీ'ని ఆదరి స్తారని కోరుకుంటున్నా. అద్భుతమైన యాక్షన్, ఆకట్టు కునే ప్రేమకథ ఉన్న సినిమా ఇది. మంచి సినిమా చూశామన్న అనుభూతిని మీ అందరికీ ఇస్తుంది' అని అన్నారు. 'సినిమా విజువల్ వండర్‌లా ఉంటుంది. శివ కార్తికేయన్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్ అవుతుంది' అని ఎన్‌వీ ప్రసాద్ చెప్పారు. 'మా టీమ్ అందరికీ ఈ చిత్రం ఎంతో ప్రత్యేకం. కచ్చితంగా సినిమాను ఎంజాయ్ చేస్తారు' అని రుక్మిణీ వసంత్ తెలిపారు.



పాత ఫొటోతో కొత్తగా...

మెగస్టార్ చిరంజీవి తమ్ముడు పవన్ కల్యాణ్‌పై తనకున్న ప్రేమను మరోసారి చాటుకున్నారు. మంగళవారం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిరంజీవి ఓ పాత ఫొటో షేర్ చేస్తూ పవన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 'చలన చిత్ర రంగంలో అగ్రనటుడిగా, ప్రజా జీవి తంలో జన సేనానిగా, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రజలకు నిరంతర సేవలు అందిస్తున్న కల్యాణ్ బాబుకి శుభాకాంక్షలు. ప్రజా సేవలో నువ్వు చూపుతున్న అంకిత భావం చిరస్మరణీయం. ప్రజలందరి ఆశీస్సులతో, అభిమానంతో నిండు నూరేళ్ల ఆయురారో గ్యాలతో ప్రజలకు మార్గదర్శకుడిగా నిలవాలని ఆశీర్వదిస్తున్నాను, దీర్ఘాయుష్మాన్ భవ' అంటూ చిరంజీవి పోస్టు పెట్టారు. ఈ పోస్టుపై పవన్ కల్యాణ్ స్పందించారు. 'నా జీవితానికి మార్గదర్శి, తండ్రి సమానులైన అన్నయ్య, పద్మ విభూషణ్ చిరంజీవికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. మీ ఆశీస్సులు, ప్రేమాభిమానాలు, పుట్టినరోజు శుభాకాంక్షలు ఎంతో ఆనందం కలిగించాయి' అని సమాధానమిచ్చారు. నాగబాబు పోస్టుకు కూడా పవన్ స్పందించారు. 'హృదయ పూర్వక ధన్యవాదాలు చిన్నన్నయ్యా. మీరు లా చదివే సమ యంలో బహుమతిగా ఇచ్చిన నానీ పాల్కీవాలా రచించిన 'వి ది నేషన్' పుస్తకం నాలో రాజకీయ చైతన్యాన్ని కలిగించడా నికి ప్రేరణగా నిలిచింది' అని పవన్ పేర్కొన్నారు.

విందు భోజనంలా సినిమా ఉంటుంది



క్రిష్

'ఇప్పటికే పలు చిత్రాల్లో విభిన్నమైన, విలక్షణ మైన పాత్రలు పోషించి, నటిగా తనేంటో నిరూపించుకున్నారు అనుష్క. మంచి పాత్ర పడాలే గానీ తన నటనకు ఆకాశమే హద్దు. ఇప్పుడు 'ఘాటి' చిత్రంలో తనలోని నటిని కొత్త కోణంలో ఆవిష్కరించారు. ఈ చిత్రం ట్రైలర్‌లో మీరు చూసింది రెండు మెతుకులు మాత్రమే. పూర్తి విందుభోజనం సినిమాలో ఉంటుంది' అని దర్శకుడు క్రిష్ అన్నారు. ఆయన దర్శకత్వం వహిం చిన 'ఘాటి' చిత్రం ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా క్రిష్ మీడియాతో ముచ్చటించారు.

- డాక్టర్ చింతకింద శ్రీనివాసరావు చెప్పిన లైన్ నచ్చ డంతో 'ఘాటి' చిత్రాన్ని మొదలుపెట్టాను. ఒడిసా, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో గంజాయి సాగు, అక్రమరవాణా ఎక్కువగా జరుగుతోంది. ఆ గుట్టల్లో గంజాయిని భుజాన మోస్తూ చేరవేయడానికి పనిచేసేవాళ్లను ఘాటీలు అంటారు.
- కథ ప్రధానంగా గంజాయి సాగు, అక్రమరవాణా చుట్టూ తిరుగుతుంది. రొమాం చిత పోరాట ఘట్టాలు, పతాకస్థాయి భావోద్వేగాలు, భారీ బడ్జెట్, హై టెక్నికల్ వాల్యూస్‌తో గ్రాండియర్‌గా తెరకెక్కించాం. ఒక సామాజిక సమస్యకు వాణిజ్య హంగులు జోడించి తెరకెక్కించిన చిత్రమిది.
- వేదం తర్వాత అనుష్కతో సినిమా చేయాలని చాలాకాలంగా ఎదురుచూస్తున్నా. ఆమె స్టార్‌డమ్‌కు సరిపోయే కథ ఇది. ఇందులో ఆమె శీలావతి అనే మహిళగా సాహ సోపేతమైన పాత్రలో కనిపిస్తారు. యాక్షన్ సన్నివేశాల్లో అనుష్క నటన ఆకట్టుకుం టుంది. అలాగే విక్రమ్ ప్రభు, చైతన్యారావు పాత్రోచిత నటనతో అలరిస్తారు. మా నిర్మాతలు రాజీవ్‌రెడ్డి, సాయిబాబా జాగర్లమూడి, యూవీ క్రియేషన్స్ విక్కీ, వంశీ, ప్రమోద్ సహకారం వల్లే మంచి నిర్మాణవిలువలతో తీయగలిగాం.
- పరిస్థితుల ప్రభావం వల్లే 'హరి హర వీరమల్లు' దర్శక బాధ్యతల నుంచి నేను వైదొలగాల్సి వచ్చింది. అనుకోని అడ్డంకులతో ఆ సినిమా చిత్రీకరణ సుదీర్ఘంగా సాగడం వల్ల నేను కూడా ఆర్థికంగా ఒడిదొడుకులు ఎదుర్కోవాల్సి వచ్చింది. దాంతో నా టీమ్‌ను మెయింటైన్ చేయడానికి ఆ సినిమా నుంచి బయటకు వచ్చి మరో సినిమాను పట్టాలెక్కించాను. నిర్మాత ఏ.ఎం రత్నం గారు కూడా నా ఇబ్బందిని అర్థం చేసుకొని సహకరించారు. నాకు పవన్ కల్యాణ్ గారిపైన అమితమైన గౌరవం ఉంది.



వందకు పైగా దేశాల్లో మహేశ్ సినిమా!

- ముసాలియా(కెన్యా ప్రభుత్వ అధికారి)

మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి తెర కెక్కిస్తున్న 'ఎస్ఎస్ఎంబీ 29' షూట్ ప్రస్తుతం కెన్యాలో జరుగుతోంది. తాజాగా కెన్యా కేబినెట్ సెక్ర టరీ ముసాలియా డబ్ల్యూ ముదావడిని ఆయన కార్యా లయంలో కలసింది చిత్రబృందం. ఈ సందర్భంగా దర్శకుడు రాజమౌళి, నిర్మాత కె.ఎల్.నారాయణ తది తరులతో తీసుకున్న ఫొటోలను ఆయన ఎక్స్ వేది కగా షేర్ చేశారు. 'దాదాపు రెండు దశాబ్దాలుగా అద్భుతమైన సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్న రాజమౌళి, తన చిత్రం షూటింగ్ కోసం కెన్యాను ఎంచుకోవడం మాకెంతో గర్వకారణం. ఆఫ్రికా షెడ్యూల్‌లో దాదాపు 95 శాతం చిత్రీకరణ ఇక్కడే జరుగుతోంది. సుమారు 120 దేశాల్లో రిలీజ్ కానున్న ఈ సినిమా ద్వారా మా దేశంలోని ప్రకృతి అందాలు కోట్లాది ప్రేక్షకులను కనువిందు చేయను న్నాయి' అని పేర్కొన్నారు.

మంచి అనుభూతి కలుగుతుంది



విజయ రామ రాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. సిజా రోజ్ కథానాయిక. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో శ్రీని గుబ్బల నిర్మించారు. సినిమా ఇటీవలె విడు దలైన సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు. విజయ రామరాజు మాట్లాడుతూ 'ప్రేక్షకుల నుంచి ఇంతటి అద్భుతమైన స్పందన రావడం చాలా ఆనందంగా ఉంది. సినిమా చూడని వాళ్లు తప్పకుండా చూడండి. మంచి సినిమా చూశామనే అనుభూతి కలు గుతుంది' అని అన్నారు. దర్శకుడు విక్రాంత్ రుద్ర మాట్లాడుతూ 'ప్రేక్షకులు ఆదరిస్తే మరో మంచి సినిమా తీయగలుగుతాం' అని అన్నారు. కార్యక్రమంలో హీరోయిన్ సిజా రోజ్, నటుడు దయానంద్ రెడ్డి తదితరులు మాట్లాడారు.



నా మనసుకు దగ్గరైన కథ

శివాని నాగరం


"అంబాజీ పేట మ్యారేజీ బ్యాండ్' చిత్రం తర్వాత కొన్ని కథలు నా దగ్గరకు వచ్చాయి. కానీ అవేవీ నాకు సంతృప్తికరంగా అనిపించలేదు. ఆలస్యం అయినా మంచి కథలు వస్తేనే సినిమా చేయాలనుకున్నాను. అప్పుడు 'లిటిల్ హార్ట్స్' చిత్రంలో అవకాశం వచ్చింది. ఇది నా మనసుకు బాగా దగ్గరైన కథ' అని హీరోయిన్ శివాని నాగరం అన్నారు. సాయి మార్తాండ్ దర్శక త్వంలో ఆదిత్య హాసన్ నిర్మించారు. మౌళి తనుజ్ కథానాయకుడు. నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి ఈ నెల 5న విడుదల చేస్తు న్నారు. ఈ సందర్భంగా శివాని మీడియాతో ముచ్చటించారు. 'ఇందులో కాత్యాయని అనే కాలేజ్ అమ్మాయి పాత్రలో కనిపిస్తాను. ప్రేక్షకులను బాగా నవ్విస్తుంది. ఈటీవి విన్ నుంచి వస్తున్న తొలి థియేట్రికల్ ఫిల్మ్ ఇదే కావడం విశేషం. 'లిటిల్‌హార్ట్స్' కథలో ప్రేక్షకులు తమను తాము చూసుకుంటారు. గతంలో కాలేజీ ప్రేమల నేపథ్యంలో చాలా చిత్రాలు వచ్చినా ఇది మాత్రం నవ్యపంథాలో ఉంటుంది. ప్రేక్షకుల కాలేజీ రోజు లను గుర్తు చేస్తుంది. ఇందులో ప్రేమ, భావోద్వేగాల కన్నా వినోదానికి దర్శకుడు పెద్ద పీట వేశారు. కథ బాగా నచ్చింది కాబట్టే బన్నీ వాస్, వంశీ విడుదల చేస్తున్నారు' అని శివాని చెప్పారు.

యూత్‌ను ఆకట్టుకునేలా...



అంకిత్ కొయ్య, నీలఖి జంటగా జె.ఎస్.ఎస్.వర్ధన్ తెరకెక్కిస్తున్న చిత్రం 'బ్యూటీ'. దర్శకుడు మారుతి సమర్పణలో విజయపాల్ రెడ్డి అడి దల, ఉమేశ్‌కుమార్ బన్సాల్ నిర్మిస్తున్నారు. ఈ నెల 19న చిత్రం విడుదల వుతోంది. తాజాగా, ఈ సినిమా నుంచి 'ప్రెట్టీ ప్రెట్టీ' అంటూ సాగే పాటను విడుదల చేశారు మేకర్స్. ఈ సాంగ్ యూత్‌ను ఆకట్టుకుంటుందని తెలి పారు. సనారే సాహిత్యం అందించగా, పీవీఎన్ఎస్ రోహిత్ ఆలపించారు. విజయ్ బుల్గానిన్ సంగీతం అందించారు.

హంతకుడి వేట



కోలీవుడ్ హీరో అథర్వా మురళి నటిం చిన యాక్షన్ ప్యాక్డ్ థ్రిల్లర్ 'టన్నెల్' ఈ నెల 12న విడుదల కానుంది. రవీంద్ర మాధవ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని తెలుగులో లచ్చురామ్ ప్రొడక్షన్స్ సంస్థ ద్వారా ఎ.రాజు నాయక్ విడుదల చేస్తున్నారు. ఈ సినిమాలో అథర్వా మురళీ పోలీస్ ఆఫీసర్‌గా నటించారు. క్రూరమైన హత్యలు, వాటి వెనుకున్న సైకోని పట్టుకోవడానికి ఓ పోలీస్ ఆఫీసర్ ఏం చేశాడన్న ఇతివృత్తంతో గ్రిప్పింగ్ సీన్స్, థ్రిల్లింగ్ యాక్షన్ సీక్వెన్స్‌తో సినిమా ఉంటుందని ఎ.రాజునాయక్ చెప్పారు. త్వరలోనే తెలుగు ట్రైలర్‌ను విడుదల చేస్తామన్నారు. అథర్వా మురళీ కూడా తెలుగు ప్రమోషన్స్‌లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

బిజినెస్

వరంగల్ ● బుధవారం 3 సెప్టెంబరు 2025

హైదరాబాద్‌లో యాపిల్ విస్తరణ

మరో 64,125 చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ లీజుకు తీసుకున్న సంస్థ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఐఫోన్ తయారీ దిగ్గజం యాపిల్ హైదరాబాద్‌లో కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందుకోసం నానక్‌రామ్ గూడ, ఐటీ కారిడార్‌లోని వేవ్‌రాక్ టవర్ 2.1లో 64,125 చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని (ఆఫీస్ స్పేస్)ను ఐదేళ్ల కాలానికి లీజుకు తీసుకుందని రియల్టీ రంగానికి చెందిన డేటా, అనలిటిక్స్ కంపెనీ ప్రాప్‌స్టాక్ వెల్లడించింది. టీఎస్ఐ బిజినెస్ పార్క్స్ (హైదరాబాద్) ప్రైవేట్ లిమిటెడ్ నుంచి లీజుకు తీసుకున్న ఈ స్థలం కోసం యాపిల్ ఇండియా నెలకు రూ.80.15 లక్షల అద్దె చెల్లించనున్నట్లు ప్రాప్‌స్టాక్ తెలిపింది. యాపిల్ హైదరాబాద్ ఆఫీస్‌ను సీఈఓ టిమ్ కుక్ 2016 మే నెలలో ప్రారంభించారు. సంస్థ ఇక్కడ యాపిల్ మ్యాప్స్, జియో స్పేషియల్ టెక్నాలజీ, డేటా మోడలింగ్ అభివృద్ధి కార్యకలాపాలు సాగిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

3వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	570
వరంగల్	537	గోదావరి	570
చిత్తూరు	578	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	127
వరంగల్	98	గుంటూరు	115
కరీంనగర్	98	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	98
కర్నూలు	98	నెల్లూరు	103
విశాఖపట్నం	131	అనంతపురం	103
గోదావరి	127		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,06,090 ▲	97,250 ▲	1,36,100 ▲
విజయవాడ	1,07,650 ▲	1,01,500 ▲	1,26,250 ▲
విశాఖపట్నం	1,07,560 ▲	97,250 ▲	1,36,100 ▲
రాజమండ్రి	1,06,090 ▲	97,250 ▲	1,26,900 ▲
ప్రొద్దుటూరు	1,06,450 ▲	97,930 ▲	1,26,000 ▲
ముంబై	1,04,424 ▼	95,652 ▼	1,22,833 ▲

ఫార్మాపై 200% సుంకాలు!

డొనాల్డ్ ట్రంప్ సన్నాహాలు ● టారిఫ్స్ అమల్లోకి వస్తే ఔషధ ధరలు 50% పెరిగే చాన్స్



న్యూఢిల్లీ: ఫార్మా దిగుమతులపై భారీగా సుంకాలు విధించేందుకు అమెరికా సిద్ధమవుతోంది. దిగుమతి చేసుకునే ఔషధాలపై 200 శాతం వరకు సుంకాలు విధించాలని ట్రంప్ అధికార యంత్రాంగం ప్రతిపాదించింది. ఇదే జరిగితే అమెరికా మార్కెట్‌పై ఎక్కువగా ఆధారపడిన భారత ఫార్మా కంపెనీలకు ఆ మార్కెట్ దాదాపుగా మూసుకుపోతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ట్రంప్ సర్కారు ఔషధ దిగుమతులను సుంకాల నుంచి మినహాయించింది. తాజా ప్రతిపాదన అమలుకు నోచుకుంటే, అది భారత ఫార్మాకు చావు దెబ్బ అవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే అన్ని రకాల ఔషధ దిగుమతులపై కాకుండా.. ఎంపిక చేసిన కొన్ని ఔషధ దిగుమతులపైనే ఈ సుంకాల పోటు ఉంటుందనే అంచనాలూ వినిపిస్తున్నాయి.

అమలు కష్టమే ?

అయితే ట్రంప్ సర్కారు ప్రతిపాదన అమలు చేయడం అంత తేలిక కాదనే వాదన వినిపిస్తోంది. అమెరికాలోనే ఈ ఔషధాలను ఉత్పత్తి చేయాలంటే అందుకు ఎంత లేదన్నా కనీసం రెండు నుంచి మూడేళ్ల సమయం పడుతుంది. ఉత్పత్తి వ్యయం మన దేశంతో పోలిస్తే కనీసం 30 నుంచి 40 శాతం పెరుగుతుంది. కంపెనీలు ఈ భారాన్ని వినియోగదారులకే బదిలీ చేయాల్సి ఉంటుంది. దాంతో అమెరికాలో ఆరోగ్య బీమా ప్రీమియంలు పెరిగి పోతాయని భావిస్తున్నారు. ఒకవేళ ప్రతిపాదించిన విధంగా దిగుమతి ఔషధాలపై 200 శాతం సుంకాలు విధించినా, అమెరికా రిటైల్ మార్కెట్లో ఔషధాల ధర 40 నుంచి 56 శాతం వరకు పెరుగుతాయని అంచనా. దీంతో అసలు ఈ ప్రతిపాదన అమలు చేసేందుకు ట్రంప్ సర్కారు సాహసిస్తుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పెరుగుతున్న నిల్వలు

ఈ ప్రతిపాదన వెలుగులోకి రావడంతో అమెరికాలోని రిటైల్ మెడికల్ చెయిన్స్ పెద్దఎత్తున దిగుమతులు ప్రారంభించాయి. కనీసం ఆరు నెలల నుంచి ఏడాదిన్నర వరకు సరిపోయేలా ఔషధాలను నిల్వ చేసుకుంటున్నాయి. అమెరికాకు ఇటీవల భారత ఔషధ ఎగుమతుల పెరుగుదలకు ఇది కూడా ఒక కారణమని భావిస్తున్నారు.

నేటి నుంచి జీఎస్‌టీ మండలి భేటీ

రెండు శ్లాబులపై నిర్ణయం .. లగ్జరీ ఈవీలపై బాదుడు!

గురువారం తుది నిర్ణయం

న్యూఢిల్లీ: జీఎస్‌టీ మలి తరం సంస్కరణలకు రంగం సిద్ధమైంది. బుధవారం నుంచి రెండు రోజుల పాటు ఢిల్లీలో జరిగే జీఎస్‌టీ మండలి సమావేశం దీనిపై నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన ఈ సమావేశానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షత వహిస్తారు. ఈ సంస్కరణలు ఆర్థిక వ్యవస్థను మరింత విస్తృతం చేసి పారదర్శకతను పెంచేలా ఉంటాయని సీతారామన్ ప్రకటించారు. దీనివల్ల చిన్న వ్యాపార సంస్థలపై నిబంధనల అమలు భారం తగ్గడంతో పాటు అనేక వస్తువుల ధరలు తగ్గుతాయన్నారు. ప్రతిపాదిత సంస్కరణల్లో భాగంగా ప్రస్తుతం నాలుగు శ్లాబులుగా ఉన్న జీఎస్‌టీ రేట్లను 5,18 శ్లాబులుగా కుదించాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. దీంతో నిత్యావసరాలతో పాటు గృహోపకరణ ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

విలాస కార్లపై బాదుడే: ఎంట్రీ లెవల్ కార్లు, ద్విచక్ర మోటారు వాహనాలపై ప్రస్తుతం 28 శాతం జీఎస్‌టీ అమలవుతోంది. విలాస కార్లపై మాత్రం 28 శాతం జీఎస్‌టీతో పాటు మరో 28 శాతం ప్రత్యేక సెస్సు అమలవుతోంది. ప్రతిపాదిత సంస్కరణల్లో భాగంగా ఎంట్రీ లెవల్ కార్లు, టూ వీలర్లపై జీఎస్‌టీని ప్రస్తుత 28 శాతం నుంచి 18 శాతానికి కుదించాలని రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన మంత్రుల బృందం ఇప్పటికే సిఫారసు చేసింది. అయితే లగ్జరీ కార్లు, ఎస్‌యూవీలను మాత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసే 40 శాతం శ్లాబులో చేర్చాలని సూచించింది. రూ.40 లక్షలకు మించిన ఎలక్ట్రిక్ కార్ల (ఈవీ)ను ఈ జాబితాలో చేర్చాలని కోరింది. జీఎస్‌టీ మండలి ఇందుకు ఆమోదం తెలిపితే టెస్లాతో పాటు లగ్జరీ ఈవీల బాట పట్టిన బీఎండబ్ల్యూ, మెర్సిడెజ్ బెంజ్ కంపెనీలకు తిప్పలు తప్పవని భావిస్తున్నారు.

ఆఖర్లో లాభాల స్వీకరణ

సెన్సెక్స్ 206 పాయింట్లు డౌన్

ముంబై: ఈక్విటీ మదుపరులు ఆఖర్లో బ్యాంకింగ్, ఆటో రంగ షేర్లలో లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే, సెన్సెక్స్ 206.61 పాయింట్లు కోల్పోయి 80,157.88 వద్దకు జారుకుంది. నిఫ్టీ 45.45 పాయింట్లు తగ్గి 24,579.60 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత సంస్థల్లో 16 నష్టపోయాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం 0.64 శాతం వరకు పెరిగాయి. రంగాల వారీ సూచీల్లో బ్యాంకెక్స్, టెలికాం, ఫైనాన్షియల్ సర్వీసెస్, టెక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ నేలచూపులు చూశాయి.

చక్కెర షేర్లు మరింత తీపిగా: షుగర్ మిల్లులు, డిస్టిలరీలకు ఇథనాల్ ఉత్పత్తిపై ఆంక్షలను ఎత్తివేయడంతో ఈ రంగ షేర్లు భారీగా పుంజుకున్నాయి. రాజ్‌శ్రీ షుగర్స్ షేరు ఏకంగా 20 శాతం ఎగబాకింది. శ్రీ రేణుక షుగర్స్ 12.72 శాతం, ద్వారికేశ్ షుగర్ ఇండస్ట్రీస్ 12.46 శాతం, ధామ్‌పూర్ షుగర్ మిల్స్ 10.36 శాతం, శక్తి షుగర్స్ 8.25 శాతం, అవధ్ షుగర్ అండ్ ఎనర్జీ 5.03 శాతం లాభపడ్డాయి.

కొత్త ఆల్‌టైం కనిష్ఠానికి రూపాయి: భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠానికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 5 పైసల నష్టంతో రూ.88.15 వద్ద ముగిసింది.

ఇండెక్స్ ఆప్షన్స్‌కు ఇంట్రాడే పరిమితులు

జేన్‌స్ట్రీట్ ఉదంతం నేపథ్యంలో మార్కెట్ నియంత్రణ మండలి సెబీ.. ఇండెక్స్ ఆప్షన్స్ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. ఈక్విటీ ఇండెక్స్ డెరివేటివ్స్ ఇంట్రాడే పొజిషన్స్‌పై పరిమితులు విధించింది. వీటిలో ట్రేడింగ్ జరిపే ప్రతి సంస్థకు నెట్ ఇంట్రాడే పొజిషన్‌ను రూ.5,000 కోట్లకు పరిమితం చేస్తున్నట్లు మంగళవారం విడుదల చేసిన సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. గ్రాస్ ఇంట్రాడే పొజిషన్ పరిమితిని రూ.10,000 కోట్లకు పరిమితం చేసింది. కొత్త నియమావళి వచ్చే నెల 1 నుంచి అమల్లోకి వస్తుందని సెబీ స్పష్టం చేసింది.

సెమీకండక్టర్లలో ప్రపంచ శక్తి అవుతాం

సెమికాన్ ప్రారంభ సదస్సులో మోదీ



న్యూఢిల్లీ: ప్రస్తుతం దేశంలో 1,800 కోట్ల డాలర్ల (రూ.1.57 లక్షల కోట్లు) విలువ గల 10 సెమీకండక్టర్ ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. దేశం.. ఇండియా సెమీకండక్టర్ మిషన్ తదుపరి దశలోకి పురోగమిస్తోందన్నారు. త్వరలో లక్ష కోట్ల డాలర్ల (రూ.87 లక్షల కోట్లు) స్థాయికి చేరుతుందనుకుంటున్న ప్రపంచ చిప్ మార్కెట్లో అవకాశాలు సొమ్ము చేసుకునేందుకు వీలుగా డిజైన్ ఆధారిత ప్రోత్సాహక పథకాన్ని మరిన్ని మెరుగుదలతో తీర్చిదిద్దనున్నట్టు మంగళవారం ఇక్కడ సెమికాన్-2025 ప్రారంభ సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని చెప్పారు. "చమురును నల్ల బంగారం అని పిలుస్తారు. చిప్‌లు డిజిటల్ వజ్రాలు" అని ప్రధాని వ్యాఖ్యానించారు. 21వ శతాబ్ది శక్తి అంతా ఒక చిన్న చిప్‌లో కేంద్రీకృతమైందని పేర్కొన్నారు. భారత్‌లో తయారైన చిన్న చిప్ ప్రపంచంలో పెద్ద మార్పు తెచ్చే రోజు ఎంతో దూరంలో లేదంటూ "భారత్‌లో డిజైన్ అయి, భారత్‌లో తయారై, ప్రపంచం విశ్వసిస్తున్న" చిప్ అని ప్రపంచం యావత్తు మన దేశం గురించి ఘోషిస్తుందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

ప్రోత్సాహకాలు కొనసాగుతాయి

దేశంలో అమల్లో ఉన్న కీలకమైన సెమీకండక్టర్ ప్రాజెక్టులకు మొత్తం ఉత్పత్తి వ్యయంలో 70% ప్రోత్సాహకాలు యథావిధిగా అందుతాయని ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ చెప్పారు. సెమీకండక్టర్ ప్రాజెక్టులకు భారత్ అందిస్తున్న ప్రోత్సాహం కనివిని ఎరుగనిదంటూ సుమారు 3,000 కోట్ల డాలర్ల (రూ.2.61 లక్షల కోట్లు) విలువ గల ప్రోత్సాహకాలు, ప్రయోజనాలు ప్రస్తుతం అమలులో ఉన్నాయన్నారు.

టీసీఎస్ ఉద్యోగుల జీతం పెంపు

4.5 - 7% శ్రేణిలో పెరుగుదల ● సెప్టెంబరు నుంచి అమలు

ముంబై: దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తన ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. మెజారిటీ సిబ్బంది వేతనాలను 4.5 శాతం నుంచి 7 శాతం శ్రేణిలో పెంచుతున్నట్లు కంపెనీ ప్రకటించింది. సెప్టెంబరు నెల నుంచి జీతం పెంపు అమల్లోకి వస్తుందని తెలిపింది. ఉద్యోగులకు ఇంక్రిమెంట్ పత్రాలు అందజేసే ప్రక్రియ సోమవారం సాయంత్రం నుంచే ప్రారంభమైందని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు వెల్లడించాయి. కింది, మధ్య స్థాయి సిబ్బంది అందరికీ వేతనం పెరిగినట్లు ఆ వర్గాలు తెలిపాయి. అత్యుత్తమ పనితీరు కనబర్చిన వారికి వేతనాన్ని 10 శాతానికి పైగా పెంచినట్లు తెలిసింది.

- నైజీరియాకు చెందిన టోలారమ్ వెల్‌నెస్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సంప్రే న్యూట్రిషన్స్ లిమిటెడ్ వెల్లడించింది. ఒప్పందంలో భాగంగా టోలారమ్‌కు న్యూట్రాస్యూటికల్ ఉత్పత్తుల తయారీ, సరఫరాతో పాటు ఇతర ఆహార ఉత్పత్తులను సరఫరా చేయనుంది. ఈ ఒప్పందంతో ఏటా రూ.10 కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా వేస్తున్నట్లు ప్రకటించింది.
- హోమ్ టెక్స్‌టైల్స్ సంస్థ వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్.. బాలీవుడ్ నటి విద్యా బాలన్‌తో కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా విద్యా బాలన్ కంపెనీకి చెందిన అన్ని ఉత్పత్తులను వివరాలతో పాటు వాటి ఆవశ్యకతను వెల్లడించనున్నారని వెల్‌స్పన్ తెలిపింది.
- ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్.. ఖాతాదారులు, ఖాతాదారులు కాని వారికి జీఎస్‌టీ చెల్లింపుల వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది. యూపీఐ, కార్డులు, నెట్ బ్యాంకింగ్, బ్యాంక్ శాఖల ద్వారా వీరుఈ చెల్లింపులు చేపట్టవచ్చు.
- పండగల సీజన్ ఆరంభం కావటంతో వినియోగదారుల కోసం అత్యుత్తమ స్టైల్స్‌తో కూడిన ఫ్యాషన్ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు అమెజాన్ ఫ్యాషన్స్ ప్రకటించింది. అంతర్జాతీయ, దేశీయ బ్రాండ్లు ఈ సీజన్‌లో అందుబాటు ధరల్లో లభిస్తాయని వెల్లడించింది.

అక్టోబరు 9 నుంచి బడ్జెట్ కసరత్తు షురూ

న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక అస్థిరతలు, అమెరికా 50% సుంకాల విధింపు నేపథ్యంలో ఆర్థిక శాఖ 2026-27 వార్షిక బడ్జెట్ రూపకల్పనకు వచ్చే నెల 9వ తేదీ నుంచి సన్నాహాలు ప్రారంభించనుంది. దేశీయ డిమాండును ఉత్తేజితం చేయడం, తద్వారా 8% వార్షిక వృద్ధి స్థిరంగా సాధించడంలో ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించడంపై బడ్జెట్ ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తుంది. ఈ నేపథ్యంలో కేంద్ర వ్యయ శాఖ కార్యదర్శి అధ్యక్షతన విభిన్న వర్గాలతో ప్రీ బడ్జెట్ సమావేశాలు వచ్చే నెల 9 నుంచి ప్రారంభమవుతాయని ఆర్థిక వ్యవహారాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

స్పోర్ట్స్

టీ20లకు స్టార్క్ వీడ్కోలు

టెస్టు, వన్డేలపై దృష్టి



సిడ్నీ: మరో ఆరు నెలల్లో టీ20 వరల్డ్‌కప్ జరుగనుండగా.. ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. వన్డే, టెస్టులపై మరింత దృష్టి సారించేందుకు అంతర్జాతీయ టీ20 ఫార్మాట్ నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించాడు. కొత్త బంతితో స్వింగ్ రాబట్టడంతో పాటు డెత్ ఓవర్లలో యార్కర్లతో 35 ఏళ్ల ఈ లెఫ్టామ్ పేసర్ బ్యాటర్లను బెంబేలెత్తించగలడు. 2012లో టీ20 అరంగేట్రం చేసిన తను కెరీర్‌లో ఆడిన 65 మ్యాచ్‌ల్లో 79 వికెట్లు తీశాడు. అలాగే ఇప్పటిదాకా జరిగిన ఆరు టీ20 వరల్డ్‌కప్‌ల్లో తను ఐదింటిలో ఆడడం విశేషం. గతేడాది జరిగిన మెగా టోర్నీలో ఆసీస్ తరఫున చివరిసారి పాల్గొన్నాడు. అలాగే 2021 టీ20 వరల్డ్‌కప్‌లో ఆసీస్‌ను విజేతగా నిలపడంలోనూ స్టార్క్ కీలక పాత్ర పోషించాడు. 'టెస్టు క్రికెట్‌కే నా ప్రాధాన్యత. అలాగే ఆసీస్ తరఫున ఆడిన ప్రతీ టీ20 మ్యాచ్‌ను ఆస్వాదించాను. ముఖ్యంగా 2021 టీ20 వరల్డ్‌కప్‌ను మరింత బాగా ఎంజాయ్ చేశాను. ఇక భారత్‌లో ఐదు టెస్టుల సిరీస్, యాషెస్, వన్డే వరల్డ్‌కప్ ఇలా బిజీ షెడ్యూల్ ముందుంది. వీటి కోసం ఫిట్‌గా ఉండాలనుకుంటున్నాను. అలాగే వచ్చే ఏడాది టీ20 వరల్డ్‌కప్ ఉండడంతో యువ బౌలర్లను ఎంపిక చేసుకునేందుకు తగిన సమయం ఇవ్వాలనే ఆలోచనతో రిటైర్ అవుతున్నా' అని స్టార్క్ పేర్కొన్నాడు. మరోవైపు ఫ్రాంచైజీ క్రికెట్‌పై ఎలాంటి ప్రకటనా చేయకపోవడంతో ఐపీఎల్, బిగ్‌బాష్ లీగ్‌ల్లో కొనసాగే అవకాశం ఉంది.

భారత్‌తో సిరీస్‌కు కమిన్స్ దూరం



సిడ్నీ: వెన్నునొప్పితో బాధపడుతున్న ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ భారత్, న్యూజిలాండ్ దేశాలతో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌లకు దూరం కానున్నాడు. వచ్చే నెలలో మూడు టీ20ల సిరీస్ కోసం ఆసీస్ జట్టు కివీస్ పర్యటనకు వెళ్లనుంది. ఆ తర్వాత స్వదేశంలో భారత్‌తో మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. అయితే నవంబరులో ఇంగ్లండ్‌తో జరిగే యాషెస్ సిరీస్‌లో కమిన్స్ ఆడే అవకాశం ఉందని క్రికెట్ ఆస్ట్రేలియా పేర్కొంది. జూలైలో వెస్టిండీస్‌తో జరిగిన మూడో టెస్టులో తను చివరిసారి ఆడాడు.

కామన్వెల్త్ ఆతిథ్యం కోసం భారత్‌తో నైజీరియా పోటీ

న్యూఢిల్లీ: 2030 కామన్వెల్త్ క్రీడలను నిర్వహించాలనుకొంటున్న భారత్‌కు గట్టిపోటీ ఎదురైంది. ఆఫ్రికా దేశం నైజీరియా కూడా ఆతిథ్య హక్కుల కోసం బిడ్ దాఖలు చేసింది. ఆగస్టు 31తో ముగిసిన డెడ్‌లైన్‌లోపు భారత్, నైజీరియా బిడ్‌లు దాఖలు చేసినట్టు కామన్వెల్త్ స్పోర్ట్స్ ఓ ప్రకటనలో తెలిపింది. ఇరు దేశాల బిడ్డింగ్‌ల పరిశీలనకు కమిటీని నియమించి.. నిర్ణయం తీసుకోనున్నట్టు పేర్కొంది.

దక్షిణాఫ్రికా బోణీ

ఇంగ్లండ్‌తో తొలి వన్డే


కేశవ్ (4/22)

లీడ్స్: ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో దక్షిణాఫ్రికా జట్టు ఏడు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తద్వారా 3 వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. స్పిన్నర్ కేశవ్ మహరాజ్ (4/22), పేసర్ ముల్డర్ (3/33)ల ధాటికి ఇంగ్లండ్ 24.3 ఓవర్లలో 131 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ జేమీ స్మిత్ (54) మాత్రమే రాణించాడు. ఆ తర్వాత ఛేదనలో దక్షిణాఫ్రికా 20.2 ఓవర్లలో 137/3 స్కోరుతో నెగ్గింది. ఓపెనర్ మార్‌క్రమ్ (86), రికెల్టన్ (31 నాటౌట్) తొలి వికెట్‌కు 121 పరుగుల భాగస్వామ్యంతో విజయాన్నందించారు. స్పిన్నర్ రషీద్‌కు మూడు వికెట్లు దక్కాయి.

స్పాన్సర్‌షిప్ వేటలో బీసీసీఐ



బిడ్ దాఖలుకు ఈనెల 16 తుది గడువు

గేమింగ్, బెట్టింగ్ కంపెనీలపై నిషేధం

న్యూఢిల్లీ: టీమిండియా ప్రధాన స్పాన్సరర్ కోసం బీసీసీఐ ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఆసక్తిగల కంపెనీలు బిడ్డింగ్ ప్రక్రియలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించింది. ఇటీవల ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ చట్టం అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పటిదాకా జట్టు స్పాన్సర్‌గా ఉన్న డ్రీమ్ 11 తమ ఒప్పందాన్ని మరో ఏడాది ఉండగానే రద్దు చేసుకోవాల్సివచ్చింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే బోర్డు కొత్త స్పాన్సర్‌ను ఎంపిక చేయనుంది. దీనిలో భాగంగా ఆన్‌లైన్, గ్యాంబ్లింగ్, బెట్టింగ్, క్రిప్టో కరెన్సీ, ఆల్కహాల్, పోర్నోగ్రఫీలతో ప్రత్యక్ష లేక పరోక్ష సంబంధం ఉన్న కంపెనీలకు అనుమతి లేదు. కంపెనీపై, యజమానులపై ఎలాంటి క్రిమినల్ కేసులూ ఉండరాదు. ఆర్‌బీఐ జాబితాలో ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా ఉండకూడదు. మూడేళ్ల కాలంలో కంపెనీ సగటు టర్నోవర్ కనిష్ఠంగా రూ.300 కోట్లు ఉండాలి. ఇలా ఈ నిబంధనల్ని పాటించే కంపెనీలు మాత్రమే ఈనెల 16లోగా దరఖాసు చేసుకోవాలని తేల్చి చెప్పింది. ఈనేపథ్యంలో 9 నుంచి ఆరంభమయ్యే ఆసియాకప్ టోర్నీలో భారత జట్టు జెర్సీపై స్పాన్సర్ పేరు లేకుండానే బరిలోకి దిగే అవకాశం ఉంది.

ఆసిఫ్ ఆలీ రిటైర్మెంట్



లాహోర్: పాకిస్థాన్ మిడిలార్డర్ బ్యాటర్ ఆసిఫ్ అలీ అంతర్జాతీయ క్రికెట్‌కు ముగింపు పలికాడు. పాక్ తరఫున అతడు 21 వన్డేల్లో మూడు అర్ధసెంచరీలతో 382 పరుగులు, 58 టీ20ల్లో 577 పరుగులు సాధించాడు. అయితే దేశవాళీ, ఫ్రాంచైజీ క్రికెట్‌లో మాత్రం కొనసాగుతానని ప్రకటించాడు. రెండేళ్ల క్రితం చివరి టీ20 ఆడిన 33 ఏళ్ల ఆసిఫ్ 2019 వన్డే వరల్డ్‌కప్‌తో పాటు 2021, 2022 టీ20 వరల్డ్‌కప్‌ల్లో పాక్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు.

సెమీస్‌కు పెగుల



పెగుల

క్వార్టర్స్‌లో సినర్, ఒసాక యూఎస్ ఓపెన్

న్యూయార్క్: గతేడాది రన్నరప్, నాలుగో సీడ్ జెస్సికా పెగుల వరుసగా రెండోసారి యూఎస్ ఓపెన్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో లోకల్ స్టార్ పెగుల 6-3, 6-3తో చెక్ భామ బార్బరా క్రెజికోవాపై వరుస సెట్లలో సునాయాసంగా నెగ్గింది. తొలి సెట్ రెండో గేమ్‌లోనే క్రెజికోవా సర్వీస్‌ను బ్రేక్ చేసిన పెగుల 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే, క్రమంగా పుంజుకొన్న బార్బరా ఏడో గేమ్‌లో పెగుల సర్వీస్‌ను బ్రేక్ చేసి 3-4తో సమం చేసేలా కనిపించింది. కానీ, మరోసారి బ్రేక్ పాయింట్ సాధించిన పెగుల సెట్‌ను తన ఖాతాలో వేసుకొంది. ఇక రెండో సెట్ మొదటి గేమ్‌లోనే క్రెజికోవాకు చెక్ చెప్పిన జెస్సికా 2-0తో ముందంజ వేసింది. ఐదో గేమ్‌లో మరో బ్రేక్ పాయింట్‌తో పెగుల 4-1తో ఆధిక్యం సాధించింది. అయితే, ఆరో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన క్రెజికోవా 3-4తో పోటీలోకి వచ్చేలా కనిపించింది. ఆ తర్వాతి గేమ్‌లో సర్వీస్‌ను నిలబెట్టుకొన్న అమెరికా ప్లేయర్.. 9వ గేమ్‌లో క్రెజికోవా మరోసారి బ్రేక్ చేసి సెట్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకొంది.

గాఫ్‌కు ఒసాక షాక్: ప్రీ క్వార్టర్స్‌లో డిఫెండింగ్ చాంప్ యానిక్ సినర్ 6-1, 6-1, 6-1తో అలెగ్జాండర్ బబ్లిక్ (కజకిస్థాన్)ను వరుస సెట్లలో మట్టికరిపించాడు. కాగా, 10వ సీడ్ లొరెంజో ముసెట్టి (ఇటలీ) 6-3, 6-0, 6-1తో జేమ్ మునార్‌పై గెలిచాడు. క్వార్టర్స్‌లో ముసెట్టితో సినర్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. మహిళల సింగిల్స్‌లో మూడో సీడ్ కోకో గాఫ్‌కు నవోమి ఒసాక షాకిచ్చింది. రౌండ్-16లో 23వ సీడ్ ఒసాక 6-3, 6-2తో గాఫ్‌పై అలవోకగా గెలిచింది. 8వ సీడ్ అమండా అనిసిమోవా 6-0, 6-3తో బియాట్రిజ్ హడాడ్‌పై, 11వ సీడ్ కరోలినా ముచోవా 6-3, 6-7(0), 6-3తో మర్టా కోస్త్యుక్‌పై నెగ్గారు. రౌండ్-8లో ముచోవాతో ఒసాక తలపడనుంది. మహిళల డబుల్స్‌లో వీనస్ విలియమ్స్-లైలా ఫెర్నాండెజ్ జోడీ 6-3, 6-4తో ఎకటరీనా అలెగ్జాండ్రోవా-జాంగ్ షుయ్‌పై గెలిచింది.



సినర్

ప్రణవ్ ఖాతాలో ఫుజైరా టైటిల్



ఫుజైరా (యూఏఈ): ఫుజైరా గ్లోబల్ సూపర్ స్టార్స్ చెస్ టైటిల్‌ను ప్రపంచ జూనియర్ చాంపియన్ ప్రణవ్ వెంకటేష్ కైవసం చేసుకున్నాడు. మంగళవారం జరిగిన ఆఖరిదైన తొమ్మిదో రౌండ్‌లో స్పెయిన్ జీఎం అలాన్ పిచోట్‌ను బెంగళూరు జీఎం ప్రణవ్ ఓడించాడు. ఈ విజయంతో ప్రణవ్ ఏడు పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి, టైటిల్ దక్కించుకున్నాడు. ఈ టోర్నీలో ప్రణవ్ ఐదు విజయాలు, నాలుగు డ్రాలతో అజేయంగా నిలిచాడు.

స్విస్ బరిలో అర్జున్, ప్రజ్ఞానంద

సమర్‌కండ్ (ఉజ్బెకిస్థాన్): అర్జున్ ఇరిగేసి, ప్రజ్ఞానంద.. ఫిడే గ్రాండ్ స్విస్ టోర్నీలో మెరుగైన ప్రదర్శనతో క్యాండిడేట్స్ టోర్నీ బెర్త్‌ను ఖరారు చేసుకోవాలనుకొంటున్నారు. గురువారం నుంచి జరిగే ఈ టోర్నీలో వరల్డ్ చాంపియన్ గుకేష్‌తోపాటు హరికృష్ణ, నిహాల్ సరీన్, ప్రణవ్ వెంకటేష్ కూడా బరిలో నిలవనున్నారు. కాగా, వైల్డ్ కార్డ్ దక్కించుకొన్న మహిళల వరల్డ్‌కప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ ఓపెన్ కేటగిరిలో తలపడనుంది. హంపి ఈ టోర్నీకి దూరం కాగా.. మహిళల విభాగంలో హారిక, వైశాలి, వంతిక బరిలో ఉన్నారు.

అథ్లెట్ పర్వేజ్ ఖాన్‌పై నిషేధం

న్యూఢిల్లీ: భారత మిడిల్ డిస్టెన్స్ రన్నర్ పర్వేజ్ ఖాన్‌పై ఆరేళ్ల నిషేధం విధించారు. పర్వేజ్ నిషేధిత ఎరిత్రోపాయిటిన్ ఉపయోగించి పాజిటివ్‌గా తేలాడు. అలాగే 2023లో మూడుసార్లు డోప్ టెస్టుకు అందుబాటులో లేడు. దీంతో ఈ రెండు అతిక్రమణలకు కలిపి ఆరేళ్ల నిషేధం విధించారు.



ఢిల్లీ-బెంగళూరు మ్యాచ్ దృశ్యం

బుల్స్‌పై దబాంగ్ గెలుపు

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-12లో దబాంగ్ ఢిల్లీ శుభారంభం చేసింది. మంగళవారం ఇక్కడి పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 41-34 స్కోరుతో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడిన దబాంగ్ ఢిల్లీ ఆటగాళ్లు పూర్తిస్థాయిలో ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ప్రథమార్ధంలో బెంగళూరు బుల్స్‌ను వరుసగా రెండుసార్లు ఆలౌట్ చేశారు. దబాంగ్ రైడర్లను నిలువరించడంలో బుల్స్ డిఫెండర్లు విఫలమయ్యారు. దీంతో తొలి భాగంలో ఢిల్లీ 21-11 స్కోరుతో ఆధిక్యంలో ఉంది. ద్వితీయార్ధంలో బెంగళూరు అనూహ్యంగా పుంజుకుని పోటీనిచ్చింది. అయితే అప్పటికే పూర్తి ఆధిక్యంతో ఉన్న దబాంగ్ ఆటగాళ్లు మ్యాచ్ చివరి నిమిషాలలో వ్యూహాత్మకంగా ఆడి సీజన్‌లో తొలి విజయాన్ని నమోదు చేశారు. దబాంగ్ రైడర్లు ఆషు మాలిక్ 17 పాయింట్లు, నీరజ్ నర్వాల్ రెండు బోనస్‌లతో 7 పాయింట్లు రాబట్టారు. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 39-36 పాయింట్ల తేడాతో పట్నా పైరేట్స్‌ను ఓడించింది.

కొడంగల్ వైద్య కళాశాలకు అనుమతులు

» 50 ఎంబీబీఎస్ సీట్లకు ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రభుత్వ వైద్య కళాశాలకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతులు మంజూరు చేసింది. 50 ఎంబీబీఎస్ సీట్లతో కళాశాలను ప్రారంభించుకునేందుకు పచ్చ జెండా ఊపింది. ఈ మేరకు మంగళవారం అధికారికంగా సమాచారం ఇచ్చింది. ఈ ఏడాది నుంచే అడ్మిషన్లు మొదలుకానున్నాయి. కొడంగల్ కాలేజీకి అనుమతులు రావడంతో తెలంగాణలో ప్రభుత్వ వైద్య కళాశాలల సంఖ్య 35కు, వాటిలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 4,100కు పెరిగింది. గత ఏడాది 8 కాలేజీలు, ఈ ఏడాది మరో కాలేజీకి అనుమతులు సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు, వైద్య విద్య సంచాలకులు డాక్టర్ నరేంద్రకుమార్‌ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం 200 పడకల తాండూరు జిల్లా ఆస్పత్రిని బోధనాస్పత్రిగా చూపించి కొడంగల్ వైద్య కళాశాలకు అనుమతులు పొందింది. మాతాశిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)లో పడకలను కూడా కలిపితే మొత్తం 320 పడకలు అవుతాయని పేర్కొంది. కాలేజీ ఏర్పాటుకు అవసరమైన పడకల సంఖ్య, ఓపీ, ఐపీ ఉండటంతో ఎన్ఎంసీ అనుమతులు మంజూరు చేసింది. తాండూరులోనే నర్సింగ్ కాలేజీ కోసం నిర్మించిన భవనాలను ప్రస్తుతానికి వైద్య కళాశాల కోసం వినియోగించనున్నారు. ప్రభుత్వం వైద్య కళాశాల, బోధనాస్పత్రికి శాశ్వత భవన నిర్మాణాల కోసం తాండూరు-కొడంగల్ మధ్య అప్పాయపల్లిలో 20 ఎకరాల భూమిని కేటాయించింది. ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్లలో ప్రభుత్వ ఆధ్వర్యంలో కొత్తగా 30 వైద్య కళాశాలలు ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం జిల్లాకు ఒక వైద్య కళాశాల అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర ఏర్పాటుకు ముందే తెలంగాణలో 5 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉన్నాయి.

5న జీపీవోలకు నియామక పత్రాలు

» సీఎం చేతులు మీదుగా 5000 మందికి అందజేత

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నియమితులైన 5000 మంది గ్రామ పాలనాధికారుల (జీపీవో)కు ఈనెల 5న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేస్తారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన చెప్పా రు. సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివా‌స్‌రెడ్డి, ఇతర మంత్రు లు హాజరవుతారని పేర్కొన్నారు. వివిధ జిల్లాల నుంచి ఎంపికైన జీపీవోలు మధ్యాహ్నం 2 గంటలలోపు హైటెక్స్‌కు చేరుకునేలా ప్రత్యేకంగా 120 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామని కె.రామకృష్ణారావు వెల్లడించారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం సంబంధిత కార్యదర్శులతో సచివాలయంలో సీఎస్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

సీపీఎస్ రద్దుకు కమిటీని నియమించండి

సీపీఎస్ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసే దిశగా 6 నెలల కాల వ్యవధితో కమిటీని నియమించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాత పింఛను పునరుద్ధరణ చేసే దిశగా ప్రభుత్వం చొరవ తీసుకుని రెండున్నర లక్షల మంది ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరామని మంగళవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. రాబోయే 60 సంవత్సరాల్లో ప్రభుత్వానికి, ఉద్యోగులకు జరిగే ఆర్థిక నష్టాన్ని, పాత పింఛను పునరుద్ధరణ వల్ల ప్రభుత్వానికి, ఉద్యోగులకు కలిగే మేలును వివరిస్తూ నివేదిక అందజేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం చొరవ తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ నివేదికను ఉపసంఘం ఛైర్మన్ భట్టి విక్రమార్కకు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్ల'కు సిమెంటు, స్టీలు చౌకగా ఇవ్వండి

» పరిశ్రమల యజమానులకు డిప్యూటీ సీఎం భట్టి వినతి



హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల భారీ సంక్షేమ పథకాన్ని విజయవంతం చేయడంలో సిమెంటు, స్టీలు పరిశ్రమలు భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన సిమెంటు, స్టీలు పరిశ్రమల యజమానులు, అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రాష్ట్రంలోని స్టీలు, సిమెంటు పరిశ్రమలను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామని, మానవీయ కోణంలో ఆలోచించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి స్టీలు, సిమెంటు ధరలను తగ్గించి ఇవ్వాలని కోరారు. పెద్ద, చిన్న అనే అంతరం లేకుండా కంపెనీలన్నీ ఒకే ధరకు సిమెంటు, స్టీలును సరఫరా చేయాలన్నారు. ఏపీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రభుత్వ పథకాలకు సిమెంటు కంపెనీలు అందిస్తున్న ధరను సమావేశంలో మంత్రులు సమీక్షించారు. 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సుమారు 50 లక్షల మెట్రిక్ టన్నుల సిమెంటు, 27.75 లక్షల మెట్రిక్ టన్నుల స్టీలు అవసరమవుతుందని అధికారులు పరిశ్రమల యజమానులకు వివరించారు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో వీలైనంత త్వరగా సమావేశమై ధరలను ఫైనల్ చేస్తామని స్టీలు, సిమెంటు పరిశ్రమల యాజమాన్యాల ప్రతినిధులు తెలిపారు.



వైద్య కాలేజీ హాస్టల్ భవనాలను ప్రారంభిస్తున్న దామోదర , పొంగులేటి

త్వరలో జిల్లా కేంద్రాల్లో క్యాన్సర్ కేర్ సెంటర్లు

» జాతీయ రహదారుల వెంట 'ట్రామాకేర్'లు

» వైద్య, ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహా

» మహబూబాబాద్‌లో వైద్య కళాశాల హాస్టళ్లను ప్రారంభించిన రాజనర్సింహ, పొంగులేటి, సురేఖ

మహబూబాబాద్, జనగామ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో క్యాన్సర్ కేర్ సెంటర్లు, జాతీయ రహదారుల వెంట ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రతి జిల్లా ఆస్పత్రిలో సీటీస్కాన్, ఎంఆర్ఐ అవసరమని వాటి ఏర్పాటుకు కూడా కృషి చేస్తామన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రూ. 186 కోట్లతో నిర్మించిన వైద్యకళాశాల బాలుర, బాలికల హాస్టళ్లను, 50 పడకల క్రిటికల్ కేర్ సెంటర్ భవనాలను మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ మంగళవారం ప్రారంభించారు. అలాగే, జనగామ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సీటీ స్కాన్ మిషన్‌ను రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ... వైద్య విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు, వారి సమస్యల పరిష్కారానికిప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు.

ఏపీకి బదిలీ అయిన శివశంకర్ లోతేటి

వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి శివశంకర్ లోతేటిని తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు బదిలీ చేసింది. కేంద్ర శిక్షణ, సిబ్బంది వ్యవహారాల శాఖ (డీవోపీటీ) ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. శివశంకర్‌ను ఆంధ్రప్రదేశ్‌కు రిలీవ్ చేయాలని కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్) గతంలో ఆదేశించిన విషయం తెలిసిందే.

6000 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం మరో 6000 కోట్ల అప్పు తీసుకుంది. ఆర్బీఐ నిర్వహించిన ఈ-వేలం ద్వారా రుణాన్ని సేకరించింది. 26 ఏళ్ల కాల పరిమితి, 7.74 శాతం వార్షిక వడ్డీతో రూ.1500 కోట్లు, 30 ఏళ్ల కాల పరిమితి, 7.74 శాతం వార్షిక వడ్డీతో రూ. 1500 కోట్లు, 32 ఏళ్ల కాల పరిమితి, 7.72 శాతం వార్షిక వడ్డీతో రూ.1500 కోట్లు, 38 ఏళ్ల కాల పరిమితి, 7.72 శాతం వార్షిక వడ్డీతో రూ.1500 కోట్ల చొప్పున ఈ రుణాన్ని సేకరించింది.

77 మంది ఏఈఈలకు పదోన్నతి

నీటిపారుదల శాఖలో 77 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఏఈఈ)లకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (డీఈఈ)లుగా పదోన్నతి కల్పించి, పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీరికి పోస్టింగ్ ఇస్తూ నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు.

లంచం కేసులో ఇద్దరు కస్టమ్స్ అధికారుల అరెస్టు

లంచం కేసులో ఇద్దరు సీనియర్ కస్టమ్స్ అధికారులను అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీబీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ జీఎస్టీ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు అధికారులు రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ నుంచి పెండింగ్‌లో ఉన్న పే ప్యారిటీ బిల్లు విడుదల చేయడానికి లంచం డిమాండ్ చేశారు. మొదట రూ. ముప్పై వేలు, తర్వాత చర్చల అనంతరం రూ. 25 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దాంతో సీబీఐ చేసిన 'ట్రాప్ ఆపరేషన్'లో లంచం స్వీకరిస్తూ ఉండగా ఆ ఇద్దరు అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశామని సీబీఐ అధికారులు తెలిపారు.

వయోధిక పాత్రికేయులకు పెన్షన్ ఇవ్వండి

» మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డికి విజ్ఞప్తి

తమకు పెన్షన్ పథకం అమలు చేయాలని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డికి వయోధిక పాత్రికేయులు విజ్ఞప్తి చేశారు. కొన్ని రాష్ట్రాల్లో జర్నలిస్టులకు కల్పిస్తున్న పెన్షన్, ఇతర వసతుల వివరాలను ఆయనకు వివరించారు. రాష్ట్రంలోనూ ఆయా వసతులు అమలయ్యేలా చూడాలని కోరారు. ఇదే విషయమై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌ను కలిసిన రిటైర్డు జర్నలిస్టులు.. అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు పెన్షన్, ఇళ్ల స్థలాలు, వైద్య వసతులు కల్పిస్తామని చేసిన వాగ్దానాలను గుర్తు చేశారు. ఈ విషయాన్ని సర్కారు దృష్టికి తీసుకెళ్లి.. వాటి అమలుకు కృషి చేస్తామని తమకు మహేశ్ గౌడ్ హామీ ఇచ్చారని వెల్లడించారు. సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ సీహెచ్ ప్రియాంకను కలిసి.. వివిధ రాష్ట్రాల్లో జర్నలిస్టులకు వసతులు కల్పిస్తూ జారీ చేసిన జీవో ప్రతులను అందజేశారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు.

ప్రాణహిత కట్టి తీరుతాం

(మొదటిపేజీ తరువాయి)



వైఎస్ మెమోరియల్ అవార్డు -2025 కార్యక్రమంలో పాల్గొన్న సీఎంరేవంత్, భట్టి, షర్మిల, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, కేవీపీ రామచంద్రరావు తదితరులు

సుమారు 3.6 లక్షల ఎకరాలకు సాగునీరు, ఫ్లోరైడ్ పీడిత నల్లగొండ జిల్లాలో ప్రజలకు తాగునీటిని అందించేందుకు ప్రతిపాదించిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం దసపల్లా హోటల్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రేవంత్.. సుభాష్ పాలేకర్, డాక్టర్ సిసుధ, డాక్టర్ సి.నాగేశ్వరరావుకు డాక్టర్ వైఎస్.రాజశేఖర రెడ్డి మెమోరియల్ అవార్డు- 2025ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. సీఎంగా వైఎస్ తొలి సంతకం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఫైల్ పైనే చేశారని గుర్తుచేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలకు రూపకల్పన చేశారన్నారు. వైఎస్ ఆలోచలనకు అనుగుణంగా పని చేస్తున్న తమ ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాజశేఖర్‌రెడ్డి 2009లో రెండోసారి సీఎంగా ఎన్నికైన వెంటనే గాంధీభవన్‌కు వెళ్లి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారన్ని గుర్తు చేశారు. అందరి సహకారంతో రాహుల్‌ను ప్రధానిగా చేసే లక్ష్యంతో తాము పని చేస్తున్నట్టు తెలిపారు. సుభాష్ పాలేకర్ సూచించినట్టుగా.. ఎరువుల కొరతకు ఆస్కారం లేకుండా సేంద్రియ వ్యవసాయ విధానంపై ప్రణాళికలు రూపొందించనున్నట్టు తెలిపారు. రసాయన ఎరువుల వినియోగంతో ఒక్కో గ్రామం సుమారు రూ.4.24 కోట్ల మేరకు వైద్యం, తదితర అవసరాలకు వ్యయం చేయాల్సి వస్తోందనే అంశాన్ని ఉటంకిస్తూ.. రాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయంపై దృష్టి కేంద్రీకరిస్తామన్నారు.

అధికారం ఉంటేనే మిత్రులు..

సమకాలీన రాజకీయాల్లో అధికారం ఉన్నపుడు అనేక మంది మిత్రులుగా వస్తారని, అధికారం పోయాక మాయం అవుతారని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కానీ.. చదువుకునే రోజుల నుండి మరణం వరకూ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి డాక్టర్ కేవీపీ రామచంద్ర రావు తోడు నీడగా నిలబడ్డారని ఆయన గుర్తుచేశారు. "కేవీపీలాగా ఉంటామంటూ కొంత మంది నా దగ్గరకు వస్తున్నారు.. వారిని మొదటి వారం లోపలికి రానిస్తే, రెండో వారం నా కుర్చీలో కూర్చుని 'నేనే అంతా నడుపుతాలే' అంటున్నారు" అని చెప్పి నవ్వులు పూయించారు. కేవీపీలా ఉంటామంటూ తనవద్దకు వచ్చినవారికి.. "మీరెప్పటికీ ఆయనలా కాలేరు.. అలాంటి ఆలోచన సైతం చేయవద్దు" అని సూచించినట్టు రేవంత్ తెలిపారు. 1978లో ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన వైఎస్.. ఆ తర్వాత ఎమ్మెల్యేగా, ఎంపీగా ఎన్నికైనప్పటికీ ఆయనకు పదవులు దక్కలేదని, అనేక సమస్యలను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ఆ సమయంలో ఆయన వెన్నంటి ఉన్న కేవీపీ.. వైఎస్ తప్పులను తన ఖాతాలో వేసుకుని, మంచిని వైఎస్ ఖాతాలో వేసి ఆయనకు ఆత్మలా పనిచేశారన్నారు. సర్వం త్యాగం చేయగల గుణం, సమస్యలను ఎదుర్కొనే శక్తి కేవీపీకి ఉందన్నారు. సభలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న హరియాణా మాజీ ముఖ్యమంత్రి భూపేంద్ర సింగ్ హుడా వైఎస్‌ను ప్రశంసించారు. రైతుల సమస్యలను పాదయాత్ర సమయంలో తెలుసుకున్న వైఎస్.. అధికారంలోకి రాగానే వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని కొనియాడారు. ఇక.. వైఎస్‌తో కలిసి పనిచేయడం తనకు గర్వకారణమని డిప్యూటి సీఎం మల్లుభట్టి విక్రమార్క అన్నారు. వ్యవసాయానికి ఏడుగంటల ఉచిత విద్యుత్ సాధ్యం కాదని అప్పట్లో అధికారులు అన్నప్పటికీ.. వైఎస్ ఆ పథకాన్ని అమలుచేసి రైతుబాంధవుడిగా నిలిచారని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. పాలనలో సంస్కరణల ద్వారా రాజశేఖర్‌రెడ్డి ప్రజల హృదయాలపై చెరగని ముద్ర వేశారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు. కాగా... ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి, డాక్టర్ కేవీపీ రామచంద్రరావు, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్. షర్మిల, ఎమ్మెల్సీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు నేడో, రేపో ప్రత్యేక జీవో!

» రిజర్వేషన్ బిల్లుపై నిర్ణయం తీసుకోని గవర్నర్

» జీవోలతో 42% రిజర్వేషన్లు కల్పించి, స్థానిక ఎన్నికలకు వెళ్లే యోచనలో ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేటాయించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేయనుంది. అందుకు అవసరమైన కసరత్తును పూర్తిచేసినట్లు విశ్వసనీయ సమాచారం. నేడో, రేపో జీవోలను విడుదల చేయనున్నట్లు తెలిసింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేటాయించేందుకు 2018 పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285(ఏ)ను సవరిస్తూ ప్రవేశపెట్టిన బిల్లును శాసనసభ ఆమోదించింది. వెంటనే బిల్లును గవర్నర్ ఆమోదం కోసం పంపించారు. కానీ, గవర్నర్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో సోమవారం కాంగ్రెస్ నేతృత్వంలో అఖిలపక్ష నేతలు వెళ్లి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసి, బిల్లును ఆమోదించాలని కోరారు. అయినా, మంగళవారం రాత్రి వరకు కూడా రాజ్‌భవన్ నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ప్రత్యేక జీవోలతో బీసీలకు రిజర్వేషన్లను కల్పిస్తూ స్థానిక ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిసింది. కాగా, రాష్ట్రంలో నిర్వహించిన కుల సర్వేలో తేలిన జనాభా ఆధారంగా.. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో వెనకబడిన తరగతుల వారికి కేటాయించాల్సిన రిజర్వేషన్లను ఖరారు చేయనున్నట్లు సమాచారం. ఈ నెల 30లోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశాల నేపథ్యంలోనే ప్రత్యేక జీవోల జారీకి నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

విద్యారంగానికి సర్కార్ ప్రాధాన్యం: అడ్లూరి



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కార్పొరేట్ స్థాయి సదుపాయాలతో గురుకులాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ ఆసిఫ్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ, బాలుర వసతి గృహాన్ని మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రూ.8.75 కోట్ల వ్యయంతో భవనాన్ని నిర్మించామని, ఇందులో 160 మంది విద్యార్థులకు ఆధునిక విద్యా, వసతి సదుపాయాలు అందిస్తున్నట్లు చెప్పారు.

సత్ప్రవర్తన కల జీవిత ఖైదీలకు క్షమాబిక్ష పెట్టండి

» గాంధీ జయంతి నాడు విడుదల చేయండి

» సీఎం రేవంత్ రెడ్డికి జీవిత ఖైదీల కుటుంబ సభ్యుల విజ్ఞప్తి

పంజాగుట్ట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో చేసిన తప్పుకు యావజ్జీవ ఖైదుననుభవిస్తున్న వారిలో సత్ప్రవర్తన కల వారికి క్షమాభిక్ష ప్రసాదించాలని సీఎం రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి జీవిత ఖైదీల కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. క్షమాభిక్షతో గాంధీ జయంతి నాడు వారిని విడుదల చేసి, తమ జీవితాల్లో వెలుగు ప్రసాదించాలని సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో వేడుకున్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో జీవిత ఖైదీల కుటుంబ సభ్యులు స్వప్న, బీచుపల్లి, ఎం.డి.షరీఫ్, రాజేశ్, అనిల్ కుమార్ తదితరులు మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పుకు తమ కుటుంబ పెద్దలు, సభ్యులు యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్నారని చెప్పారు. వారిలో సత్ప్రవర్తనతో జైలు జీవితం గడుపుతున్న వారిలో 60 ఏళ్ల పైబడిన వారు, తమ పనులు తాము చేసుకోలేక.. చేసిన తప్పుకు పశ్చాతాపంతో కుమిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎంతో నష్టపోయిన తమ జీవితాలు దుర్భరమయ్యాయన్నారు. ఖైదీల పరిస్థితి ఒకలా ఉంటే, వారిపై ఆధారపడ్డ వారి పరిస్థితి మరింత దారుణం, దయనీయమైందని వాపోయారు. భర్తకు భార్య, తండ్రికి పిల్లలు, కొడుకు దూరమైన వృద్ధ తల్లిదండ్రులు నరక యాతన అనుభవిస్తున్నట్లు తెలిపారు. మానవతా దృక్పథంతో గాంధీ జయంతి సందర్భంగా తమ వారికి క్షమాభిక్ష ప్రసాదించి, సాధారణ జీవితం కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. పదేళ్ల శిక్ష పూర్తి చేసుకున్న ఖైదీలను క్షమాభిక్షతో విడుదల చేయాలని కోరారు.

'కాళేశ్వరం' అవినీతిపరులకు శిక్ష తప్పదు: దుద్దిళ్ల



షాద్‌నగర్/నందిగామ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడిన వారికి శిక్ష తప్పదని ఐటీ శాఖ మంత్రి, తెలంగాణ బాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కాళేశ్వరం అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగించనున్నట్లు ప్రకటించిందని, కేంద్ర దర్యాప్తు సంస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని చెప్పారు. రంగారెడ్డి జిల్లాలోని కన్హా శాంతి వనంలో అంతరాష్ట్ర బాల్ బాడ్మింటన్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా, అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతిని తేల్చేందుకు కేసును సీబీఐకి అప్పగిస్తే బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ అగ్రనేతలపై ఆరోపణలు చేయడం వారి కుటుంబ అంతర్గత విషయమని పేర్కొన్నారు.

గిరిజన గ్రామంలో.. ఇందిరమ్మ ఇళ్ల పండుగ

» పైలట్ గ్రామంలో నేడు గృహప్రవేశ ఉత్సవం

» భద్రాద్రి జిల్లా బెండాలపాడులో కార్యక్రమం

» ఇళ్ల ప్రారంభోత్సవం చేయనున్న సీఎం



సీఎం సమక్షంలో గృహప్రవేశం చేయనున్న ఇందిరమ్మ ఇళ్లు

కొత్తగూడెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అది మారుమూల ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామం. అంతా ఏళ్ల తరబడి గుడిసెల్లో జీవనం సాగిస్తున్న గిరిజనులే. పక్కా ఇళ్లు కట్టుకునే స్తోమతలేని వీరంతా ఇప్పుడు 'ఇందిరమ్మ ఇంటివారు' అవుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా గృహప్రవేశ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో బెండాలపాడు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేసింది. మండలం మొత్తానికి 968 ఇళ్లను మంజూరు చేయగా.. ఇందులో బెండాలపాడుకే 310 ఇళ్లను కేటాయించారు. వాటిలో 58 ఇళ్ల స్లాబులు పూర్తికాగా, 86 ఇళ్లు రూఫ్ లెవల్, 150 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయి. రాష్ట్రంలోనే అతి తక్కువ కాలంలో అత్యధిక ఇళ్లను పూర్తి చేసిన గ్రామం ఇదే. కాగా, బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఈ గ్రామానికి వచ్చి ఇళ్లను ప్రారంభించనున్నారు. హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 2.20 గంటలకు సీఎం బెండాలపాడుకు చేరుకుంటారు. గ్రామంలోని బచ్చల నర్సమ్మ, బచ్చల రమణ అనే లబ్ధిదారులకు చెందిన ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొంటారు. పలువురు లబ్ధిదారులతో మాట్లాడతారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పైలాన్‌ను ప్రారంభిస్తారు. ఆ తర్వాత దామరచర్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

గిరిజనగ్రామానికి చారిత్రక ఘట్టం:పొంగులేటి


మారుమూల గిరిజన ప్రాంతమైన బెండాలపాడుకు ముఖ్యమంత్రి రావడం ఒక చారిత్రక ఘట్టమని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇది ఆ గ్రామ ప్రజలకు ఎప్పటికీ గుర్తుండిపోయే రోజు అవుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల ఏర్పాట్లను మంగళవారం మంత్రి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నుంచి గృహనిర్మాణ శాఖను బలోపేతం చేస్తూ, పేదవారికి న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక నుంచి వారి ఖాతాల్లో నిధుల జమ వరకు మొత్తం ప్రక్రియలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నామన్నారు. ఎక్కడైనా అవకతవకలు జరిగితే వెంటనే గుర్తించి, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

నేడు దేవరకద్రకు సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మూసాపేట మండలంలో ఉన్న కార్నింగ్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ యూనిట్ ప్రారంభోత్సవంలో పాల్గొననున్నారు. అనంతరం అక్కడి ముఖ్య కార్యకర్తలతో సమావేశమవుతారు. ఉదయం 11 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మూసాపేటలో కార్యక్రమం అనంతరం భద్రాద్రి కొత్తగూడెం పర్యటనకు వెళ్లనున్నారు.

వ్యూహా ల్యాబ్‌తో సైబర్ నేరాలకు చెక్!

» ట్రిపుల్‌ఐటీ-హెచ్‌తో కలిసి.. ఆవిష్కరించిన డీజీపీ జితేందర్, సీఎస్‌బీ చీఫ్ శిఖాగోయల్



వ్యూహా ల్యాబ్‌ను ఆవిష్కరించిన డీజీపీ జితేందర్, శిఖాగోయల్

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న సైబర్ నేరాలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ పోలీసులు గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ-హెచ్‌తో కలిసి వ్యూహా ల్యాబ్‌ను ఆవిష్కరించారు. ట్రిపుల్ ఐటీ 28వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీజీపీ డాక్టర్ జితేందర్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) చీఫ్ శిఖాగోయల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు సైబర్ ఇన్నోవేషన్ ల్యాబ్-వ్యూహా ల్యాబ్‌తోపాటు.. సైబర్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ అండ్ నెక్స్ట్‌జెన్ టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్ నెట్‌వర్క్(మంథన్)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. సంప్రదాయ నేరాలను సైబర్ నేరాలు అధిగమిస్తున్నాయన్నారు. "గతంలో దోపిడీలు, చోరీలు అధికంగా జరిగేవి. ఇప్పుడు మొత్తం నేరాల్లో 22-25% సైబర్ నేరాలే ఉంటున్నాయి. ఈ నేరాల కట్టడికి తెలంగాణ పోలీసులు ఇతర రాష్ట్రాలకు కూడా సహాయం చేస్తున్నారు. విద్య, పరిశోధన రంగాలకు చెందిన వారిని వ్యూహా ల్యాబ్‌తో అనుసంధానం చేస్తాం" అని వ్యాఖ్యానించారు. శిఖా గోయల్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు వ్యూహా ల్యాబ్ గేమ్‌చేంజర్ అవుతుందని అభిప్రాయపడ్డారు. దేశంలోనే టీజీసీఎస్‌బీ వినూత్న పోలీసింగ్ విభాగం అని పేర్కొంటూ.. తమ బ్యూరో పనితీరును వివరించారు. 2026కల్లా ప్రపంచవ్యాప్తంగా సైబర్‌నేరాల కారణంగా 11.9 ట్రిలియన్ డాలర్ల నష్టం జరగనున్నట్లు అంచనాలున్నాయన్నారు. గత ఏడాది భారత్‌లో రూ.24 వేల కోట్లను సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టారని, అందులో తెలంగాణ పౌరులు నష్టపోయింది రూ.1,900 కోట్లని చెప్పారు. దేశంలో సైబర్ నేరాలు 37% వృద్ధిని నమోదు చేసుకోగా.. తెలంగాణలో 11% తగ్గాయని పేర్కొన్నారు. కాగా.. ట్రిపుల్ ఐటీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పూర్వ విద్యార్థులకు అవార్డులు అందజేశారు. గూగుల్ డీప్‌మైండ్‌లో రిసెర్చ్ ఇంజనీరుగా పనిచేస్తున్న మనీశ్‌జైన్, రూట్జర్స్ రాబర్ట్ వుడ్ జాన్సన్ మెడికల్ స్కూల్ అసోసియేట్ ప్రొఫెసర్ నవీన యనమల ఈ అవార్డులను అందుకున్నారు.

ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరు గిరిజనుల హత్య

» సుకుమా జిల్లాలో మావోల ఘాతుకం

» 3 నెలల్లో 17 మంది హత్య

చర్ల, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి) : డీఆర్‌జీ బలగాలకు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలో మంగళవారం ఇద్దరు గిరిజనులను మావోయిస్టులు హత్య చేశారు. జిల్లాలోని సీర్‌పట్టి పంచాయతీ నందా పార గ్రామవాసులు పదం పొజ్జా (40), పదం దేవేంద్ర (35) అనే కూలీల ఇంటికి మంగళవారం తెల్లవారుజామున వచ్చిన మావోయిస్టులు మాట్లాడటానికి రమ్మని బయటికి పిలిచి కత్తులతో పొడిచి చంపేశారు. డీఆర్‌జీ బలగాలకు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నందునే వారిని హతమార్చామని అక్కడ వదిలిన లేఖలో పేర్కొన్నారు. నందాపార గ్రామం అడవిలోపల ఉండటంతో మంగళవారం సాయంత్రం వరకూ భద్రతా బలగాలు అక్కడికి చేరుకోలేదు. ఇదిలా ఉంటే, ఒకే రోజు ఇద్దరు గ్రామస్తులను మావోయిస్టులు హతమార్చడంతో ఆ ఊరిలో విషాదం నెలకొంది. కాగా, బస్తర్ డివిజన్ పరిధిలో ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ 3 నెలల్లో 9 మంది ప్రభుత్వ టీచర్లతోపాటు 17 మందిని మావోయిస్టులు అంతం చేశారు. దీంతో బస్తర్ పల్లెలు భయంతో వణికిపోతున్నాయి. మరోవైపు బీజాపూర్ అడవుల్లో మంగళవారం ముగ్గురు మహిళలతోపాటు 16 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. పార్టీలో వివిధ హోదాల్లో పని చేస్తున్న వారి వద్ద నుంచి పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.

పుట్టిల్లు పొమ్మంది!



(మొదటిపేజీ తరువాయి)

భావించారు. సోమవారం మీడియా సమావేశంలో హరీశ్‌రావు, సంతోష్‌రావులు అవినీతి అనకొండలంటూ కవిత సంచలన ఆరోపణలు చేశారు. కేసీఆర్‌కు అవినీతి మరక అంటడానికి వారిద్దరే కారణమని ఆరోపించారు. ఆమె వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో తీవ్ర కలకలం రేపాయి. కేటీఆర్ సహా పలువురు ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు సోమవారమే ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కు వెళ్లారు. కవిత తీరుతో పార్టీకి జరిగే నష్టాన్ని కేసీఆర్‌కు వివరించారు. ఆమెతో పార్టీకి ఏమైనా లాభం ఉందా? అని కేసీఆర్ వారిని అడిగినట్లు సమాచారం. లాభం సంగతి అటుంచితే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందని, విపక్షాలకు ఆయుధం ఇచ్చినట్లు అవుతోందని నేతలంతా కేసీఆర్‌కు వివరించారు. పార్టీ నుంచి ఆమెను సాగనంపాల్సిందేనని పట్టుబట్టారు.

అయితే, కేసీఆర్ వెంటనే ఒక నిర్ణయానికి రాలేదని సమాచారం. మంగళవారం ఉదయం మరోమారు ఫామ్‌హౌజ్‌లోనే కీలక నేతలతో భేటీ అయ్యారు. కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు జగదీశ్వర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం వరకు కవిత అంశంపైనే సుదీర్ఘంగా చర్చించారు. వేటు వేస్తే లాభనష్టాలపై బేరీజు వేసుకున్నారు. కవితను సస్పెండ్ చేయని పక్షంలో అనేక మంది పార్టీలో ఉంటూ పార్టీకే నష్టం కలిగించేలా వ్యవహరిస్తారనే అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. దాంతో కేసీఆర్ తన తనయపై వేటుకు సిద్ధమయ్యారు. మధ్యాహ్నం ఒకటిన్నర సమయంలో సస్పెన్షన్ ప్రకటన వెలువడింది. తొలుత ఏకంగా బహిష్కరణ వేటు వేయాలని నిర్ణయించారు. అదే ప్రకటనను సిద్ధం చేశారు కూడా. తర్వాత అధికారిక ప్రకటనలో సస్పెన్షన్‌గా మార్చారు. బీఆర్ఎస్ పార్టీ నిబంధనావళి ప్రకారం పార్టీ నుంచి బహిష్కరిస్తే ఆరేళ్ల పాటు తిరిగి పార్టీలోకి వచ్చే అవకాశం ఉండదు. సస్పెన్షన్ చేస్తే ఏ క్షణమైనా ఎత్తేసి తిరిగి పార్టీలోకి తీసుకోవచ్చు. మరోవైపు కవితే బుధవారం బీఆర్ఎస్‌కు, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయనున్నట్లు జాగృతి వర్గాలు వెల్లడించాయి.

సస్పెండ్ తర్వాత బీఆర్ఎస్ ఎదురు దాడి

హరీశ్‌రావు, సంతోషరావులపై కవిత సంచలన వ్యాఖ్యలు చేసిన తర్వాత కూడా సంయమనం పాటించాలని పార్టీ నేతలకు బీఆర్ఎస్ అధిష్ఠానం నుంచి ఆదేశాలు వెళ్లాయి. అధినేత ఏదో ఒక నిర్ణయం తీసుకొనే వరకు ఆమె వైఖరిపై స్పందించొద్దని సందేశాలు అందాయి. మంగళవారం మధ్యాహ్నం సస్పెన్షన్ ప్రకటన వెలువడగానే బీఆర్ఎస్ నేతలంతా కవితపై మాటల దాడితో విరుచుకుపడ్డారు. కొందరు నేతలు నేరుగా మీడియాతో మాట్లాడారు. మరికొందరు సోషల్ మీడియా వేదికగా ఆమెపై మాటల దాడి మొదలెట్టారు. కన్న కూతురు కంటే కార్యకర్తలే ముఖ్యమని, పేగుబంధం కంటే పార్టీలో ఉన్న అనుబంధమేముఖ్యమని, పార్టీకి డ్యామేజ్ చేసే వారికంటే ఇమేజ్ పెంచే నాయకులే ముఖ్యమని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిరూపించారంటూ సోషల్ మీడియా వేదికగా హోరెత్తించారు. కవిత సస్పెన్షన్‌ను హర్షణీయమని, స్వాగతిస్తున్నామని, ఆమె ఉంటే ఎంత పోతే ఎంత? అంటూ మహిళా నేతలంతా తెలంగాణ భవన్ వేదికగా మాట్లాడారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ కవిత సస్పెన్షన్‌ను స్వాగతించిన వారిలో ఉన్నారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లో ఉన్న నేతలంతా ఎక్కడికక్కడ స్పందించారు. కవిత సస్పెన్షన్ తీరుపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో ఈటల రాజేందర్ విషయంలో కఠినంగా వ్యవహరించి, ఏకంగా పార్టీ నుంచి బహిష్కరించారని గుర్తు చేసుకుంటున్నారు. కవితకు ఒక న్యాయం, ఈటలకు ఒక న్యాయమా? అంటూ కొందరు నేతలు అధిష్ఠానం తీరును అంతర్గతంగా తప్పుబడుతున్నారు. పార్టీ నుంచి సస్పెన్షన్ తర్వాత కవిత ఇంకా ఎక్కువగా వ్యక్తిగత లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేసే ప్రమాదం లేకపోలేదని కొందరు నేతలంటున్నారు. సస్పెన్షన్‌తో సరిపెట్టుకోకుండా హరీశ్‌రావు, సంతోశ్‌రావులపై చేసిన అవినీతి ఆరోపణలను పార్టీ పెద్దలుఎందుకు ఖండించడం లేదన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. కవిత సస్పెన్షన్ నిర్ణయం పార్టీకి తాత్కాలికంగా మేలు కలిగించే అంశమైనప్పటికీ దీర్ఘకాలికంగా జరిగే నష్టమే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కేసీఆర్ సొంతింటిని చక్కదిద్దుకోలేక పోయారని, కుటుంబ సభ్యులను కట్టడి చేయలేక పోయారన్న నిందను ఎప్పటికీ మోయాల్సి వస్తుందన్న అభిప్రాయాలు సైతం వ్యక్తం అవుతున్నాయి.

ఎందుకిలా చేసింది?

ఆమెకు ఏం తక్కువ చేశాను?

- ఎంపీగా గెలిపించాం.. ఓడిపోతే ఎమ్మెల్సీ ఇచ్చాం
- మద్యం కేసులో అరెస్టయితే.. ఎంతో ఖర్చు పెట్టి లాయర్లను పెట్టాను
- బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ కీలక వ్యాఖ్యలు
- సస్పెండ్ చేస్తే కొత్త పార్టీ పెడుతుందా? అని ఆరా
- కవితను సస్పెండ్ చేయకపోతే పార్టీలో మరికొందరు ఇలాగే చేస్తారన్న అభిప్రాయాలు
- కవితను బహిష్కరిస్తే మంచిదన్న జగదీశ్‌రెడ్డి!



హైదరాబాద్/గజ్వేల్/మర్కుక్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ తన కూతురు కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేసిన కేసీఆర్.. ఆమె తీరు పట్ల పార్టీ నేతల వద్ద తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కవితను సస్పెండ్ చేసే ముందు ఫాంహౌస్‌లో ముఖ్యనేతలతో నిర్వహించిన సమావేశంలో కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేసినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. "కవితకు ఏం తక్కువ చేశాను? నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసే అవకాశమిచ్చి గెలిపించుకున్నాం. రెండోసారి చాన్స్ ఇచ్చాను. ఎంపీగా ఓడిపోతే ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాను. మద్యం కేసులో అరెస్టయితే ఎంతో ఖర్చుపెట్టి పెద్ద పెద్ద అడ్వకేట్లతో వాదించాం? అయినా కవిత ఎందుకిలా చేసింది?" అని కేసీఆర్ అన్నట్లు తెలిసింది. కాగా, పార్టీ నేతలు కవితపై తమ అభిప్రాయాలు చెప్పే సమయంలో కొన్ని అంశాలను కేసీఆర్ దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. కవిత సీఎం రేవంత్ ఫోల్డర్‌లో పని చేస్తున్నారంటూ కొన్ని ఆధారాలు కూడా చూపించారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అలాగే కవితను సస్పెండ్ చేస్తే ఆమె ఏం చేస్తుందోనన్న అంశంపై కూడా కేసీఆర్ చర్చించినట్లు, కొత్త పార్టీ పెడుతుందా? అని ఆరా తీసినట్లు తెలిసింది. అయితే సస్పెండ్ చేస్తే కాంగ్రెస్‌లో చేరతారని, కవితకు మంత్రి పదవి కూడా ఇచ్చే అవకాశం ఉందని పార్టీ నేతలు కేసీఆర్‌కు వివరించారు. దీంతో, "కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవేళ కవితకు మంత్రి పదవి ఇస్తే అది మనకే లాభం" అని కేసీఆర్ అన్నట్లు సమాచారం. కాగా, కవితను సస్పెండ్ చేయడం వల్ల భవిష్యత్తులో ఇంకెవరూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరని, ఎంతటి వారినైనా సస్పెండ్ చేస్తారనే భయం కలుగుతుందని కొందరు నేతలు కేసీఆర్‌తో అన్నట్లు తెలిసింది. కవితను సస్పెండ్ చేయని పక్షంలో అనేక మంది పార్టీలో ఉంటూ పార్టీకే నష్టం కలిగించేలా వ్యవహరిస్తారని చర్చకు వచ్చినట్లు సమాచారం. అంతేకాకుండా కేసీఆర్ కూతురి విషయంలో ఏకపక్షంగా ఉంటున్నారని ప్రచారం పెరుగుతుందని, సస్పెండ్ చేస్తే వ్యతిరేకంగా పనిచేసే వారికి హెచ్చరికగా ఉండడంతో పాటు గతంలో చెప్పిన విధంగా పార్టీయే తన కుటుంబంగా కేసీఆర్ భావించారని ప్రజల్లో ప్రచారం జరుగుతుందని భావించినట్లు తెలిసింది. ఇటీవల కవిత 'లిల్లీపుట్' అంటూ వ్యాఖ్యానించిన నేత.. ఆమెను బహిష్కరిస్తేనే పార్టీకి మంచిదని చెప్పినట్లు సమాచారం. నేతలందరి అభిప్రాయాలు విన్న కేసీఆర్.. చివరికి కవితపై వేటు వేయాలన్న నిర్ణయానికి వచ్చారు.



కవితను బీజేపీలో చేర్చుకోం

ఆమె సస్పెన్షన్‌తో బీఆర్ఎస్ పనైపోయింది

వాటాల పంపకంలో తేడాతోనే పంచాయితీ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

చిట్యాల రూరల్/న్యూఢిల్లీ/మహబూబ్‌నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవితను బీజేపీలో చేర్చుకోబోమని.. అవినీతిపరులకు తమ పార్టీలో స్థానం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. కవిత సస్పెన్షన్‌తో బీఆర్ఎస్ పనైపోయిందని, ఆ పార్టీలో ఉన్న నాయకులూ కారు దిగే అవకాశం ఉందని తెలిపారు. మంగళవారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించి, అమరవీరుల కుటుంబాలను సన్మానించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడారు. దోచుకున్నదాంట్లో వాటాలు పంచుకునే వ్యవహారంలో కేసీఆర్ కుటుంబ పంచాయితీ బహిర్గతమైందని అన్నారు. కవిత వ్యాఖ్యలతో బీఆర్ఎస్‌లో అవినీతి వ్యవహారం బయటపడిందని చెప్పారు. కాళేశ్వరం అవినీతిపై 20 నెలలుగా కాంగ్రెస్ జాప్యం చేయడంతో ఆధారాలు తారుమారు చేసేందుకు అవకాశం దొరికిందని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఒకరికొకరు కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం కేసును ముందే సీబీఐకి ఇస్తే బాగుండేదన్నారు. సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కేసీఆర్ అధికారికంగా ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని కాంగ్రెస్ ప్రచారం చేసిందని.. ఇప్పుడు తెలంగాణ పరిపాలన దినోత్సవమంటూ మోసగిస్తోందని మండిపడ్డారు. నిజాం వారసులైన ఎంఐఎం నాయకులతో బీఆర్ఎస్, కాంగ్రెస్ అంటకాగుతున్నాయని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో హరీశ్‌రావు, సంతోష్ పాత్ర ఉందని చెప్పిన కవిత.. అందుకు సంబంధించి ఆమె వద్ద ఉన్న ఆధారాలను సీబీఐకి ఇవ్వాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు సూచించారు.



మొన్న కాళేశ్వరం కూలింది.. నేడు బీఆర్ఎస్ కూలింది: లక్ష్మణ్

కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఎమ్మెల్సీ కవిత బాహాటంగానే ఒప్పుకుందని, అందులో కేసీఆర్ పాత్ర ఉందని ఆమె వ్యాఖ్యలతో స్పష్టమైందని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. "మొన్న కాళేశ్వరం కూలింది. నేడు బీఆర్ఎస్ కూలింది. మేడిగడ్డ బ్యారేజ్‌లో మూడు పిల్లర్లు కుంగితే.. నేడు బీఆర్ఎస్ మూడు ముక్కలైంది" అని ఎద్దేవా చేశారు. మంగళవారం ఢిల్లీలోని అధికారిక నివాసంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. కవిత లాంటి అవినీతిపరులను బీజేపీలో ఎట్టి పరిస్థితుల్లోనూ చేర్చుకోబోమని చెప్పారు. కాళేశ్వరం కేసు దర్యాప్తును సీబీఐకి ఇవ్వకుండా 22 నెలలుగా ఎందుకు కాలయాపన చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించాలని బీజేపీ కోరిందని, కానీ కాంగ్రెస్ 20 నెలలు తాత్సారం చేసి, చేతగాక ఇప్పుడు సీబీఐకి అప్పగిస్తోందని ఎంపీ డీకే అరుణ విమర్శించారు. మహబూబ్‌నగర్ బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని ఎమ్మెల్సీ కవిత ఒప్పుకుంటూనే.. కేసీఆర్‌కు సంబంధం లేదని చెప్పడం చోద్యంగా ఉందన్నారు. కేసీఆర్ కుటుంబం మొత్తానికి కాళేశ్వరం అవినీతితో సంబంధం ఉందని ఆరోపించారు.

కవిత కొత్త పార్టీ?

- టీబీఆర్ఎస్ పేరుతో పార్టీ ఏర్పాటు!
- లేదంటే తెలంగాణ రాజ్య సమితి పేరుతో?
- బీఆర్ఎస్‌తో పూర్తిగా తెగదెంపులు
- పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ.. పదవికి రాజీనామా చేయాలని నిర్ణయం



హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. ఆ పార్టీతో పూర్తిగా తెగదెంపులు చేసుకోవాలని, తానే కొత్త పార్టీ పెట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఆ పార్టీకి ఏ పేరు పెట్టాలన్నదానిపై ఆమె పలువురితో చర్చలు, సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. అయితే తెలంగాణ నినాదంతో ఏర్పడిన టీఆర్ఎస్‌లోని 'టీ' అక్షరాన్ని తొలగించి బీఆర్ఎస్‌గా మార్చడాన్ని దృష్టిలో ఉంచుకొని.. తాను పెట్టబోయే పార్టీ తెలంగాణ (టీ)తో మొదలయ్యేలా.. పలు పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. జాగృతి శ్రేణులు చెబుతున్న ప్రకారం.. కవిత పెట్టనున్న పార్టీ పేరును 'టీబీఆర్ఎస్'గా నిర్ణయిస్తారని, దానికి పూర్తిపేరు 'తెలంగాణ భారత రాష్ట్ర సమితి' అని ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లేదంటే టీబీఆర్ఎస్ పేరుతోనే 'తెలంగాణ బహుజన రాష్ట్రసమితి' అని నిర్ణయించే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. అదీ కాకపోతే.. టీఆర్ఎస్ పేరు కలిసొచ్చేలా.. ఇప్పటికే గుర్తింపు పొందని పార్టీల విభాగంలో రిజిస్టర్ అయిన 'తెలంగాణ రాజ్య సమితి' పార్టీని ఆమె తీసుకుంటారని ప్రచారం జరుగుతోంది. ఇప్పటిదాకా తన 'తెలంగాణ జాగృతి' సంస్థనే రాజకీయ పార్టీగా కవిత మారుస్తారని అందరూ భావించారు. అయితే ఉద్యమ సమయంలో స్వచ్ఛంద సంస్థగా జాగృతిని ఏర్పాటు చేసినందున.. దానిని అలాగే కొనసాగిస్తూ కొత్తగా పార్టీ పెట్టాలని కవిత భావిస్తున్నట్లు ఆమె సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరుగుతున్న ప్రజా ఉద్యమం నుంచి ప్రేరణ పొంది.. జాగృతి సంస్థను 2006లో కవిత నెలకొల్పారు. రెండు దశాబ్దాలుగా జాగృతి ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి, సాహిత్య పరిరక్షణకు ఓవైపు కృషి చేస్తూనే.. ప్రపంచవ్యాప్తంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు.

ఎమ్మెల్సీ పదవికి రాజీనామా..!

బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేసిన నేపథ్యంలో ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేయాలని కవిత నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ అధిష్ఠానం తన ఎమ్మెల్సీ పదవిపై ఫిర్యాదు చేయడానికి ముందే రాజీనామా చేయాలని ఆమె భావిస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్‌తో పూర్తిగా తెగదెంపులు చేసుకోవడంతోపాటు భవిష్యత్తు కార్యాచరణ ఎలా మొదలు పెట్టాలన్న దానిపై ఆమె కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. ఈ మేరకు బుధవారం మీడియా ముఖంగా తన వైఖరిని, భవిష్యత్తు నిర్ణయాలను కవిత వెల్లడిస్తారని జాగృతి కార్యాలయం పేర్కొంది. అయితే నిన్నటి వరకు పార్టీలోనే కొనసాగుతూ నిరసన గళం వినిపించిన కవిత.. సస్పెన్షన్ తర్వాత ఏం మాట్లాడతారన్నది ఉత్కంఠగా మారింది. ఆమె ఎవరిని టార్గెట్ చేయబోతున్నారు? రాజకీయ వ్యూహం ఏమిటి? అనేదానిపై చర్చ కొనసాగుతోంది. కవిత కేసీఆర్ కూతురే అయినప్పటికీ.. తన నాయకత్వ పటిమతో బీఆర్ఎస్‌లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఇప్పుడు సొంత పార్టీ పెట్టే దిశగా ఆలోచిస్తుండడంతో రాజకీయంగా ఆమె అడుగులు ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తికరంగా మారింది.

కవిత సస్పెన్షన్ దుర్మార్గం

- చాలా రోజులుగా పార్టీలో ఆమెపై కుట్ర
- నమ్మకద్రోహులను పక్కన పెట్టుకొని.. పార్టీ కోసం శ్రమించిన కవితపై చర్యలా?
- వ్యాఖ్యలపై కనీసం వివరణ కోరలేదు
- మండిపడుతున్న జాగృతి శ్రేణులు
- హరీశ్‌రావుకు వ్యతిరేకంగా నినాదాలు



జాగృతి కార్యాలయం వద్ద కవిత మద్దతుదారుల నిరసన

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను బీఆర్ఎస్ సస్పెండ్ చేయడంపై జాగృతి శ్రేణులు మండిపడుతున్నాయి. సస్పెన్షన్ సమాచారం తెలిసిన వెంటనే మంగళవారం పలువురు కార్యకర్తలు బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయం వద్దకు చేరుకున్నారు. 'కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి.. ఖబడ్దార్ హరీశ్‌రావు' అంటూ నినాదాలు చేశారు. పార్టీలో జరుగుతున్న లోపాలను ఎత్తిచూపిన కవితను సస్పెండ్ చేయడమేంటని వారు తప్పుబట్టారు. కవిత చేసిన వ్యాఖ్యలపై కనీసం వివరణ కూడా కోరలేదని మండిపడ్డారు. కొందరి కళ్లలో ఆనందం కోసమే సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. చాలా రోజులుగా పార్టీకి, కేసీఆర్‌కు కవితను దూరం చేయాలనే కుట్ర జరుగుతోందని, అందులో భాగంగానే సస్పెండ్ చేశారని మండిపడ్డారు. నమ్మక ద్రోహులను పక్కన పెట్టుకొని.. ఉద్యమకాలం నుంచి బీఆర్ఎస్ అభివృద్ధి కోసం పనిచేసిన కవిత పట్ల పార్టీ వ్యవహరించిన తీరు తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. కాగా, ఒక మహిళా నేత పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారని జాగృతి మహిళా నేతలు అన్నారు. కూతురును లిక్కర్ కేసులో, కొడుకును ఈ-రేసు కేసులో, ఇప్పుడు తండ్రిని కాళేశ్వరం కేసులో ఇరికించి.. హరీశ్‌రావు ముఖ్యమంత్రి అవుదామనుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాకుండా.. గతంలో బీఆర్ఎస్ కార్యాలయం వద్ద టపాసులు పేల్చిన ఓ వీడియోను కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి.. జాగృతి వర్గాలు తగులబెట్టాయంటూ దుష్ప్రచారం చేయడాన్ని ఖండించారు. తమ నాయకురాలిపై, జాగృతి సంస్థపై తప్పుడు ప్రచారాలు చేయడం తగదని, ఈ చర్యలు మానుకోవాలని హెచ్చరించారు.

వారి సంతోషం కోసం కవిత సస్పెన్షన్..

పార్టీలో కుట్రలకు పాల్పడుతున్నారని కవిత ఆరోపిస్తే.. వారిని పక్కన పెట్టుకొని కవితను సస్పెండ్ చేయడం దుర్మార్గమని జాగృతి ఎంబీసీ, సంచారజాతుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ అన్నారు. హరీశ్‌రావు, సంతోష్‌రావు, జగదీశ్‌రెడ్డి లాంటి కొంతమంది వ్యక్తుల సంతోషం కోసం కవిత గొంతు కోశారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకాలం నుంచి సామాజిక చైతన్యం తెచ్చిన కవిత పట్ల ఇలా వ్యవహరించడం బాధాకరమన్నారు. కాగా, బీఆర్ఎస్ నిర్ణయం ఏకపక్షమని, దీనిని తెలంగాణ సమాజం తరఫున తాము ఖండిస్తున్నామని జాగృతి నేత సయ్యద్ ఇస్మాయిల్ అన్నారు. బీఆర్ఎస్ కూడా చేయలేనన్ని కార్యక్రమాలు జాగృతి చేసిందని, కేసీఆర్‌పై జరుగుతున్న కుట్రలను ఖండిస్తూ.. రక్షణ కవచంలా కవిత పోరాడారని తెలిపారు. అలాంటి కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేయడాన్ని చూస్తే.. బీఆర్ఎస్ ఆత్మహత్య చేసుకున్నట్లుగా అనిపిస్తోందన్నారు.

కవిత ఉంటే ఎంత.. పోతే ఎంత

- ఆమె పార్టీ పెడితే బీఆర్ఎస్‌కు నష్టమేమీ లేదు
- తన ప్రవర్తనతో తనకు తానే గొయ్యి తవ్వుకున్నారు
- పార్టీకి ద్రోహం చేసిన వారిలా మిగిలిపోతున్నారు
- కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.. బీఆర్ఎస్ మహిళా నేతల వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'తనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన బీఆర్ఎస్‌ను ఉంటే ఎంత.. పోతే ఎంత అని కవిత పేర్కొనడం బాధాకరం. అటువంటి వ్యక్తి పార్టీలో ఉంటే ఎంత? పోతే ఎంత? అని కార్యకర్తలు భావిస్తున్నారు" అని బీఆర్ఎస్ మహిళా నేతలు పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ మహిళా నేతలు సత్యవతి రాథోడ్, గొంగిడి సునీత, మాలోత్ కవిత మీడియాతో మాట్లాడారు. గత మూడు నెలల్లో కవిత చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ కార్యకర్తల్లో అసహనానికి దారి తీశాయన్నారు. ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. కవితకు ఎంపీగా, ఎమ్మెల్సీగా ఎన్నో అవకాశాలు ఇచ్చారని, కానీ ఆమె ఆ గుర్తింపు నిలబెట్టుకోలేక పోయారని పేర్కొన్నారు. పార్టీ కంటే తానే ముఖ్యమనే విధంగా ఆమె మాట్లాడటంతో కార్యకర్తలు కూడా విసిగిపోయారని చెప్పారు. కవిత కొత్త పార్టీపెడితే బీఆర్ఎస్‌కు కలిగే నష్టమేమీ లేదని పేర్కొన్నారు. ఉద్యమకాలం నుంచి ఇప్పటివరకు కేసీఆర్‌ను విభేదించి పెట్టిన కొత్తపార్టీలు కాలగర్భంలో కలిసిపోయాయని చెప్పారు. కేసీఆర్‌ను కవిత నాన్న అని పిలుస్తారేమోగానీ.. తెలంగాణ ప్రజలంతా ఆయన్ను బాపు (తండ్రి)గా భావిస్తున్నారని, ఆయన కూడా తెలంగాణ ప్రజలను కన్నబిడ్డల్లా భావిస్తారని పేర్కొన్నారు. పార్టీకి ద్రోహంచేసిన వారిలో కవిత కూడా ఒకరిగా మిగిలిపోవడం బాధాకరమన్నారు. పార్టీలో ఆమెకు ఎంతో ప్రాధాన్యత ఉండేదని, తన ప్రవర్తనతో తనకు తానే గొయ్యి తవ్వుకున్నారని విమర్శించారు. ఎవరో చెబితే తాను మాట్లాడటం లేదని కవిత చెప్పింది అబద్ధమని.. ఎవరో ఆమె భుజం మీద తుపాకీపెట్టి ఎవరో కాలుస్తున్నారని వ్యాఖ్యానించారు. కాగా, కన్న కుమార్తె కంటే కూడా కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న కార్యకర్తల భవిష్యత్తు ముఖ్యమనే కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. కవిత సస్పెన్షన్ సమంజసమేనని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు.



జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కవిత ఫ్లెక్సీని తొలగిస్తున్న కార్యకర్త

కాంగ్రెస్ పార్టీ పన్నిన కుట్రలకు ఎమ్మెల్సీ కవిత బలయ్యారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కవిత వ్యాఖ్యలు పార్టీని గాయపర్చేలా ఉండటంతోనే కేసీఆర్ చర్యలు తీసుకున్నారన్నారు. కేసీఆర్ కుటుంబంలో చిచ్చుపెట్టి పార్టీని చీల్చాలని కాంగ్రెస్, బీజేపీ కుట్రపన్నాయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపించారు.

కేసీఆర్ సరైన నిర్ణయం తీసుకున్నారు..

పార్టీకి నష్టం చేస్తుంటే ఉపేక్షించకూడదనే కవితను కేసీఆర్ సస్పెండ్ చేశారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. ఉద్యమ నేత అయిన కేసీఆర్‌కు కుమార్తె కంటే పార్టీ కార్యకర్తలే ముఖ్యమని తేలిందని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎవరు క్రమశిక్షణ తప్పినా చర్యలు తప్పవని కేసీఆర్ నిరూపించారని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌తో కవిత లోపాయకారీ ఒప్పందం చేసుకుని ఆరోపణలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి బీఆర్ఎస్ కార్యాలయంలో కవిత ఫ్లెక్సీలు, పోస్టర్లను కార్యకర్తలు చింపివేశారు.

కవితను పార్టీలోకి ఆహ్వానించాల్సిన అవసరం కాంగ్రెస్‌కు లేదు

- కవిత సస్పెన్షన్.. వారి అంతర్గత వ్యవహారం
- వాటాల తగాదానే వేటుకు దారి తీసి ఉండొచ్చు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ కవిత సస్పెండ్ కావడమనేది పూర్తిగా ఆ పార్టీ అంతర్గత వ్యవహారమని, దానిపై కాంగ్రెస్ పార్టీ స్పందించబోదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కవితను పార్టీలోకి ఆహ్వానించాలన్న ఆలోచనగానీ, అవసరంగానీ తమ పార్టీకి లేవని స్పష్టం చేశారు. కేసీఆర్ కుటుంబం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయి ఉందని, అందులో ఎవరినీ వెనుకేసుకు రావాల్సిన అవసరం తమకు లేదని ఆయన చెప్పారు. అవినీతి సంపదలో వాటాల తగాదాలే సస్పెన్షన్‌కు దారి తీసి ఉండొచ్చని మహేశ్‌కుమార్ అన్నారు.

హరీశ్‌పై కవిత అస్త్రం సంధించడం వెనుక ఆంతర్యం ఏంటి?

కవిత సస్పెన్షన్‌కు ముందు మంగళవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడారు. నిన్న మొన్నటి దాకా కేటీఆర్‌పై ఆరోపణలు చేసిన కవిత.. తన అస్త్రాన్ని హరీశ్‌రావు వైపుకు మరల్చడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. మొదటి దఫా ప్రభుత్వంలోనే ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీశ్ తప్పు చేస్తే.. కవిత అప్పుడెందుకు మాట్లాడలేదని, కేసీఆర్ ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన నిలదీశారు. కవిత మాటలతో కాళేశ్వరంలో అవినీతి జరిగిందని తేలిపోయిందన్నారు. ఈ ప్రాజెక్టుకు కర్త, కర్మ, క్రియ అన్నీ తానే అని చెప్పుకున్న కేసీఆర్ అవినీతికి కూడా బాధ్యత వహించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఇప్పుడు కాళేశ్వరం కేసు.. సీబీఐ కోర్టులోకి చేరిందని, విచారణ పేరుతో కేసును సాగదీస్తే.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనన్నది మరోమారు స్పష్టం అవుతుందని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. కాళేశ్వరం దొంగలకు శిక్ష వేసే అవకాశం కేంద్రంలోని బీజేపీకి వచ్చిందని, ఆ పార్టీ నేతలు తమ చిత్తశుద్ధి చాటుకోవాలని అన్నారు.

గాంధీభవన్‌లో వైఎస్ఆర్‌కు నివాళి

వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నివాళి అర్పించారు. మంగళవారం గాంధీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ కేవీపీ రామచందర్‌రావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను బద్నాం చేసే కుట్ర

» కాళేశ్వరం అంశాన్ని సీబీఐకి అప్పగించడంపై బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళనలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకల అంశాన్ని సీబీఐ విచారణకు అప్పగించాలన్న రాష్ట్రప్రభుత్వ నిర్ణయంపై బీఆర్ఎస్ శ్రేణులు మండిపడ్డాయి. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు కాంగ్రెస్ కుట్రపన్నిందంటూ మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, ఆందోళనలకు దిగాయి. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపాయి. పలుచోట్ల బీఆర్ఎస్ శ్రేణులను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా.. తోపులాట, ఉద్రిక్తత చోటు చేసుకున్నాయి. మహబూబాబాద్ జిల్లా కురవిలో జాతీయ రహదారిపై మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోతు కవిత ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. మహబూబాబాద్‌లో వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి వెళుతున్న మంత్రుల దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని తప్పించి కాన్వాయ్‌ను పంపించారు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లా తొర్రూరు బస్టాండ్ సెంటర్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. విచారణ పేరిట కాళేశ్వరం ప్రాజెక్టును పక్కనపెట్టి,



కురవిలో మంత్రుల కాన్వాయిని అడ్డుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు, రోప్‌తో లాగిపడేస్తున్న పోలీసులు

గోదావరి జలాలను ఏపీకి తరలించే కుట్ర జరుగుతోందని ఎర్రబెల్లి ఆరోపించారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని బాలాపూర్ చౌరస్తాలో మాజీ మంత్రి సబితారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా, ర్యాలీ నిర్వహించారు. సీబీఐ విచారణ పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టును పక్కనబెట్టి.. గోదావరి జలాలను ఏపీలోని బనకచర్లకు అక్రమంతా తరలించుకు వెళ్లడానికి సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జడ్చర్లలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు చేశాయి. సంగారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. జగిత్యాలలో కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టుకొని రాస్తారోకో నిర్వహించారు. సిద్దిపేట జిల్లాలోని రంగనాయక సాగర్ రిజర్వాయర్ కట్టపై 'ఇది కాదా కాళేశ్వరం.. ఇదే కదా కాళేశ్వరం' నినాదంతో ఉన్న 100 మీటర్ల బ్యానర్‌ను ప్రదర్శించారు.

ఘోష్ నివేదిక ఆధారంగా అక్టోబరు 7 వరకు

కేసీఆర్, హరీశ్‌పై చర్యలొద్దు!

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

» సీబీఐ దర్యాప్తు జీవోపై జోక్యానికి నో

» పిటిషన్లో ఆ అంశం లేదని స్పష్టీకరణ

» ఎన్డీఎస్‌ఏ నివేదిక ఆధారంగా సీబీఐ దర్యాప్తు: సర్కార్

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్డీఎస్‌ఏ) నివేదిక, విజిలెన్స్ విభాగం నివేదిక, ఇతర అంశాల ఆధారంగా కాళేశ్వరం అవకతవకలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. కాళేశ్వరం అక్రమాలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికకు, తాము సీబీఐ దర్యాప్తు కోరడానికి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఈ రెండూ వేర్వేరు అంశాలని పేర్కొంది. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐను స్వతంత్రంగా మొత్తం కేసును మొదటి నుంచి దర్యాప్తు చేయాలని కోరామని వెల్లడించింది. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఈ దర్యాప్తు ఉండబోదని స్పష్టం చేసింది. కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించేందుకు తామిచ్చిన జీవోలో అక్రమాలకు ఎవరు బాధ్యులు? ఎవరిపై దర్యాప్తు చేయాలి? అని ఏ పేర్లనూ ప్రస్తావిస్తూ అడగలేదని తెలిపింది. ఘోష్ కమిషన్ నివేదికపై శాసనసభలో చర్చించామని, అయితే నివేదిక ఆధారంగా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపింది. చర్యలు తీసుకుంటే అందుకు సంబంధించిన చర్యా నివేదికను శాసనసభలో పెడతామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

కాళేశ్వరం కమిషన్ నివేదికను కొట్టేయాలంటూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో మంగళవారం వాడీవేడిగా వాదనలు జరిగాయి. నివేదికను శాసనసభలో చర్చించినప్పటికీ తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోకుండా అడ్డుకోవాలని కొద్దిరోజుల క్రితం కేసీ



ఆర్, హరీశ్‌రావు దాఖలు చేసిన మధ్యంతర దరఖాస్తులపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్యలు తీసుకున్నారా? తీసుకోబోతున్నారా? నిర్ణయం పెండింగ్‌లో ఉందా? చెప్పాలని సోమవారం హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సంగతి తెలిసిందే. మంగళవారం ఈ అంశంపై అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. సీబీఐ దర్యాప్తు కోరుతూ జారీచేసిన జీవో, సీబీఐ ఎంట్రీపై నిషేధం ఎత్తివేతకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ధర్మాసనానికి అందజేశారు. కాళేశ్వరం నివేదికలోని అంశాల ఆధారంగా సీబీఐ దర్యాప్తును కోరలేదని, ఎన్డీఎస్‌ఏ, విజిలెన్స్ తదితర నివేదికల ఆధారంగా కోరామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం సీబీఐ దర్యాప్తు విషయంలో ఎలాంటి జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. తాము విచారిస్తున్నది పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించిన అంశమని, పిటిషనర్లు కమిషన్ నివేదికను సవాల్ చేస్తూ పిటిషన్లు వేశారని ప్రస్తావించింది. సీబీఐ దర్యాప్తునకు ఆదేశించడం వేరే విషయమని, కావాలంటే దాన్ని సవాల్ చేస్తూ విడిగా పిటిషన్లు వేసుకోవచ్చని సూచించింది. కమిషన్ నివేదికలోని అంశాలను ఆధారంగా చేసుకొని పిటిషనర్లపై వచ్చే విచారణ తేదీ వరకు ఎలాంటి చర్యలు తీసుకోరాదని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ కౌంటర్ల కోసం తదుపరి విచారణ అక్టోబరు 7కు వాయిదా పడింది.

మమ్మల్ని ఎదుర్కొనే దమ్ము లేక..: కేసీఆర్

వాదనల సందర్భంగా కేసీఆర్ తరఫున హాజరైన సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దామ శేషాద్రి నాయుడు, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను వాదనలు వినిపిస్తుంటే అడ్డుకోవడాన్ని ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి తన క్లయింట్(కేసీఆర్)ను ఎదుర్కొనే దమ్ము లేదని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కమిషన్ నివేదికను ముందు పెట్టుకుని కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా రచ్చ చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కమిషన్ నివేదిక న్యాయ సమీక్షకు నిలబడే పరిస్థితి కనిపించకపోవడంతో సీబీఐ దర్యాప్తునకు సదరు నివేదిక ఆధారం కాదంటూ తెలివి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు.

ఘోష్ నివేదికపై మరో పిటిషన్

ఘోష్ కమిషన్ నివేదికను కొట్టేయాలని కోరుతూ హైకోర్టులో మరో పిటిషన్ దాఖలు అయింది. నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి(రిటైర్డ్) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కమిషన్ నివేదిక ఆధారంగా తనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కమిషన్ తనను సాక్షిగా మాత్రమే పిలిచిందని గుర్తు చేశారు. చట్ట ప్రకారం ఎలాంటి నోటీసులు ఇవ్వలేదన్నారు. ఈ పిటిషన్‌పై సీజే ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టనుంది.

తక్షణసాయం రూ. 200 కోట్లు!

వరదల నష్టంపై సర్కారు మంజూరు

» తీవ్రంగా ప్రభావితమైన 7 జిల్లాలకు రూ.10 కోట్ల చొప్పున..

» మిగతా జిల్లాలకు రూ.5 కోట్ల చొప్పున..

» రోడ్లు, వంతెనలు, కల్వర్టుల మరమ్మతుల వంటి పనులకే వాడాలని స్పష్టీకరణ

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల వర్షాలు, వరదలతో జరిగిన నష్టానికి తక్షణ సాయం కింద జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు మంగళవారం విపత్తుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అధిక వర్షపాతం నమోదై, భారీ నష్టం జరిగినట్టు గుర్తించిన కామారెడ్డి, మెదక్, నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఆసిఫాబాద్, సిరిసిల్ల జిల్లాలకు రూ.10 కోట్ల చొప్పున.. మిగిలిన 26 జిల్లాలకు రూ.5 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిధులను రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఎస్‌డీఆర్ఎఫ్) నిబంధనల మేరకు తక్షణ మరమ్మతులు చేపట్టడానికే ఉపయోగించాలని ఉత్తర్వుల్లో జిల్లాల కలెక్టర్లకు సూచించింది. ప్రధానంగా రోడ్లు, వంతెనలు, కల్వర్టుల మరమ్మతులకు, తాగునీటి సరఫరా పరంగా ఏర్పడిన అవాంతరాలను సరిచేసేందుకు మాత్రమే నిధులను వినియోగించాలని స్పష్టం చేసింది. ఈ నిధులతో కొత్త పనులు చేపట్టొద్దని, పంట నష్ట పరిహారానికీ వినియోగించొద్దని స్పష్టం చేసింది. పనుల కోసం వినియోగించిన నిధులకు సంబంధించిన వినియోగ పత్రాల (యుటిలైజేషన్ సర్టిఫికెట్స్)ను సంబంధిత విభాగానికి సమర్పించాలని ఉత్తర్వుల్లో సూచించారు. ఆగస్టు 25 నుంచి 28 వరకు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. కామారెడ్డి, మెదక్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో 50 సెం.మీ కన్నా ఎక్కువగా వర్షపాతం నమోదవ్వగా, మిగతా జిల్లాల్లో 25-40 సెం.మీ మేర వర్షపాతం నమోదైంది. ఫలితంగా జిల్లాల్లో మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం వాటిల్లడంతో పాటు, పంట నష్టం, ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించాయని గుర్తించినట్టు జిల్లాల నుంచి సమాచారం వచ్చిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

క్యాబినెట్‌లో మాజీ నక్సలైట్లు

» పోలీసు అమరుల త్యాగాలను అవమానించేలా రేవంత్ వ్యాఖ్యలు: బండి సంజయ్

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర క్యాబినెట్‌లో మాజీ నక్సలైట్లు ఉన్నారు. నక్సలైట్ పేరును పద్మ అవార్డులకు సిఫారసు చేశారు. నక్సల్స్ భావజాలం ఉన్న వారు విద్యా కమిషన్‌లో ఉన్నారు. ఇప్పుడు ఉపరాష్ట్రపతి అభ్యర్థి కూడా అదే సిద్ధాంతానికి చెందిన వ్యక్తి. ఇది యాదృచ్ఛికం కాదు. తెలంగాణ యువతను తిరిగి నక్సలిజం వైపు మళ్లించేందుకు పన్నిన కుట్ర' అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. నక్సలిజం ఒక సిద్ధాంతమని, దాన్ని అంతం చేయలేమని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం.. నక్సలైట్ల చేతిలో బలైన వేలాది మంది అమాయక గిరిజనుల, పోలీసు అమరుల త్యాగాలను అవమానించడమేనని అన్నారు. 'హోంమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ముఖ్యమంత్రి తెలంగాణ పోలీసులకు గౌరవం ఇవ్వరా..?' అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో హోంమంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో వచ్చే ఏడాది మార్చి 31లోగా నక్సలిజాన్ని అంతమొందిస్తామని సంజయ్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

మనుషులను చంపితే నక్సలిజం పోదు

» ఇది బండి సంజయ్ గ్రహించాలి: మల్లు రవి

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మనుషులను చంపితే నక్సలిజం పోదన్న సంగతి కేంద్ర మంత్రి బండి సంజయ్ గ్రహించాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలోని ప్రతి పౌరునికీ అభివృద్ధి ఫలాలు అందాలన్న ఫిలాసఫీని నక్సలైట్లు పెట్టుకున్నారని తెలిపారు. అయితే తుపాకీ ద్వారా దాన్ని సాధించాలనే వారి విధానానికి సీఎం రేవంత్‌రెడ్డి వ్యతిరేకమన్నారు. నక్సలైట్లకూ ఓ ఫిలాసఫీ ఉందనే రేవంత్ చెప్పారని, అందుకే వారితో మాజీ సీఎం వైఎస్ఆర్ చర్చలు జరిపారని గుర్తు చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుం పేరుతో వారిలో వారు చంపుకొనే వ్యవస్థనే జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వ్యతిరేకించారన్నారు.

నేటితో ముగియనున్న టీఏఎఫ్ఆర్సీ వ్యక్తిగత విచారణలు

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కొత్త మార్గదర్శకాల మేరకు.. ఫీజుల పెంపుపై ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల వ్యక్తిగత విచారణల ప్రక్రియ కొనసాగుతోంది. గతనెల 25న ప్రారంభమైన ఈ ప్రక్రియ బుధవారంతో ముగియనుంది. మంగళవారం వరకు 141 కాలేజీల యాజమాన్యాలు వివరణ ఇచ్చాయి. రాష్ట్రంలో మొత్తం 160 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు ఉండగా.. బుధవారం మిగతా 19 కాలేజీలు హాజరు కానున్నాయి. అనంతరం టీఏఎఫ్ఆర్సీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనుంది.

మహేష్ బ్యాంక్ మాజీ సీఈవో ఆస్తులు ఈడీ స్వాధీనం

ఆంధ్రప్రదేశ్ మహేష్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ అధికారుల అక్రమాలకు సంబంధించిన కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిందితుల ఆస్తులు అటాచ్ చేసింది. బ్యాంకు మాజీ ఎండీ, సీఈవో ఉమేష్ చంద్ ఆసావా, ఆయన కుమారుడు రోహిత్ అసావా పేరుతో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఆదిబట్లలో ఉన్న రెండు స్థిరాస్తుల్ని అటాచ్ చేసింది. వీటి విలువ కోటి రూపాయలకుపైగా ఉంటుందని ఈడీ హైదరాబాద్ జోనల్ అధికారులు వెల్లడించారు.

సీబీఐ చేతికి వామనరావు దంపతుల హత్య కేసు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): న్యాయవాది వామనరావు దంపతుల హత్య కేసు దర్యాప్తు బాధ్యతలను సీబీఐ చేపట్టింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఎఫ్ఐఆర్‌లో వెల్ది వసంతరావు, కుంట శ్రీనివాస్, అక్కపాక కుమార్ పేర్లను నిందితులుగా చేర్చింది. కేసు దర్యాప్తు అధికారిగా ఇన్‌స్పెక్టర్ విపిన్ గహలోత్ వ్యవహరించనున్నారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల వద్ద 2021 ఫిబ్రవరి 17న వామనరావు దంపతులను హత్య చేసిన ఘటన నాడు సంచలనం సృష్టించింది. దర్యాప్తు జరిపిన రాష్ట్ర పోలీసులు కొందర్ని అరెస్టు చేశారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని వామనరావు తండ్రి గట్టు కిషన్‌రావు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో దర్యాప్తు బాధ్యతలను సీబీఐకి అప్పగిస్తూ గత నెల 12న సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

బీజేపీది భస్మాసుర హస్తం

» కవిత సస్పెన్షన్‌కు ఆ పార్టీనే కారణం: సీపీఐ నారాయణ

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ పార్టీలకు బీజేపీ అందించేది అభయ హస్తం కాదని.. భస్మాసుర హస్తమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బీజేపీకి దగ్గర కావడం వల్లే తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీలో చీలికలు వచ్చాయన్నారు. కవిత సస్పెన్షన్, పార్టీ విభజనకు బీజేపీనే కారణమని ఆరోపించారు. తమిళనాడులో అన్నాడీఎంకే, మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీల విషయంలో కూడా ఇదే తరహా ధోరణి ప్రదర్శించిందని గుర్తుచేశారు. అందుకే ఆ పార్టీకి దగ్గరైన ఏ పార్టీ అయినా చివరికి కనుమరుగైపోతుందని పేర్కొన్నారు. ఏపీలో పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేనకూ ఇదే పరిస్థితి ఎదురు కానుందని ఆయన జోస్యం చెప్పారు.

గణేశ్ నిమజ్జన శోభాయాత్రకు అమిత్‌షా

» 6న హైదరాబాద్‌కు.. బీజేపీ ముఖ్య నేతలతో భేటీ

హైదరాబాద్‌లో ఈ నెల 6న జరగనున్న గణేశ్ నిమజ్జన శోభాయాత్రకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రానున్నారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి ఆహ్వానం మేరకు ఆయన వస్తున్నారని బీజేపీ వర్గాలు తెలిపాయి. 6న ఉదయం 11 గంటలకు అమిత్ షా ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. ఐటీసీ కాకతీయ హోటల్‌లో పార్టీ ముఖ్యనేతలతో సమావేశమవుతారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు చార్మినార్ వద్ద, 3.30 గంటలకు ఎంజే మార్కెట్ వద్ద జరిగే శోభా యాత్రలో పాల్గొంటారు. కాగా, కేంద్ర హోంమంత్రి వినాయక శోభాయాత్రకు వస్తుండటం ఇదే తొలిసారి అని బీజేపీ సీనియర్ నేత ఒకరు తెలిపారు.

మైక్రో బ్రూవరీలకు దరఖాస్తుల ఆహ్వానం

బీరు ప్రియులకు శుభవార్త. ఇన్నాళ్లూ రాష్ట్ర రాజధానికే పరిమితమైన మైక్రో బ్రూవరీలు త్వరలో రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లలో అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రంలో ఉన్న 16 కార్పొరేషన్‌ల పరిధిలో మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. తక్కువ పరిమాణంలో వివిధ రకాల రుచుల్లో బీరును ఉత్పత్తి చేసి అక్కడికక్కడే విక్రయించే యూనిట్లను మైక్రో బ్రూవరీలు అంటారు. పబ్‌లు, స్టార్ హోటళ్లు, కొన్ని బార్లలో ఈ మైక్రోబ్రూవరీలు ఉంటాయి. గ్రేటర్ జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం 18 మైక్రోబ్రూవరీలకు అనుమతులు ఉన్నాయి. అయితే, తొలిసారిగా జీహెచ్ఎంసీ బయట ఉన్న కార్పొరేషన్లలో మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ ప్రకటన జారీ చేసింది. మైక్రో బ్రూవరీలు ఏర్పాటుకు ఆసక్తి ఉన్నవారు సెప్టెంబరు 25 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ సూచించింది. అనుమతి పొందిన వారు 180 రోజుల వ్యవధిలో మైక్రో బ్రూవరీని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.

'జూబ్లీహిల్స్'లో 3,92,669 మంది ఓటర్లు

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నిక జరగనున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 3,92,669 మంది ఓటర్లు ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) సి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు ఆయన ఓటర్ల ముసాయిదా జాబితాను మంగళవారం విడుదల చేశారు. ఇందులో 2,04,288 మంది పురుష ఓటర్లు, 1,88,356 మంది మహిళలు కాగా, 25 మంది ఇతరులని వివరించారు. ఓటర్లు తమ అభ్యంతరాలను ఈ నెల 17లోపు తెలియజేయాలని సూచించారు. ఓటర్ల జాబితాలో చేర్చడం లేదా తొలగించడం, సరిదిద్దడం, వేరే నియోజకవర్గానికి మార్చడం వంటి అభ్యంతరాలుంటే.. 6, 7, 8 ఫారాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అభ్యంతరాలన్నింటినీ ఈ నెల 25లోపు పరిష్కరిస్తామన్నారు. ఓటర్ల తుది జాబితాను ఈ నెల 30న బహిర్గతం చేస్తామని వివరించారు.

ఉద్యోగుల ఆరోగ్య పథకంపై వారంలో విధివిధానాలు

» దశలవారీగా సమస్యల పరిష్కారానికి సర్కారు హామీ ఇచ్చింది

» మంత్రివర్గ ఉపసంఘంతో భేటీ అనంతరం ఉద్యోగ సంఘాల ఐకాస వెల్లడి

» బస్సుయాత్ర, చలో హైదరాబాద్ వాయిదా వేస్తున్నట్లు ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఆరోగ్య పథకానికి సంబంధించిన విధివిధానాలను వారం రోజుల్లో ఖరారు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఉద్యోగుల ఐకాస వెల్లడించింది. దీంతో తాము తలపెట్టిన బస్సుయాత్ర, చలో హైదరాబాద్ కార్యక్రమాలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలపై సచివాలయంలో మంగళవారం ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రివర్గ ఉపసంఘం, అధికారుల కమిటీ సమావేశం నిర్వహించింది. అనంతరం ఐకాస చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు విలేకరుల సమావేశంలో భేటీ వివరాలను వెల్లడించారు. డిప్యూటీ సీఎం, ఉపసంఘం చైర్మన్ భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ రామకృష్ణారావు సమక్షంలో జరిగిన సమావేశంలో ఉద్యోగులు కోరుతున్న నగదు రహిత చికిత్స అందించేందుకు వీలుగా ఆరోగ్య పథకం అమలుకు ఈనెల 8వ తేదీ లోపు విధివిధానాలను ప్రకటిస్తామన్న హామీ లభించిందని వెల్లడించారు. ఆపై వీలైనంత త్వరగా ఉద్యోగులకు ఆరోగ్యకార్డులు జారీ చేస్తామని చెప్పారని తెలిపారు. పెండింగ్ బిల్లుల చెల్లింపునకు సంబంధించి గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెలా రూ.700 కోట్లు చెల్లిస్తామని చెప్పారని వెల్లడించారు. నర్సింగ్ డైరెక్టరేట్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామని, విజిలెన్స్ ఏసీబీ కేసులతో రెండేళ్లకు పైగా సస్పెన్షన్‌లో ఉన్నవారికి దశలవారీగా పోస్టింగులు ఇవ్వనున్నట్లు చెప్పారని వెల్లడించారు. ఉద్యోగులు, ప్రభుత్వం వేరు కాదని.. సుపరిపాలన కోసం అందరం కలిసి పని చేద్దామని భట్టి విక్రమార్క తమతో అన్నారని పేర్కొన్నారు. ఉద్యోగులు ప్రతిపాదించిన 63 డిమాండ్లలో 25కు పైగా ప్రభుత్వం నెరవేర్చిందని, మిగిలిన సమస్యలనూ దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

లచ్చిరెడ్డి ఐకాసకు నో ఎంట్రీ

ఉద్యోగుల ఐకాస పేరుతో లచ్చిరెడ్డి నేతృత్వంలో వచ్చిన ప్రతినిధులను సమావేశంలోకి అనుమతించేందుకు తాము అంగీకరించలేదని మారం జగదీశ్వర్ నేతృత్వంలోని ఉద్యోగుల ఐకాస పేర్కొంది. సచివాలయంలో జరుగుతున్న సమావేశంలో పాల్గొనేందుకు లచ్చిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధులు రాగా.. వారిని కూడా అనుమతించాలని భద్రతా సిబ్బందికి భట్టి విక్రమార్క సూచించారని ఐకాస ప్రతినిధులు చెప్పారు. అయితే తమతో చర్చలు జరుపుతారా? లేదంటే లచ్చిరెడ్డి నేతృత్వంలోని ఐకాసతో చర్చలు జరుపుతారా? నిర్ణయించుకోండి అని.. ఒకవేళ వారితో చర్చలు జరపాలని నిర్ణయిస్తే తాము వెళ్లిపోతాం అని తాము స్పష్టం చేసినట్లు వెల్లడించారు. ఫలితంగా లచ్చిరెడ్డి నేతృత్వంలోని ఐకాస ప్రతినిధులకు లోనికి అనుమతించలేదని వారు వెల్లడించారు.

'కాళేశ్వరం'పై విచారణ జరపండి

అవకతవకలు, నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన వారిపై దర్యాప్తు చేయండి

» సీబీఐకి సమ్మతి తెలుపుతూ సర్కారు జీవో

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకల వ్యవహారం కేంద్రానికి చేరింది. ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలు, నిధుల దుర్వినియోగం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు, ప్రజాప్రతినిధులు, ప్రైవేట్ వ్యక్తులు, అధికారులు, నిర్మాణ సంస్థలపై విచారణ జరిపే బాధ్యతను కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ)కు అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వం సోమవారం రాత్రి జీవో 104ను జారీ చేసింది. 2016లో రాష్ట్రంలో సీబీఐ విచారణకు స్వేచ్ఛనిస్తూ జీవో జారీ చేసిన నాటి ప్రభుత్వం.. ఆ తర్వాత కేంద్రంతో విభేదాల కారణంగా 2022 ఆగస్టు 30న జీవో 51 ద్వారా సీబీఐ విచారణపై ఆంక్షలు విధించింది. నిర్దిష్ట కేసుల్లో ప్రభుత్వం అనుమతిస్తే తప్ప రాష్ట్రంలో సీబీఐ ఏ కేసునూ స్వచ్ఛందంగా తీసుకోవడానికి వీల్లేకుండా కట్టడి చేసింది. ఈ క్రమంలో జీవో 51లోని నిర్దిష్ట అంశాల ఆధారంగా కాళేశ్వరం విచారణకు మాత్రం సీబీఐకి అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్డీఎస్‌ఏ), జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌లు విచారణ జరిపిన విషయాలనూ జీవోలో పేర్కొంది. కాళేశ్వరం అవకతవకలపై దర్యాప్తులో సీబీఐకి పూర్తి సహకారం అందిస్తామని తెలిపింది. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ తమకు అందిందని సీబీఐ తెలిపింది. కేంద్ర హోంశాఖ సమ్మతి తెలిపితే సీబీఐ రంగంలోకి దిగనుంది. ఇప్పటికే జస్టిస్ పీసీ ఘోష్ విచారణలో కీలక పత్రాలన్నీ వెలుగులోకి వచ్చాయి. ఆ పత్రాలన్నింటినీ ప్రస్తుతం బీఆర్కే భవన్‌లో భద్రంగా ఉంచారు. సీబీఐ ఈ పత్రాలన్నీ కోరే అవకాశం ఉన్నందున ప్రభుత్వం మంగళవారమే అధికారులను అప్రమత్తం చేసింది. అయితే, ఈ కేసులో సీబీఐ దర్యాప్తు ప్రారంభించాలంటే ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌లోని సెక్షన్ 5 ప్రకారం కేంద్ర హోం శాఖ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. కేంద్రం నోటిఫికేషన్ తర్వాతే మిగతా అంశాలపై సీబీఐ అధికారులు దృష్టి సారించాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిపై సీబీఐ అధికారులు న్యాయ నిపుణులను సంప్రదించనున్నారు.

కాళేశ్వరం విచారణ సాగిందిలా..

ఇప్పటికే కాళేశ్వరం ఎత్తిపోతలలోని అన్ని కాంపొనెంట్లపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) అధ్యయనం చేసి, ఆర్థిక, విధానపరమైన లోపాలను బయటపెట్టిన విషయం తెలిసిందే. కాళేశ్వరంలోని అన్ని కాంపొనెంట్లను అధ్యయనం చేసి, దాదాపు రూ.27 వేల కోట్లకు పైగా అవకతవకలు జరిగాయని, అనవసర వృథా జరిగిందని కాగ్ తేల్చింది. ఇందుకోసం దాదాపు ఏడాదిన్నర సమయం వెచ్చించింది. ఇక 2023 అక్టోబరు 21న కాళేశ్వరం ఎత్తిపోతలలోని మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాకులో 16, 17, 18, 19, 20, 21వ నంబరు పిల్లర్లు కుంగాయి. 2023 అక్టోబరు 24న ఎన్‌డీఎస్‌ఏ అధ్యయనం చేసి, నవంబరు 1న నివేదిక ఇచ్చింది. సరైన ప్రణాళిక లేకపోవడం, డిజైనింగ్, నిర్మాణ నాణ్యత లోపాలతో పాటు ఓఅండ్ఎం లోపాలతో బ్యారేజీ కుంగిందని నివేదిక ఇచ్చింది. దీన్ని గత ప్రభుత్వం తిరస్కరిస్తూ లేఖ రాసింది. ఆ తర్వాత 2023 డిసెంబరు 7న రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక బ్యారేజీ కుంగుబాటుకు కారణాలేంటి? పునరుద్ధరణకు ఏం చర్యలు తీసుకోవాలో నివేదిక ఇవ్వాలని ఎన్‌డీఎస్‌ఏను కోరగా.. నిపుణుల కమిటీ వేసింది. ఆ తర్వాత ఏడాది పాటు సుదీర్ఘ అధ్యయనం చేసి, నివేదికను ప్రభుత్వానికి అందించింది. ఇదే క్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కూడా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై అధ్యయనం చేసి, నివేదికను అందించింది. పలువురిపై క్రిమినల్ కేసులు, క్రమశిక్షణ చర్యలు, పెన్షన్ కోతకు సిఫారసు చేయగా.. ప్రభుత్వం 38 మందికి షోకాజ్ నోటీసులు కూడా ఇచ్చింది. మరోవైపు 2024 మార్చి 14న కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో జరిగిన నిర్లక్ష్యం, లోపాలను పరిశీలించి.. జరిగిన నష్టంపై నివేదికివ్వాలని కోరుతూ ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 115 మందిని ప్రశ్నించి, పత్రాలను పరిశీలించి కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది.

వీరిపైనే గురి..?

రాజకీయంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్, ఈటల రాజేందర్‌నే లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంది. అధికారుల పరంగా ఈ జాబితా భారీగానే ఉంది. మాజీ సీఎస్ ఎస్.కె.జోషి, సీఎంవో మాజీ కార్యదర్శి స్మితాసబర్వాల్, మాజీ ఈఎన్‌సీలు సి.మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, బి.హరిరామ్, బి.నాగేంద్రరావు, హైడ్రాలజీ సీఈ శంకర్‌నాయక్, సీడీవో మాజీ ఈఎన్‌సీ నరేందర్‌రెడ్డి, ఈఎన్‌సీ(ఓఅండ్ఎం) టి.శ్రీనివాస్, రామగుండం సీఈ సుధాకర్‌రెడ్డి, టి.ప్రమీల, శ్రీదేవి, మాజీ సీఈలు బి.వి.రమణారెడ్డి, బసవరాజు, ఈఈలు తిరుపతిరావు, ఓంకార్ సింగ్, పబ్లిక్ వర్క్స్ మాజీ డైరెక్టర్ ఫణిభూషణ్‌శర్మలపైనే విచారణ అంతా గురిపెట్టే అవకాశాలున్నాయి. విజిలెన్స్, జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక కూడా వీరి చుట్టూనే తిరిగింది. ఇక నిర్మాణ సంస్థలపై కూడా విచారణ జరపాలని సీబీఐకి ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లో పొందుపర్చింది. దీంతో ఎల్అండ్‌టీ (మేడిగడ్డ), అఫ్కాన్స్ (అన్నారం- షాపూర్‌జీ పల్లోంజీ అనుబంధ సంస్థ), సుందిళ్ల (నవయుగ)పైనా విచారణ చేపట్టే అవకాశాలున్నాయి.

కాళేశ్వరం అవినీతికి కవితే మొదటి సాక్షి

» ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి

» సీబీఐ అంటే కేసీఆర్‌కు భయమెందుకు?: ఎమ్మెల్యే వీరేశం

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగింది అనడానికి మొదటి సాక్షి కవితేనని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సీబీఐ విచారణ ప్రారంభం కాకుండానే హరీశ్‌రావు, సంతోష్‌రావు అవినీతి చేశారంటూ తేల్చి చెప్పారని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ డైరెక్షన్‌లోనే వారు పని చేశారు కాబట్టి, అవినీతి కూడా ఆయన డైరెక్షన్‌లోనే జరిగిందని స్పష్టమవుతోందన్నారు. సీఎల్పీ మీడియా హాల్లో మంగళవారం మీడియా సమావేశంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టును ఇతర దేశాల్లో కడితే చర్యలు అత్యంత తీవ్రంగా ఉండేవన్నారు. వేముల వీరేశం మాట్లాడుతూ, అపర మేధావి అయిన కేసీఆర్.. సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ఆయన అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేసినప్పుడే అవినీతికి పాల్పడినట్లు స్పష్టమైందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి రూ. వెయ్యి కోట్ల డిపాజిట్లు.. రూ. వేల కోట్ల అవినీతి సొమ్ము ఉందని, వాటి పంపకాల్లోనే పంచాయితీ వచ్చిందన్నారు. కల్వకుంట్ల కుటుంబంలోని పంచాయితీని సీఎం రేవంత్‌కు ముడిపెట్టడం వారి అమాయకత్వమని వీరేశం ఎద్దేవా చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.